సాహిత్య
# ప్రస్థానం

జూలై 2017

## డా॥ సి. నారాయణ రెడ్డి
**29.07.1931 - 12.06.2017**

వెల రూ. 10



సాహితీస్రవంతి



సాహిత్య ప్రస్థానం
జూలై 2017
సంపుటి : 16 సంచిక : 7

# నిలువెత్తు సంతకం..

**చి**చ్చు మింగిన శివుని వారసుల్లో/చివరి వాణ్నిగా వున్నాను../ మధ్య తరగతి మనస్తత్వానికి/ మాయని గాయంలా వున్నాను/ వంచన నుంచి మంచిని వేరు చేసే/ అంచ ముక్కును వెతుకుతున్నాను/ నిట్టూర్పుల వంతెన మీదుగా/నిజాయితీని చేరుకుంటాను/ నిరాశల ఊడల్ని పట్టుకుని/ నింగి అంచుల్ని అందుకుంటాను.

విల్లులా వంగిన వెన్నుపూసతోనే/ విజయదశమి జరపుకుంటాను/ కొడిగట్టిన ఆశయాలతోనే/కోటి దివ్వెలు వెలిగించుకుంటాను..

తన కవిత్వంతో, వ్యకిత్వంతో, తత్వంతో సాహిత్య లోకంలోనూ సభా వేదికల్లోనూ సమాజ గమనంలోనూ నిలువెత్తు సంతకమై నిండు సంకల్పమై నిలిచిన వ్యక్తి సి.నారాయణరెడ్డి. ఆఖరి ఘట్టంలోనూ ఆయన రాసిన కవిత ఈ సంచికలో చూస్తే తెలుస్తుంది ఆ అవిరామ అసమాన అక్షర తపస్సు. ఆయనతో తెలుగు వారంతా ఆత్మీయత అనుభూతించారు. ఆయన మాటలకు చప్పట్లు కొట్టారు. ఆయన పాటలకు పరవశించారు. కవితలకు తలలూపారు. గజల్లలో కరిగిపోయారు.

ఆయన అరుణాశయ చైతన్యాన్ని ఆహ్వానించిన వాడు. కదం తొక్కే సైన్యానికి జేజేలర్పించిన వాడు. పోరాడిన వారికి సంఘీభావం, రాసేవాడికి స్నేహభావం, జీవితాన్వేషకులకు వదాన్యభావం చూపించిన వాడు. ప్రజాస్వామ్య లౌకిక విలువలతో సమధర్మం చాటిన వాడు. సౌందర్య దృష్టి నిలిపిన వాడు,సాహిత్య విత్తులు చల్లి కావ్య సిరులు పండించిన వాడు. ప్రగతికి మిత్రుడు, ప్రతివారికి ఆప్తుడు. జ్ఞానపీఠం ప్రభుత్వాలిచ్చేది. జన హృదయ పీఠం ఆయన తెచ్చుకున్నది.

ఆయన అస్తమించినా ఆ అక్షరాలు స్వరాలూ ప్రతిహృదిలో ప్రతిధ్వనిస్తుంటాయి.

**సినారెకు సాహిత్య ప్రస్థానం అక్షరాంజలి.**

**బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్**

## ఈ సంచికలో ...


కవిత ...... 4
అమ్మా బయలెల్లి నాదె (కథ) ...... 5
కవిత ...... 11
సినారె భళారే! ...... 12
దర్శక దర్శనం ...... 15
నేటికీముఖం మొత్తని ముఖాముఖి...... 17
కవిత ...... 21
కవిత్వానువాదంతో కొన్ని రోజులు ...... 22
కవిత ...... 26
కేబుల్ బంధం (కథ)...... 27
కె. సుభాషిణి అమూల్య కథలు – వస్తు వైవిధ్యం... 31
విదేశాంధ్ర సాహిత్యకారుడు డా॥గూటాల కృష్ణమూర్తి.. 35
కవిత ...... 38
ఇప్పుడిప్పుడే రేకులు విప్పుతున్న పువ్వు...... 39
ఆమె గళమెత్తింది (కథ)...... 41
తెలుగునేలపై కన్నడ శాసనాలు–వరంగల్ జిల్లా.... 45
స్వీకారం...... 47
డైరీ...... 48


సంపాదకవర్గం
తెలకపల్లి రవి (ప్రధాన సంపాదకుడు)
వొరప్రసాద్ (వర్కింగ్ ఎడిటర్)
కె. సత్యరంజన్ • చీకటి దివాకర్
గనారా • శమంతకమణి
• కెంగార మోహన్
కె.లక్ష్మయ్య, మేనేజర్

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520 002,
సెల్: 9490099059
హైదరాబాద్ చిరునామా
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 500 020
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## అసహనం

- నిఖిలేశ్వర్
9177881201




ఏనాడో రాసుకున్న
మతగ్రంథాలు గీసిన
గీతలు దాటలేని
"లకీర్ కా ఫకీర్లుగా"
అశక్తులైన మనమంతా,
కులాల మాయని
ముద్రలతో
పుట్టగానే కట్టుబాట్ల –
సంకెళ్ళతో
స్వేచ్ఛా హననంలో
తిరిగి మధ్యయుగాల్లోకి
పరస్పర అసహనంతో
అంతర్గత ద్వేషంతో
ఊరేగుతూనే వున్నాం
ఈ రోజు మరింత గర్వంగా !

## అతకని పోగు

- నీలం వెంకటేశ్వర్లు
9502411149

అలా గోడవైపే చూస్తున్న
ఆ కళ్ళలో తన బతుకు ఆనవాళ్ళు
అస్థిపంజరాలై వేలాడుతుంటే
తన కలల సౌధం
భళ్ళున నేల కూలింది
స్వాతంత్ర్య పోరులో
దేశాన్ని ఏకం చేసిన చేనేత
నేడు నేతన్నను ఏకాకిని చేసింది
మరమగ్గాల.....
విలయ ప్రభంజనానికి చెల్లాచెదురై
తన కళ తప్ప మరో కళ
ఎరుగని వాడి జీవితం
ఆఫీసు గేట్ల వద్ద
సాష్టాంగ ప్రణామం చేస్తుంది
దారానికి ఆకారం ఇచ్చి
దేశానికి ఆధారమైన వాడు
జానెడు గుడ్డకూ దూరమయ్యాడు
వందల దారాలలో ఒకటి తెగినా
పసిగట్ట గల్గిన వాడి దేగకళ్ళు
తన చుట్టూ అల్లుకున్న కుట్రలను
పసిగట్టలేకపోయాయి
చివరకు
తను నేసిన తలరుమాలే
ఉరితాడై బిగుసుకుంటే
అతని పనిముట్లే...
ఆ కళాతపస్వికి పల్లకీ కట్టాయి



ఆ పనిముట్లే చితినీ పేర్చాయి
ఇంతలో ఒక్కసారిగా
కొలిమిలా కాలుతున్న ఆ చితిలోంచి
ఓ చేదుకర్ర నిలువునా పైకి లేచింది

## మే నెల పురస్కారాలు

**ముక్కుపుడక**
కథకు: రూ.700/-
రచయిత : వహీద్‌ఖాన్

**బాల్యాన్ని చిదిమేస్తున్న బడిహింస**
వ్యాసానికి: రూ.700/-
రచయిత : కరణం శ్రీనివాసులు రెడ్డి

**పిలుపు**
కవితకు : రూ.500/-
రచయిత
: ఉదయ్

కథ, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కారాల చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని
ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

- ఎడిటర్

## కథ

- గనారా
9949228298



# అమ్మా... బయితెల్లినాదె

"తప్పు కొరీల పనియాకిరి టారీ సుకె"

("నేరం చేసినట్లు ఇలా నిలబడడం ఏమిటి?")

"తప్పిని మరి ఆమా జతి కోసం ఈ పోరోవో ఏహిటిదో కొద్దిగా ఓడిగా తమ్మంచె"

("తప్పదు మరి! మన జాతి కోసం- ఈ సంబరం ఈనాటిదా ఏమిటి? కాస్త ఓర్చుకోవాలి.") అన్నాడు రెల్లిపెద్ద అప్పలస్వామి.

"కల్లిగరతే పైటీనే అపు కొరిమండి"

("రేపటి నుండి పనులు ఆపుచేద్దాం") అన్నాడు ఒక యువకుడు.

"యడ ఆమ్‌బొడుతోనో విషయం నీ యడ ఆమ్ పొరొవో నచ్చోనే కెలోదే అమ్మోరులకు సంభంధించిలట ఆడి జతికి సంభందింలట"

("ఇది జీతాభత్యాల సమస్య కాదు. మన సంస్కృతికి సంబంధించింది. జాతికి సంబంధించింది. రెల్లిప్రజల దేవతలకు సంబంధించింది.") అన్నాడు చదువుకున్న ప్రకాశం.

"గట్టిగా మాట్లాడకండి. దొరగారు వచ్చేస్తున్నారు" గేటు దగ్గర సెంట్రీ గట్టిగా హెచ్చరిక చేసాడు.

గేటు లోంచి మోటారు సైకిలు శబ్దం చేస్తూ దూసుకు పోయింది. బయట నిలబడిన ఆ పది మంది గుంపు పక్కకు తప్పకున్నారు. నిమిషం వ్యవధిలోనే జీపు లోపలికి వెళ్లింది. బయట కాపలాగా నిలబడిన సెంట్రీ సెల్యూట్ చేసాడు.

ఆయన జిల్లా అధికారి. యస్.పి. ఆయనతో పాటుగా సెక్యూరిటీగా ఉన్న పోలీసులతో జీపు దిగాడు. ఆఫీసు గుమ్మం ముందు ఉన్న కానిస్టేబులు ముందుకువచ్చి సెల్యూట్ చేసాడు. ఆయన వెనకనే పి.ఏ కూడా ఫైల్సు తీసుకొని అనుసరించాడు.

" మీ కన్నా ముందే వచ్చిన వాళ్లు ఆఫీసు దగ్గర కూర్చున్నారు. అక్కడికే వెళ్లండి. మీ వివరాలు వ్రాసి ఇవ్వండి."

గేటు దగ్గర కాపలా ఉన్న కానిస్టేబులు చెప్పి లోపలికి పంపాడు.

నలుగురు యువకులు, ఓ నలుగురు మధ్య వయస్సు వాళ్లు మరో ఇద్దరు బాగా వయస్సు మళ్లినవాళ్లు వెళ్లి ఖాళీగా చెట్ల క్రింద ఉన్న బల్లపై కూర్చున్నారు.

"దొసగంట ఈసి కెబ్బుకు డక్కొసివో"

(" పది దాటింది ఎప్పుడు పిలుస్తాడో!" అన్నాడు ఒక కుర్రాడు. )


"యెటెనీడగా అచ్చి యాకిరైకిరి బొచ్చు తాత"

(" ఇక్కడ నీడగా ఉంది. ఇలా వచ్చి కూర్చో తాతా!") అన్నాడు ప్రకాశం.

"తు జేకిరి బేగ పైటె యిలా పని దుగు బోల్లెంకె అచ్చెనే

పోలీసులింకే ఆమె బున్నె లోకువగా దిగుచే"

("నువ్వు వెళ్లి త్వరగా పని అయ్యేటట్లు చూడు పెద్దవాళ్లు ఉన్నారు కదా! పోలీసులకు మనమంటే ఎంత నిర్లక్ష్యమో చూస్తున్నావు కదా!") అన్నాడు అప్పలస్వామి.




ప్రకాశం వెళ్ళి పి.ఏని కలిసాడు.

" నెల రోజులుగా మా పిటిషను పెండింగులోనే ఉంది. ట్రాఫికు సి.ఐ.గారు ఇంతవరకు సమాధానం చెప్పలేదు. మా గ్రామదేవత ఉత్సవాల గురించి. అందుకే యస్.పి. గారిని కలవాలనుకుంటున్నాం"

ప్రముఖులు అధికారులు వచ్చి వెళుతున్నారు. గంట నిరీక్షణ తరువాత పి.ఏ. ప్రకాశాన్ని పిలిచి వెళ్లమన్నాడు.

" అందరికి అనుమతి లేదు.ఒక్కలిద్దరే వెళ్ళండి"

ప్రకాశం మరింత వివరంగా ఇంగ్లీషులో చెప్పాడు. పి.ఏ. కాస్త మెత్తబడి ముఖ్యులు నలుగుర్ని వెళ్లమన్నాడు. కులపెద్దల్లో ఇద్దరిన్ని తీసుకొని ప్రకాశం అప్పలస్వామితో లోపలికి వెళ్లాడు.

పి.ఏ వారి పిటిషను నోట్‌తో సహా యస్.పి.ముందు ఉంచాడు. దాన్ని పూర్తిగా చదివి,

"మీ రిప్రజెంటేషను చూసాను. కొన్ని అభ్యంతరాలు ఉన్నాయి. జాతర్లు జరుగుతున్నప్పుడు ఆడ మగ కలిసి తాగి అసభ్య వాతావరణం సృష్టిస్తున్నారు. అందుచేతనే పట్టణంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా రాత్రి పది దాటిన తర్వాత కాని పర్మిషన్ ఇవ్వలేం"

" అమ్మవారి జాతర్లు ఉదయం నుంచి ప్రారంభం అయి రాత్రికి ముగించడం. అనాదిగా వస్తున్న ఆచారం యస్.పి.గారు! రాత్రి పదిదాటిన తరువాత చేసుకొమని సలహా ఇస్తున్నారు.ప్రజలు చూడని,పాల్గొనని పండుగలు ఎక్కడ ఉంటాయి."

"మీ ఆచార వ్యవహారాలు, అలవాట్లు ఈ రోజుల్లో ఎవ్వరు అంగీకరించరు. జంతుబలులు కూడా ఉన్నయన్న రిపోర్టు ఉంది.అలా చేస్తే చట్ట ప్రకారం చర్య తీసుకుంటాం. "కలెక్టరు గారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.""

" మాకు కొన్ని నియమనిష్టలు,సాంప్రదాయులు ఉన్నాయి.ఈ గ్రామదేవతల ఉత్సవాలు అనాదిగా వస్తున్నవే! ప్రతి గ్రామంలో జరిగే పండుగలే! మనుషుల ఆహారంలో భాగంగా ఉన్న వాటినే సమర్పిస్తుంటాం"

యస్.పి. ప్రకాశం వైపు చూసాడు. బాగా చదువుకున్నవాడి వలే ఉన్నాడు.

" పై అధికారులు ఎలా చెప్పితే అలానే నడవాలి. అది మా ఉద్యోగ ధర్మం"

"మేము అడ్డు సెప్పడం లేదు బాబూ! హైదరాబాద్, బొంబాయిలో పెద్ద పెద్ద సంబరాలు సేత్తానే ఉంటారు.పోలీసులే కదా ఎంతో శాంతంగా నడుపుతుంటారు" అప్పలస్వామి అన్నాడు.

"చూడు పెద్దాయనా!... ఉద్యోగ ధర్మం పాటించాలి కదా! నా చేతుల్లో ఏమి లేదు." అన్నాడు యస్.పి.

"బ్రాహ్మణ పూజార్లు, స్వామీజీలు పెద్ద ఎత్తున పూజలు,క్రతువులు చేస్తూనే ఉంటారు. మరి మా పట్ల ఇలా చెప్పడం విచక్షణ చూపడమే కదా! సార్!" అన్నాడు ప్రకాశం.

"ఈ రోజు మీరంతా ఇంతా ధైర్యంగా నాతో మాట్లాడగలుగుతున్నారంటే, విచక్షణ క్రింద వస్తుందా?"

" వాస్తవం అలా లేదు సార్! గ్రామదేవతల్ని చిన్న చూపు చూసే ధోరణి పెరిగింది." అన్నాడు ప్రకాశం.

" ఏమిటయ్యా చూసేది! గ్రామదేవతల పట్ల ప్రతీ ఒక్కరు విశ్వాసాలతోనే ఉంటారు? నేను ఉంటాను. కాని ఉద్యోగరీత్యా నేను పర్మిషన్ ఇవ్వలేను." యస్.పి. నిర్లక్ష్యంగా అన్నాడు.

అప్పలస్వామికి యస్.పి. మాటలో అంతరార్థం ఏమిటో అర్థం కాలేదు.

పక్కనున్న పోలీసు అధికారి " సార్‌కి వేరొక ముఖ్యమైన పనులు ఉన్నాయి.మీరెళ్ళవచ్చు." అన్నాడు. మరింత చర్చకు అవకాశం ఇవ్వకుండా.

అప్పలస్వామి అందరిని తీసుకొని బయటకు దారితీసాడు.


***

విశాలంగా వ్యాపించిన రావి చెట్టు క్రింద విచారంగా అప్పలస్వామి, కుర్చీలో కూర్చున్నాడు.ఎప్పుడూ భుజాన్ని ఉండే కర్ర,చుట్టూ తిరుగుతున్న నాలుగైదు కోళ్ళు, కుక్కలు తన కన్న నలభై ఏళ్ళు చిన్నదైనా, మూడవ భార్య వున్నారు. అంట్లు తోముతూ ప్లాస్టిక్ పాత్రలో మిగిలిన అన్నం వేసి, రోజూ కోళ్ళకు మేతగా పెడుతుంది.అలసట ఆవేశం తెలియనివాడు. ప్రతీది నిదానంగా ఆలోచించాలనుకుంటాడు.

అప్పలస్వామి ఎనభైఐదులో పడ్డాడు. కిర్సనాయిలు ట్యాంకర్ పై జపాను వాళ్ళు బాంబులు వేసేసరికి, పదిహేను

ఏళ్ళు. తల్లిని తీసుకుని సామర్లకోట పారిపోయాడు. రెండు ఏళ్ళకు తిరిగి వచ్చి మెజిస్టిక్ థియేటర్‌లో మరుగుదోడ్లు కడగడానికి చేరాడు.

తల్లి దండ్రులు, అత్త మామలు, భార్య, చెల్లి, తమ్ముడు, బంధుగణం మిగిలిన వారు కాలం చేస్తున్నా, తరం తరిగిపోతున్న కాలంలో అప్పలస్వామి మూడో భార్యకి సంతానం కలిగింది.




ఆ పేటలో అతని రక్తసంబంధీకులు కాని వారు, బహుకొద్ది మంది మాత్రమే! అప్పలస్వామి తన రెల్లి జాతి పట్ల ముందు చూపు వున్న వాడు. కాబట్టే, ఏ పిల్లవాడన్న ప్రేమ పేరుతో పెళ్ళి చేసుకుంటే, లక్షణంగా ఆహ్వానించేవాడు, పేటకు సమీపంలో ఇతర దళిత కులాలతో తమ ఆడ పిల్లలు జత కడితే, అవతలి పెద్దలతో, పెద్ద పెద్ద పంచాయితీలు నడిపి, ఆ కులపు కుర్రోళ్ళను తన కులంలో కలుపుకున్న ముందు చూపు ఉన్న వాడు.

వాళ్ళందరిని మున్సిపాల్టీలో తుక్కుబళ్ళకు, ట్రాక్టర్స్‌కు డ్రైవర్సుగా, కాలువలో పూడికలు తీసే పనికి పెట్టేవాడు. మరి కాస్త పై మెట్టులో వాళ్ళని ప్రభుత్వ ఆసుపత్రిలోనూ,రైల్వే లోనూ,ఇతరత్రా ఆఫీసులలో,తోటపనులకు పూరమాయించే వాడు. వారికి, గౌరవం కల్గించడంలో వెనుకాడేవాడు కాదు.అతనికి ఊహ తెలిసినపుడు నుండి రక్త సంబంధీకులు ఆధునిక మరుగుదొడ్లులేని రోజుల్లో మట్టి దొడ్లనే శుభ్రం చేసేవారు. మున్సిపాలిటీ వారు నెలకు ఇరవై ఐదు రూపాయిలు జీతంగా ఇచ్చే వారు.కల్లా కపటం లేకుండా ఆ వృత్తినే నమ్మి జీవించాలి.

పని ముగించుకున్న భార్య వెంకయమ్మ, వీధి చివరిలో వున్న కాఫీ హోటల్‌కు వెళ్లి, రెండు ఇడ్లీ, టీ తెచ్చి అప్పలస్వామికి ఇచ్చింది. తాను తాగుతూ ప్రక్కనే కూర్చుంది.

బొమ్మ టీ-షర్ట్, జీన్ ప్యాంటు, చెవిపోగు, మెడలో చైను, ఎడమ చేతికి రంగు రంగు త్రాళ్ళు కట్టి, లక్ష రూపాయిలు ఫైనాన్స్ మోటారు సైకిలు ఆపి, అమ్మ వారికి వంగి వంగి నమస్కారం చేసాడు. అప్పల స్వామికి వరసకు మనమడు.

"సొక్కునాకా కేటికి జెలీసురే!"

(ప్రొద్దుటే ఎక్కడకి పోతున్నా రా!)

"యింకా సంభరం ఊరేగింపు కోసం ఆర్డర్సు అయినాని తాత! సంభరం దిగినే వారం రోజులు అచ్చి సోచ్చి ఏర్పాట్లు ఈజిసి "

("ఇంకా ఊరేగింపు కోసం పోలీస్ పర్మిషను రాలేదు కదా! సంబరం చూస్తే వారం రోజులే ఉంది, అన్ని ఏర్పాటు జరిగిపోతున్నాయి!")

"పోలీసు లింకే పరిమిషన్ దిన్నితే బొలిచి తొమేపైటి తోయే కొరోడి తట్టా సంగతులు దిగిమా"

("పోలీసోళ్ళు పర్మిషన్ ఇవ్వనని చెప్పేసారు కదా! మీ పని మీరు చెయ్యండి రా! మిగతా సంగతులు చూద్దాం")

"శడా పైడి కొరి లించో పోలీసులు లింకు ఆమ్ డిపార్టుమెంటు సంగారే బుత్ పైడి తాసి డాక్టరు గారికి కోయి కిరికొరి పించుచి"

("అదే పని చేస్తున్నం. పోలీసులకు మా డిపార్ట్‌మెంట్‌తో చాలా పని ఉంటుంది. మా డాక్టర్‌గారి ద్వారా ప్రయత్నిస్తాను.")

" సొబ్బి గానకు కబుర్నే అందిసికి!"

(" సరేలే అన్ని ఊళ్ళకు కబుర్లు అందేయా!")

వడ్డి పోలమ్మ తల్లి కులదేవత, చిన్న రాతివిగ్రహం, రావిచెట్టు క్రింద ఎండా వానలకు, తరతరాలుగా ఉండిపోయింది, ఇప్పుడు ఆ పేట ప్రజలు ప్రతిష్టాకరంగా దేవాలయాన్ని నిర్మించుకున్నారు. ఒక రోజు వేతనంతో పాటు ప్రజలు వద్ద విరివిగా విరాళాలు వసూళ్ళు చేసి, నిధులు దుర్వినియోగం కాకుడదని, కమిటీ వేసి, పెద్ద గుడినే నిర్మించారు.

కాని,

ఊరేగింపుకు ఉన్నత అధికారులు అంగీకరించటంలేదు. పెద్దలు మనస్తాపంతో ఉన్నారు. అణగారిపోతున్న జాతుల సంస్కృతిలో తమది కూడ కాకూడదని పట్టుదలతో ఉన్నారు.

"మీ పైటికి జెంమ్మసే తాత. ఆజి తింటా పోస్టుమటము కేసులు అచ్చి!"

("నేను డ్యూటికి వెళ్ళాలి తాత. ఈ రోజు, మూడు పోస్టుమార్టం కేసులు ఉన్నాయి.") అంటూ మోటార్ సైకిల్ పై కను చూపు మేర దాటి పోయాడు.


కల్యాణం వారి కోడలు నైటీలో, సెల్ ఫోన్ మాట్లాడుతూ వీధి లోకి వచ్చింది, పిల్లాడ్ని చెట్టు క్రింద వున్న అమ్మవారికి నమస్కారం చేయమంది. కాన్వెంట్ బస్ ఎక్కించడానికి ముందు వున్న సెంటర్‌కి తీసుకెళ్తూ వుంది. మామగారు కౌన్సిలర్ చేసాడనే ఒకింత గర్వం.

"సడకిరా పిల్లా ! పోదురుకు సారాకా ఆ సుకిరా!"

(" అదేంటే పిల్లా ! వీధి లోకి అలాగే! వచ్చేది!") అంది వెంకయమ్మ.

"సొక్కునే ఖాళీ ఈమంచేనీకి!"

('' ప్రొద్దుటే ఖాళీ చేసుకోవాలిగా....") అంటూ వయ్యారం వలకపోసింది ముప్పై ఏళ్ళ కోడలు పిల్ల




"తో గోయితా దీది నల్ల దీది వోరిని ఎట్టె దిగినే బూత్ ఆడవుడుగా అచ్చి!"

(''నీ మొగుడు రెండు రోజులు నుండి ఎక్కడ కనపడటంలేదు! ..... ఇక్కడ ఇంత హడావిడిగా వుంటే !!") అప్పలస్వామి మందలింపుగా అన్నాడు.

"మొ ఆడబొడుచొకు దన్నేతే రాజమండిక్రు జేసి. ధవళేశ్వరం అయులింకాల్ల పోరోదోకు అయి బొల్దె కబుర్లుకోతే జేసి !"

(" మా ఆడపడుచును తీసుకురావడానికి రాజమండ్రి వెళ్ళాడు. అక్కడ నుండి ధవలేశ్వరం మనవాళ్ళందరికి కబుర్లు అందించి వస్తానన్నాడు!"

ఆమెను చూసి కాలక్రమంలో 'రోజులు ఎలా మారిపోతున్నాయో!' అనుకున్నాడు.

కాలంతో పాటుగా, పాత సంప్రదాయాలు, నిర్లక్ష్యం చేయబడుతున్నా; ఇప్పుటి కాలం వారికి తమ అస్తిత్వానికి ఊపిరి పోయాలనుకుంటున్నాడు అప్పలస్వామి.

తొమ్మిది అయ్యింది.

వీధిలో హడావిడి తగ్గింది. రాత్రి రోడ్లు తుడిచిన వాళ్ళ మెల్లగా ఇంటికితిరిగి వస్తున్నారు. స్కూలు, కాలేజీ పిల్లలు సిద్ధపడుతున్నారు. కాయగూరల వాళ్ళు, పాల సైకిళ్ళ వాళ్ళు వీధుల్లో తిరుగుతున్నారు. నీళ్ళ టాంకరు, తుక్కు తీసుకుపోయే బండి కదులుతున్నాయి.

"మీా సా జేకిరి పనిదన్నే గునుజి. ఇడ్లిలు కైకిరి జోంచి!"

(" నేను అలా వెళ్ళి మంచి నీళ్ళు తెచ్చుకుంటాను, ఇడ్డిన్నులు తినేయి. చల్లారిపోతాయి!") అంటూ వెంకాయమ్మ అక్కడ నుండి వెళ్ళింది.

మున్సిపాలిటిలో రిటైర్ అయిన నరసమ్మ మెల్లగా నడుచుకుంటూ అప్పలస్వామి వద్దకి వచ్చింది , చెప్పినా వినకుండా పీరు సాయిబును పెళ్ళి చేసుకుని అష్టకష్టాలు పడింది. అతను కాలం చేసినా నలుగు పిల్లల్ని పెంచి పెద్ద చేసింది.

''యాకిరి నాన్న పిల్లానుకు తెలియపరిచితాన కోడల్లు సంగతి తెతే తెలుసును!"

(''ఇదిగో నాన్నా! పిల్లలకి తెలియనియ్యకు. కోడళ్ళ సంగతి నీకు తెల్సు కదా!'') అంటూ వెయ్యి రూపాయిలు గుడికి చందా యిచ్చింది.

"పంచాయితి కురన్రుకు దీపదే!"

("కమిటీ కుర్రోళ్ళకు ఇవ్వవే!")

తమ పండుగలు జరుపుకోవడానికి అడ్డంకులు వస్తున్నాయని గ్రహించిన ప్రతీ కుటుంబం ముందుకు వచ్చి సహాకరిస్తున్నాయి.

"తంకు దిన్నే గొరోబిత్తర పిల్లనుకు తెలుసుజూచి!"

("అళ్ళకి ఇస్తే ఇంట్లో పిల్లలకు తెల్సిపోతాది!")

తెల్లవారుజామున రైలు కట్ట అవతల పర్రలో డప్పు ప్రాక్టీస్‌కు వెళ్ళిన కుర్ర బృందం వచ్చి, అప్పన్న కాళ్ళకు నమస్కరించి, నాలుగు దరువులు వేసారు.

"కరస్రాము లింకే సెట్టక అచ్చె తాత!"

("కర్ర సాము వాళ్ళు అక్కడే వున్నారు. తాత!")అంటూ ఎవ్వరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళి పోయూరు. వాళ్లని చూస్తే గర్వమనిపించింది. సినిమాలకు షికార్లకు పోయే వయస్సులో కూడా వారిలో వారసత్వ లక్షణాల ఛాయలు చూస్తున్నాడు.


చిన్నతనంలో ఇదే పేటలో వీధి లైట్ల వద్ద తమ గ్రామదేవతల వీర గాయకులు వచ్చి గానం చేసే వారు. ఇంటింటికి పోయి వారికి తినడానికి ఏమైనా తెచ్చేవాడు. అందులోని ఆధ్యాత్మిక చింతన, స్పర్శ, అంతరాలని తాకేవి. జాంబవంతుడు వలే అవ్వాలని, కర్ర సాములు నేర్చుకున్నాడు, బాణా కర్ర తిప్పడంలో చుట్టుప్రక్కల అతనికి పోటీ లేరు.

రెండు రోజులు నుంచి అప్పలస్వామికి ఆందోళనగా ఉంది. దేవతల ఊరేగింపుకు, కళా ప్రదర్శనకు కుంటిసాకులతో పోలీసులు అనుమతి ఇవ్వలేదు. గతంలో అనేక సందర్భాలలో తమ దేవతల ఉత్సవాలకు అనుమతి నిరాకరించారు.

బ్రాహ్మణ పూజారులకు అడుగులకు మడుగులొత్తే అధికారులు ఇలా తమ పట్ల ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు?.

అరవై ఏళ్ళుగా బతుకు గూర్చి పోరాటం జరుగుతూనే ఉంది. తమ చుట్టూ ఇతర శూద్ర కులాల పేటలు ఉన్నా,

రెల్లి కులాన్ని దూరంగానే ఉంచారు. నీళ్ళ దగ్గర, దారులు వద్ద.... బడిలో, గుడిలో తన స్థానం ఏమిటో గుర్తుకు వచ్చింది. ఈ నిచ్చెన మెట్లకు దిగువనున్న జాతి తనదని గ్రహించి ధృఢ నిశ్చయానికి వచ్చి మెల్లగా ఇంట్లోకి వెళ్ళాడు. భార్య పండగని ఇంటిని శుభ్రం చేసి సున్నం కొట్టింది. అతని పట్ల గౌరవంతో పేటంతా శ్రమచేసి కట్టిన ఇల్లు. కాలగర్భంలో కలిసి పోయిన వారు కలిసి పోగా మిగిలిన మనువళ్ళు, మనవరాళ్ళు, రక్తసంబంధీకుల మధ్య సంతృప్తిగానే జీవితం గడిచిపోతుంది.




"మీ చాకిరి రొడ్డుకు జేకిరి అంచీ!"

(" నేను అలా రోడ్డు మీదకు వెళ్ళి వస్తాను.") అంటూ ఇంటి లోంచి బయటకు నడిచాడు.

ప్రకాశం నలభైఏళ్ల నిరుద్యోగి. రిజర్వేషను పనికి రాలేదు.అటు ఆ పనికి, ఇటు ఈ పనికి రాణించ లేదని తండ్రి బాధ. పెళ్ళికి దూరంగా ఉన్నాడు. నమ్రత కలిగిన వాడనిపేరు.

ఆ పేటలో ప్రకాశానికి ఏనలేని గౌరవం ఉంది. అప్పలస్వామి దగ్గరే తమ జాతి గూర్చి, పూర్వీకుల చరిత్ర గూర్చి తెలుసుకుంటాడు. అవే విషయాలు పత్రికల్లో వ్రాస్తుంటాడు. రెండు, మూడు భాషలు తెలిసినవాడు. వేదాలు, పురాణాలు చదివాడంటారు. అగ్రవర్ణాల స్నేహితులు ఇతర కులాల, పెద్దలు, నాయకులు వస్తుంటారు. ప్రకాశం వల్లనే ఆ పేటలోని వాళ్ళంతా ఇప్పుడిప్పుడే చైతన్యవంతులవుతున్నారు.

ఇంటి మెట్లు ఎక్కుతుంటే అప్పలస్వామిని చూసి ప్రకాశం అక్క ఆహ్వానంగా ఎదురొచ్చింది.

"కేబ్బే ఆయిచు పిల్లా!"

(" ఎప్పుడొచ్చావే పిల్లా!")

"రత్తరే అయించి తాతా!"

("రాత్రే వచ్చాను తాతా")

"సొబ్బి లింకే బొల్లా అచ్చెనా ! పిల్లాకు సంబందాలు దిగిలేచోడిని ఎట్టె చదివిగిల్లా కురాన్రే అచ్చెపిని నీతే!"

("అంతా కులాసేనా!.. పిల్లకు సంబంధాలు చూస్తున్నావట! ఇక్కడ చదువుకున్న కుర్రాళ్ళు లేరా!")

"హైద్రాబాదు సంబంధం బోల్లో చదువు గిల్లా లింకే .అచ్చె బొట్ట కంపెనీరే యాభైవేలు బొడోతోనో!"

(" హైదరాబాదు సంబంధం. బాగా చదువుకున్నాడు పెద్ద కంపెని. యాభై వేల జీతం")

అప్పలస్వామి మాట్లాడలేదు.తమ జాతి నాలుగు చెరలా విస్తరిస్తూ అభివృద్ధికి వస్తున్నారనే సంతోషం.

"బోల్లో లింక్ బొలటలింకేనా!"

(" కుటుంబం మంచిదేనా!")

"మామ సొబ్బి బాల్లోగా తెలియపర్చి సీగి నీల్లి నేను మను లాంఛనాలు బూత్ మగుచేపిని!"

(" మామగారు అన్ని వివరంగా తెలుసుకున్నారు. కాకపోతే కట్నం ఎక్కువ అడుగుతున్నారు.")

మాటలు వింటూ ప్రకాశం గదిలోకి వెళ్ళాడు. ప్రకాశం అప్పల స్వామిని లోపలికి తీసుకు వెళ్ళాడు

'ఎంతైనా చదువుకున్నావాడే కదా! చక్కగా అమర్చుకున్నాడు.' బల్ల నిండా పుస్తకాలే!

"కిరాతాత! పోరాఒకు చొచ్చి సర్ధిగిని అంచి జరిపించుగా నుంచి"

(" ఏం తాతా! సంబరానికి అన్ని ఏర్పాట్లు జరిగాయా!")

"చిన్న కురగ్రానే బిలికి కొరుగిని జేల్లిచే, కాని ఊరేగింపుకు పోలీసు లింకే ఒప్పిగిని వోరోని!"

(" కుర్రాళ్ళు బాగానే చేసుకుపోతున్నారు. కాని, ఇది ఎటు దారి తీస్తుందో!")

"యే రత్తికి బొలింకు దక్కుచో సోబ్బిలింకే మిసిరికి నిర్ణయం కడిగిమంది"

("ఈ రాత్రికి కులపెద్దలను పిలుస్తాను. అందరం కలిసే నిర్ణయం తీసుకుందాం")


ప్రకాశానికి కూడా గత ఏడాది నుంచి ఈ విషయమై బాధగానే ఉంది. అగ్ర వర్ణాలు వారి ఉన్నత వర్గాల కులాల ఉత్సవాలకు లేని అడ్డు, రూల్సు తమ కుల దేవతల సంబరాలకు ఏమిటో! అతని మనస్సులో అనేక ప్రశ్నలు వచ్చాయి.

"పోదిరే గ్రామములో పైటెనే కొరిల లింకు దక్కిమా"

("ప్రక్క గ్రామ పంచాయితీలలో పనిచేసే వాళ్ళను కూడా

పిలుద్దాం") అన్నాడు అప్పల స్వామి

అన్ని మతాలలో ఆచారాలు, విశ్వాసాలు ఉన్నా; తమకు ఒక ఆధ్యాత్మిక చింతన ఉందని దాన్ని అంగీకరించలేని పదునైన బలమైన వర్గం అనాదిగా అధిపత్యం చేస్తుందని ప్రకాశానికి ఒక దృఢమైన అభిప్రాయం ఉంది.




"సోబ్బె గాన రేతి బోల్లాంకే మూల ఆచే తల్లా అమ్మాకు కొల్చు గోనుచే గొప్పకోసం జనుముకు ఆమా జితికి వారసత్వం మిసిగింమ్మచే బులి కోరిక తాని!"

(" అన్ని గ్రామాల పెద్దల్ని రప్పిద్దాం .మూల దేవతను కొల్చుకుంటారు. గర్వంగా ప్రజలకు మనజాతి వారసత్వాన్ని ప్రదర్శించాలనే కోర్కె ఉంది.") అప్పలస్వామి వేదనతో పెగలని గొంతు నుండి నాలుగు వాక్యాలు బయటకు వచ్చాయి.

మూలదేవతలకు నాగరిక దేవుళ్ళ, పూజరులకు మధ్య అనాదిగా వైరుధ్యం ఉందని చరిత్ర చదివిన ప్రకాశానికి తెలుసు. వారి తాత్విక పునాది ఒక మాయ. మూల దేవతలు తమ మధ్యే జీవించారని అప్పలస్వామి అనేక సార్లు చెప్పడం ప్రకాశానికి గుర్తుంది. ఇదే వాస్తవమని ప్రకాశం అంగీకరిస్తాడు.

"తూ కిచ్చి బెంగ దీగిని తేనా తాత!"

(" నువ్వేమీ దిగులు పడకు తాత!")

అప్పలస్వామి మెల్లగా అక్కడ నుంచే బయటకు వచ్చాడు.

* * *

యువకులందరూ పట్టుదలతో ఉన్నారు. అప్పలస్వామి, ప్రకాశం నాయకత్వం కొండంత బలాన్నిచ్చింది. కూత వేటు దూరంలో రైలు కట్ట అవతల ఉన్న బహిరంగ స్థలం వేదిక అయ్యింది. యాభై ఎకరాల బీడు భూమి.

తమ తమ బంధువర్గాల వారికి ఫోన్లు ద్వారా సమాచారం వెళ్ళింది. చదువుకున్న యువకులు సోషల్ మీడియాను ఉపయోగించుకున్నారు. గ్రామ గ్రామాలకు మైకులతో ప్రచారం చేసారు. పెద్ద తిరునాళ్ళుగా మారిపోయింది.

అదో పెద్ద జాతర.రెండు రోజులు ముందు నుంచే అనేక దుకాణాలు ఏర్పడ్డాయి. నీడనిచ్చే షామియానాలు, మరుగుదొడ్లు సకల సౌకర్యాలతో ఆ ప్రాంతమంతా విద్యుత్ దీపాలంకరణతో సిద్ధంచేసారు. బాణాసంచా కాల్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, రవికెలముక్కలు అమ్మే దుకాణాలు.ఆ గ్రౌండ్ అంతా వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసే షాపులు ఎన్నో ఎన్నో ఆకర్షణీయమైన వస్తుసముదాయాలతో నిండి పోయింది. తినుబండారాలు,టీ స్టాల్స్ ఉన్నాయి.రంగుల రాట్నాలు వచ్చాయి, కోయ డాన్సులు, కోలాటం, గరగ నృత్యాలు, తమ జాతి మూలపురుషుడు జాంబవంతుని ప్రతిరూపమైన ఎలుగు బంటి ఆట ఒక్కటేమిటి అంతరించిపోతున్న బుర్రకథ, తోలు బొమ్మలాట, నాటకాలు.

పట్టణం చుట్టు ప్రక్కల రెల్లిపేటలోనూ ప్రక్క గ్రామాలలోనూ సంబర వాతావరణం ఏర్పడింది. రెండెడ్ల బళ్ళను, ట్రాక్టర్లను ఆకర్షణీయంగా అలంకరించారు. వాటిపై వివిధ రకాల వేషధారణల ప్రదర్శనలు ఉంటాయి. కొన్నింటిపై గ్రామదేవతల విగ్రహాలు ఉంచారు.

ఉదయం ఆరుగంటల నుంచే రెల్లిపేటల్లోని ప్రతీ కుటుంబంలో పండుగ వాతావరణతో హడవిడిగా మారిపోయింది.పేటల్లోనుంచి, గ్రామాల్లోనుంచి భక్తులు కానుకలతో రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం రెండు దాటిన తర్వాత అప్పలస్వామి అన్ని పేటలకు అమ్మవారి ప్రదర్శనకు తీసుకురమ్మని కబురు పంపాలని అక్కడి పెద్దలతో అన్నాడు.

"ఆయేనే లోబడినంచే కచ్చితంగా అమ్మవారి ఊరేగింపె జరిపించి మంచే"

"మనం రాజీపడకూడదు. తప్పనిసరిగా అమ్మదేవతల ఊరేగింపు జరపాల్సిందే"

"పోలీసుల సంగారే గాడావకిరా తంకే కోయిల పని కొరివే అమ్మావారు శునుగునుచోనీవో"

"పోలీసులతో గొడవేటి? వాళ్ళు చెప్పినట్లు చేస్తే అమ్మవారు ఊరుకోదా?" అన్నాడు ఒక పెద్ద.

"ఊరేగింపు కెబ్బుకు కొరి మంచే బుల్ పశ్రని సవాల్ కొరికెది సడకు ఎదురించే మంచే"

"ఊరేగింపు ఎప్పుడు చెయ్యాలన్నది కాదు ప్రశ్న. మన అస్తిత్వాన్నే సవాలు చేసే దాన్ని ఎదుర్కొవల్సిందే" అన్నాడు ప్రకాశం తీవ్రస్థాయిలో.

***(ఈ కథలోని రెల్లిభాషకు సంబంధించిన సంభాషణ ప్రముఖ మున్సిపల్ వర్కర్ల నాయకుడు శ్రీచెన్నబాబులు గారు (కాకినాడ) అనువాదం చేసి సహకరించారు. వారికి ధన్యవాదాలు. - రచయిత)***

## కవిత

### పదాలు

- డా॥ ఎన్. గోపి



ఎక్కడెక్కన్నో
దేశ దిమ్మరిలా తిరుగుతుంటాను
పైసలున్నా లేకున్నా
జేబులో కొన్ని పదాలు మాత్రం
కదలాడుతుంటాయి
పైకి కనపడవు
కాని చేతికి తగుల్తుంటాయి

మొన్న ఓ పదం
వేళ్ళకు అంటుకుంది
ముఖమంతా జేవురించి
లోలోపల
నిశ్శబ్దంగా ఉడికిపోతుంది
మరికొన్ని పదాలు వచ్చి చేరితే గాని
నోరు విప్పేటట్టు లేదు.

పదాలు ఎప్పుడూ
పదాలుగానే వుండవు.
మొన్న ఓ అమ్మాయిని
తగులపెట్టారని తెలిసి
వాల్కెనోలుగా మరుగుతున్నాయి
రైతును కరువు కాటేసినప్పుడల్లా
పొలం నెర్రెల నిండా దూరి
బుసలు కొడుతుంటాయి

జైలు కటకటాలకు
లోపలికీ బయటికీ
పరుగులు తీస్తూ గాయపడతాయి
తిరుగుబాటుదారుల చంకసంచుల్లో
నిప్పుకణికలై జ్వలిస్తాయి

పైకి సాదాసీదాగా
మౌనం వహించే పదాలు
అనుభవాల కొలుముల్లో కాగి
ఎరుపెక్కిపోతాయి

నిజానికి నిఘంటువులు
నిశ్శబ్దంగా వుంటాయి
కాని ఒక్కొక్క పదాన్ని
శుభ్రపరచడం ప్రారంభించావా
పుటపుటలో
విస్ఫోటనాలే !

### రాతికౌగిట్లో

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
9948774242



మానసిక చీకటి
అదృశ్యంగా అందలమెక్కించినట్లే వుంటూ
అగాధాల్లోకి దారితీస్తుంటూంది

కల్పన, వాస్తవాల కలనేత సమాజం
ఏ పోగు దేనిదో నిర్ధారించలేని జడత్వం
మనిషి తత్త్వమై మారాకు తొడుగుతూంది !

వ్యసనాలు కృత్రిమానందాల కోడెనాగులై
మనో వాక్కాయాల మీద ఆడుతుంటాయ్ !
సామాజిక వక్షస్థలం మీద మొలుచుకొచ్చిన
కులాల కొమ్ములు, మతాల పొంగులు చూపించి
పాలరొమ్ములుగా నమ్మింప చూస్తున్న నయవంచకులు !

స్మరణాతీత కాలం నుంచి చూస్తూనే వున్నాం
మనిషి సమస్యల పుట్ట
చాంచల్యపుమెట్ట
గతాన్ని వెంటతెచ్చుంటాడో లేదో !
మనిషి జనన ద్వారం నుండి రాడానికి

వో అమ్మకావాలి
వర్తమానంలో భవితకు ఏమి విడిచి వెడతాడో ! ఏమో !
మరణద్వారం నుండి వెళ్లడానికి
ఎవరి ఆదరణ అవసరం లేదు !
జనన మరణాల మధ్య
తోరణపాకైన జీవనసూత్రాన్ని
అర్ధంతరంగా తెంపే మేధావుల వ్యర్థప్రయోగాలు
వ్యవస్థ ఊపిరి జిగును ఆరబెడుతూ
నిరాశ నిస్పృహలకు అల్లుకుపోతున్న కన్నీటితీగలు
మనిషి రాతికౌగిళ్ళలో చిక్కాక
ఎంతయేడ్చి మొత్తుకున్నా “ఎర్రని కేకలు” వినిపిస్తాయా ?!



# సినారె.. భళారే!

**- తెలకపల్లి రవి**

***సినారె జీవిత, వ్యక్తిత్వాలు తన సాహిత్యోధృతికి తీసిపోవు. కవులంటేనే ఆవేశంతో పాటు ఆరాచకం అవిభాజ్యమనే భావన ఆయన పూర్వపక్షం చేశారు. ఎన్టీఆర్ ఏఎన్నార్‌లు చిత్రరంగంలో క్రమశిక్షణ తెచ్చారని అంటుంటారు. సాహిత్య రంగంలో ఆ విధమైన క్రమ శిక్షణ, శ్రమ శిక్షణ కూడా తీసుకువచ్చింది నా ఉద్దేశంలో సినారె. సృజనకారులకు రచనా శక్తి తప్ప నిర్వహణా దక్షత వుండదనే అంచనాలూ పటాపంచలు చేస్తూ అనేకానేక బాధ్యతలు నిర్వహించారు.***

సాహిత్యస్ఫూర్తి, సమయస్ఫూర్తి, సభాస్ఫూర్తి, స్నేహస్ఫూర్తి కలబోసుకున్న స్ఫురద్రూపి సినారె. రాతకూ కూతకూ పాటకూ మాటకూ కలానికి గళానికి సరిహద్దులు చెరిపేసిన వారు. కొన్నేళ్ల కిందట త్యాగరాయ గానసభ వేదికపై 'నిలకడగా వున్న నీళ్లలో కమలాలే కాదు, క్రిములూ పుడతాయి' అని చరణాలు చెప్పి తన కవిత్వం ప్రవాహ గుణ ప్రధానమన్నందుకు నన్ను మెచ్చుకున్న సినారె సభలో పాల్గొనని రోజు వుండేది కాదు. ఇంత సభా సంచారంలోనూ కూడా నిత్య కవితా రచన! 'ఊపిరాడ్డం లేదు, ఉక్కపోస్తుంది నాకు ఏసీ గదిలో.. కారణం తెలిసి పోయింది.. కవిత్వం రాయలేదు..' అన్నది ఆయన తపస్సు. ఆయన ఆప్యాయంగా అందంగా సంతకం చేసి ఇచ్చిన అనేక సంపుటాలు ఇందుకు నిదర్శనంగా నా దగ్గరున్నాయి. 85వ జన్మదినోత్సవాన కవితా సంపుటం వెలువరించిన వారెందరున్నారో పరిశోధకులు చూసుకోవచ్చు.

సి.నారాయణరెడ్డి వంటి బహుముఖ ప్రతిభావంతులు సవ్యసాచులూ చాలా చాలా అరుదు. 'నా కవిత్వం చాలా మందిని ఇన్‌స్పైర్ చేసిందని నాకు తెలుసు. నా జీవిత చరిత్రకు ఆ శక్తి లేదేమో'నని మహాకవి శ్రీశ్రీ అనంతంలో రాసుకున్నారు. కాని సినారె జీవిత, వ్యక్తిత్వాలు తన సాహిత్యోధృతికి తీసిపోవు. కవులంటేనే ఆవేశంతో పాటు ఆరాచకం అవిభాజ్యమనే భావన ఆయన పూర్వపక్షం చేశారు. ఎన్టీఆర్ ఏఎన్నార్‌లు చిత్రరంగంలో క్రమశిక్షణ తెచ్చారని అంటుంటారు. సాహిత్య రంగంలో ఆ విధమైన క్రమ శిక్షణ, శ్రమ శిక్షణ కూడా తీసుకువచ్చింది నా ఉద్దేశంలో సినారె. సృజనకారులకు రచనా శక్తి తప్ప నిర్వహణా దక్షత వుండదనే అంచనాలూ పటాపంచలు చేస్తూ అనేకానేక బాధ్యతలు నిర్వహించారు. పోతనను గాక శ్రీనాథుడిని గుర్తుచేసే మీరు పాలకవ్యవస్థలో భాగమయ్యారనే విమర్శకు జవాబేమిటని అడిగినపుడు నా పదవులు అవసరమైన వారికి సహాయం కోసం వినియోగించానని చెప్పారు. ఆయన ఆశీస్సులతోనే అధ్యాపకులు ఉద్యోగులు పరిపాలకులు అయిన వారెందరో! ఆయన నుంచి అభినందనలు అందుకోని యువ నవ రచయితా వుండరు. నిరంతర కృషీ, నిఖిల జన బాంధవ్యం ఆయనది.

'వచ్చిండన్నా వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటేనన్నా' అని ఘంటాపథంగా చెప్పిన సినారెకు ఉర్దూ హిందీ కూడా కరతలామలకమే. శ్రీశ్రీ అనంతర శబ్దబ్రహ్మ ఆయన. మితంగా గాక విస్తారంగా రాస్తూనే వున్నారు గనక భాషా పరమైన

ప్రయోగాలు మరెన్నో చేయడానికి అవకాశం ఏర్పడింది. సినారె కవితా చరణాలు, చలన చిత్ర గీతాలూ, ప్రసంగ పద విన్యాసాలు వాటికవే పాఠాలుగా వుంటాయి. విద్యార్థిగా గ్రంథాలయానికి వెళ్లి నెహ్రూపై ఆయన ఎర్రగులాబి చదివినప్పటి చరణాలు '...ఇంకెవరిది జవహారునిది.. గరళము మింగిన గుర్తే కనిపించని నవహారునిది" ఇప్పటికీ మరుపురావు. బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది అనే ఆయన వాక్యానికి కిక్ కల్చర్ కిక్‌బ్యాక్ కల్చర్ వచ్చింది అని జోడిస్తే మహానందపడిపోయారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రారంభానికి వచ్చిన ఒక మంత్రి గారు 'ఇక్కడ విశ్వరంభ లాటి చాలా పుస్తకాలు చూశాను' అన్నారు. తర్వాత మాట్లాడిన సినారె 'ఇక్కడ అన్ని రకాల మంచి పుస్తకాలు వున్నాయి. విశ్వంభరలు వున్నాయి. విశ్వరంభలు లేవు' అనగానే చప్పట్లు! ఇరవై ఏండ్ల కిందట జ్ఞానపీఠం వచ్చినప్పుడు 'అరిస్తే' గొంతు పోతుందంటారు. 'అణిస్తే' కూడా పోతుంది.. పురస్కారం తర్వాత సంతోషం గొప్పగా ప్రకటించకుండా వినయం నటిస్తూ మాట్లాడుతుంటే గొంతు పోయింది' అన్నారు. 'ఈ పురస్కారం కోసం గతంలో నేనే స్వయంగా శ్రీశ్రీ ఆరుద్రల పేర్లు ప్రతిపాదించాను. కేంద్రం అంగీకరించలేదు. ఏం చేస్తాను.. ఇప్పుడు నాకు వచ్చింది' అంటూ చెప్పడం ఆయన నమ్రత. ఆరోగ్యం దెబ్బతిన్నాక ఒక సారి సుద్దాల హనుమంతు సంస్మరణ సభకు వచ్చారు. "ఎక్కువ సేపు మాట్లాడను. వున్నాడు మన తెలకపల్లి రవి, చిట్టా విప్పుతాడు, గుట్టు మట్టు చెప్పుతాడు" అంటూ చమత్కరించి వెళ్లిపోయారు. ఆయనతో పాల్గొన్న సభల్లో ఇలాటి జ్ఞాపకాలు అందరికీ వుంటాయి.

***'ఈ పురస్కారం కోసం గతంలో నేనే స్వయంగా శ్రీశ్రీ ఆరుద్రల పేర్లు ప్రతిపాదించాను. కేంద్రం అంగీకరించలేదు. ఏం చేస్తాను.. ఇప్పుడు నాకు వచ్చింది' అంటూ చెప్పడం ఆయన నమ్రత.***

అలనాటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలంగాణ రచయితల సంఘం బాధ్యుడుగా మొదలై తర్వాత అభ్యుదయ రచయితల సంఘం వరకూ పనిచేసిన సినారే కడవరకూ ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదిగానే వున్నారు. సోవియట్ విచ్ఛిన్నం తర్వాతా 'పైనున్న మంచు కరిగినా పర్వతం కరిగిపోదు' అని ఆశయాల అజేయత్వాన్ని చాటారు. అర్థం కాని వారికోసం 'ఎవడురా కూసింది కమ్యూనిజం చచ్చిపోయిందని.. మనిషి రక్తం ఎర్రగా వున్నంత వరకూ అది అజేయం' అని మరింత సూటిగా చెప్పారు. పచ్చదనాన్ని నిషేధించాలనుకున్న రాజుగారి భంగపాటుపై పాట రాశారు. గద్దర్‌పై హత్యాప్రయత్నం జరిగితే డొక్క కడుపులో పొడిచారని అభిశంసించారు. బాబరీ మసీదు విధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తూ 'నిర్మించండి కూల్చకండి' అని వివేకానందుణ్ని ఉటంకించారు. తెలుగు జాతి మనది 'నిండుగ' వెలుగు జాతి మనది అని, 'రెండుగ' వెలుగు జాతి మనది అని ఆయా సందర్భాలలో తన హృదయ స్పందనను అందంగా పొందించారు.

ఎన్టీఆర్ పిలుపుపై 'నన్నుదోచుకుందువటే' అంటూ సినిమా జగత్తులో ప్రవేశించిన సినారె 'రవ్వంత సడిలేని రసరమ్య గీతాల'తో అందరినీ దోచుకున్నారు. 'పగలే వెన్నెల' కాయించారు. 'అ అమ్మ ఆ ఆవు' అంటూ అక్షరాభ్యాస గీతాలు రాసి అలరించిన ఆయన 'చదవులతో పని ఏమి హృదయమున్నచాలు' అని అవిద్యావంతులనూ ఓదార్చారు. 'అనగనగా ఒకరాజు' అంటూ కొడుకుల అనాదరణ చూసిన పెద్దమనిషిపై పాట కట్టిన ఆయన 'అనుబంధం ఆత్మీయత' అంతా ఒక బూటకం అంటూ మానవ సంబంధాల విచ్ఛిన్నాన్ని గానం చేశారు. 'మనసున్న మనిషికి సుఖము లేదంతే' అని ఆత్రేయ శోకిస్తుంటే 'మనసే మనిషికి తీయని వరమూ' అని సినారె ఆశాభావం చాటారు. మరింత బలంగా 'గోరంతదీపం కొండంత వెలుగు చిగురంత ఆశ జగమంత వెలుగు' అని రాశారు. 'గాలికి కులమేది' అని ప్రశ్నించారు.. 'స్నేహమేరాజీవితం' అంటూ కవ్వాలిని అద్భుత సందేశంతో తెలుగీకరించారు. కృష్ణ కుచేల గాథను ఆధునిక హరికథగా మలచి పుర్రెనాతలూపారు. 'వందేమాతర గీతం వరసమారుతున్నదని' హెచ్చరించారు. సిన్ని ఓ సిన్ని అని కోనసీమ పాటనూ ఒసే రాములమ్మ అంటూ తెలంగాణ గొంతును ఇది రాయలసీమ గడ్డ అంటూ సీమ స్వరాన్ని కూడా కవికట్టారు. కదిలింది అరుణసైన్యం అని చైతన్యగానం చేశారు.

ప్రాచీన కావ్యాలకే పరిమితమైన తెలుగు పరిశోధనను సమగ్ర ఆధునికత వైపు మరల్చిన అగ్రగామి ఆయన. ఆధునిక ఆంధ్ర కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు అన్న పరిశోధనతో ఆయనకు వొక్క పీహెచ్‌డీ వచ్చింది గాని దానివల్ల వందలమంది డాక్టరేట్లు పొందారన్నది సాహిత్యలోకంలో నానుడి. ఆయనలోని పరిశోధకుణ్ని కవి వక్త కప్పేశారు గాని

## కవిత

# చెట్టులిపి

- మెర్సీ మార్గరెట్
9052809952



రక్తంలో తడిస్తే ఏంటి
చేతులు
చెట్టులా మొలకెత్తగలిగినపుడు
ప్రతి పుస్తకంలో
చెట్టులా మాట్లాడుతున్నప్పుడు

రక్తాన్ని దర్శించిన కళ్లు
చీకట్లను తవ్వుతూ వెళ్లి
ఏదో ఓ చెట్టు కింద జ్ఞానోదయం కోసం
ధ్యానం చేస్తాయి
లోలోన ప్రపంచాన్ని కప్పే మహావృక్షం
కళ్లు తెరుస్తుందప్పుడు

స్వేచ్ఛకోసం
చదువుకోసం మాట్లాడిన గొంతుపై
తూటాలవర్షం కురిసినపుడు
మొక్కను నాశనం చేశామనుకున్నారు వాళ్లు
చెట్టులా మారిన గొంతిప్పుడు
ప్రపంచ శాంతికపోతం

రక్తాన్ని పాలుగా మార్చే స్తనాల్ని
పసిగొంతుతో తడిమిన నీ తొలి క్షణాల్లో
నీలోను ఓ చెట్టు దాగుంది
అద్వైతాన్ని బోధిస్తూ
మానవీకరణ నేర్పిస్తూ
వర్ణాలజాడ ఎరుగని చెట్టు
రక్తపు కళ్లతో స్వచ్ఛంగా నవ్వుతూ
ఆకుతొడుగుతుంది

అశోకుడు
గౌతముడు
మలాల
నువ్వు ఏదైతేనేం ఇపుడు
చెట్టు
అతిపురాతన మహాబోధకుడు

---

సాహిత్య విజ్ఞాన ఖని. కనుకనే పాటల సోపానాలు ఆధిరోహించాక పాఠాలు చెప్పడం మానలేకపోయారు. తరగతి గదిలో 'బంధిత శ్రోతలు' వుంటారనే అపప్రధను భగ్నం చేసి ఐచ్ఛికంగా అన్ని శాఖల విద్యార్థులు వచ్చి వినేలా చేశారు.

చారిత్రిక కారణాల రీత్యా భావ కవిత్వం అభ్యుదయ కవిత్వం వంటి పరిణామ క్రమం తెలంగాణలో యథాతథంగా రాలేదు గనక –అప్పటికే లబ్ద ప్రతిష్టులైన శ్రీశ్రీ దాశరథి ఆరుద్ర కుందుర్తి వంటి వారి సమక్షంలో తనకంటూ ఒక స్థానాన్ని సాధించుకోవడానికి కర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం వంటి కావ్యాలు రాశానని ఆయన నాకొక ఇంటర్వ్యూలో చెప్పారు. తర్వాత గేయాలు విరివిగా రాశారు. 70, 80 దశకాలలో దిగజారుతున్న దేశ పరిస్థితులలో మధ్యతరగతి మథనానికి సినారె కవితలు అద్దం పడతాయి. మంటలూ మానవుడు, మధ్యతరగతి మందహాసం, మట్టి మనిషి ఆకాశం వంటి పేర్లే అందుకు సంకేతాలు.

మానవుల చిరంతన ఘర్షణకు సంకేతమైంది విశ్వంభర. శృంగార ప్రధానంగా గాక సామాజిక మానవీయ కోణాలతో రూపొందిన తెలుగు గజల్స్ అచ్చంగా ఆయన సృష్టి. వాగ్గేయ సంప్రదాయంలో వినూత్న ప్రయత్నం అది. అలాగే ప్రపంచ పదులు. పెద్ద వయసులోనూ వాటిని తనే మృదు మధురంగా ఆలపించి అభిరుచి చాటుకున్న కళాపిపాసి. సినారె భళారె అన్నిట్లో హుషారె అంటూ శ్రీశ్రీ నలభై ఏళ్ల కింద ఒకింత వ్యంగ్యంగా అన్న మాటలు తన నడవడి చూసిన కాలం ఇప్పుడు నిండు మనసుతోనే నినదిస్తుంది. ఇంతటి సాహితీ శిఖరానికి ఘనంగా తుది వీడ్కోలు పలికేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపడం, ఇద్దరు తెలుగు ముఖ్యమంత్రులతో సహా ప్రముఖులు ప్రజలూ కదలి రావడం సముచితంగా వుంది. 'తానున్నా లేకున్నా తన పేరు నిలవాలి' అని ఒక పాటలో ఆయనే రాసినట్టు తెలుగు వారి గుండెల్లో సినారె చిరస్థాయిగా నిలిచివుంటారు.

నివాళి

# దర్శక దర్శనం..

- తెలకపల్లి రవి

*చాలా మాటలతో, నాటకీయతతో ముంచెత్తినట్టు కనిపించే దాసరిలో భావుకత చూడాలంటే మేఘసందేశంలో ఆకాశదేశాన, శివరంజనిలో జోరు మీదున్నావు తుమ్మెద, సీతారాములులో తొలిసంధ్యవేళలో, గోరింటాకులో కొమ్మకొమ్మకో సన్నాయి వంటివి గుర్తుచేసుకోవచ్చు. నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా, ఒసే రాములమ్మ వంటి ఆయన చిత్రాల పాటలు తెలుగు వారి చైతన్యంలో భాగమై పోయాయి.*



దాసరి నారాయణరావు (04.05.1942 - 30.05.2017)

**1973.** ఇంటర్మీడియట్ చదువుతున్న కాలం. క్లాసుల కన్నా సినిమాలకు వెళ్లడం ఎక్కువ. అందులో తేడాలు తప్పొప్పులు గొప్పలు తెలుసుకోవడం ఆనందం. అప్పుడొచ్చింది తాత మనవడు. ఒక కుదుపు. అప్పటి వరకూ ఎన్టీఆర్‌పార్టీ, ఎఎన్నార్ పార్టీ కాదంటే కొత్తగా వస్తున్న కృష్ణ శోభన్‌బాబులకే పరిమితమైన మా కుర్ర బుర్రలు హుషారెక్కాయి. రాజబాబు, సత్యనారాయణ, ఎస్వీఆర్, అంజలి వంటివారితో అంత పెద్ద హిట్. అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం పాట.. అన్నీ వూపేశాయి. చెప్పాలంటే తెలుగు సినిమా కొత్తమలుపు తిరిగింది. గూడవల్లి రామబ్రహ్మం, కెవిరెడ్డి, బిఎన్‌రెడ్డి, ఆదుర్తి, ప్రత్యగాత్మ, కె.ఎస్. ప్రకాశరావు వంటి హేమాహేమీలను చూసినప్పటికీ సగటు ప్రేక్షకులకు మొదటి సారి దర్శక దర్శనం జరిగింది. తారాలోకంలో తారలే వుంటారన్న భావన పోయి- దాసరి నారాయణరావు పేరు మేఘాల్లో కనిపించింది. అదిగో అలా ప్రేక్షకుల దృష్టిలోకొచ్చిన దాసరి మరో 25 ఏళ్లపాటు తెలుగు సమాజంలో బహుముఖ ప్రజ్ఞతో ప్రభావం చూపించారు. ప్రయోగాలు చేసి ప్రకంపనాలు తెచ్చారు. ఢక్కాముక్కీలు తిన్నారు.. ఏది ఏమైనా ఒక వటవృక్షంలా ఎందరికో నీడనిచ్చారు. వందమంది దర్శకులు రచయితలు ఆయనను తమ గురువుగా చెప్పుకుని సత్కరించుకోవడం కన్నా ఇందుకు మరో నిదర్శనం అవసరం లేదు. కన్నీరు అబద్దం చెప్పదు. ఎందరో సీనియర్లు ఆయనే తమ తండ్రి అని కన్నీరు మున్నీరయ్యారు.

అగ్ర నటులు, మహాదర్శకులు, గొప్ప కవులు, రచయితలు దక్షత గల నిర్మాతలు వున్నా చాలాకాలం మన సినిమా మూసధోరణిలోనే నడిచింది. కదిలిస్తే ఏమవుతుందోననే భయం రాజ్యమేలింది. క్రమంగా ఇద్దరు పెద్ద హీరోల తీరుతెన్నులే సర్వస్వం శాసించిన దశ మారుతున్నది. 1972, 73ల్లో మంచి చిత్రాలు చాలా వచ్చాయి. పరిశోధకులు చూసుకోవచ్చు. ఉత్తరోత్తరా తెలుగుతెరపై గొప్ప పేరు సంపాదించబోతున్న కె.విశ్వనాథ్, బాపు కూడా 1972లో హిట్లు ఇచ్చి ఈ ఏడాది కొనసాగుతున్నారు. తెలుగుతెర మార్పునకు సిద్ధమైందన్నమాట. (రాఘవేంద్రరావు మాత్రం మరో మూడేళ్లకు అంటే 1976లో బాబు ద్వారా రంగ ప్రవేశంచేస్తారు.). ఈ ముగ్గురికి తరతమ తేడాలతో స్వంత నేపథ్యాలున్నాయి. విశ్వనాథ్ తండ్రి సినీసాంకేతిక నిపుణుడు. రాఘవేంద్రరావు తండ్రి కెఎస్‌ప్రకాశరావు దిగ్గంతుడైన దర్శకుడు. బాపు చేయి తిరిగిన చిత్రకారుడు. పైగా ముళ్లపూడి తోడు. పోల్చకూడదు గాని వీరితో పోల్చితే దాసరికి అలాటివిలేవు. శైలిపరంగానూ రాఘవేంద్రరావు మొదటి రెండు మూడు చిత్రాలు పక్కనపెడితే తర్వాత వాణిజ్య ఫార్ములాలనే పండించారు. విశ్వనాథ్ మొదట్లో సామాజిక చిత్రాలు తీసినా తర్వాత సంగీతం పేరిట సంప్రదాయ ధోరణిని ఎత్తుకున్నారు. ఇక బాపు తనదైన కళాత్మకత ముళ్లపూడి మార్కు సందేశం కలిపి అందంగా తీయడంపై దృష్టిపెట్టారు. దాసరి అలాటి నిర్వచనాలు మార్చేశారు. తమిళంలో బాలచందర్ వంటివారు తెచ్చిన ఆఫ్‌బీట్ పద్దతులను ధైర్యంగా అనువర్తింపచేశారు. సెంటిమెంట్లనూ సామాజిక సమస్యలనూ కూడా మేళవించారు. చిత్రీకరణలో సింబాలిక్ షాట్స్ పెంచారు. నాటకీయ సంభాషణలు తెచ్చారు. కొత్త సంవిధానానికి కొత్త ముఖాలు కూడా అవసరమని నిరూపించారు. వచ్చిన కొద్ది కాలంలోనే యవ్వనం కాటేసింది వంటి చిత్రం తీయడం దాసరి సాహసదృష్టిని నిరూపించింది. ఆ తర్వాత కొన్నేళ్లకు కూడా బాలచందర్ అంతటి దర్శకుడు గుప్పెడు మనసులో

అనుకోకుండా అత్యాచారానికి గురైన నాయిక ఆత్మహత్య చేసుకున్నట్లే చూపించారంటేనే ఇది ఎంత సాహసమో తెలుస్తుంది.

అన్ని రకాల చిత్రాలు అంత సంఖ్యలో తీసి విజయాలు సాధించింది దాసరి మాత్రమే. మానవ సంబంధాలు దెబ్బతినడం అన్న ఒక్క అంశంపైనే తాతమనవడు,సూరిగాడు, బహుదూరపు బాటసారి, ఓ తండ్రి తీర్పు, బంగారు కుటుంబం, తదితర చిత్రాలు తీశారు. మహిళల గొప్పతనాన్ని చెప్పడానికి రాధమ్మ పెళ్లి, భారతంలో ఓ అమ్మాయి, కళ్యాణి, శివరంజని, కంటే కూతుర్నే కను, ఒసే రాములమ్మ, ఓ ఆడది ఓ మగాడు,మజ్ను , అమ్మ రాజీనామా వంటివన్నీ అందించారు. పిల్లల పెంపకంపై నీడ తీశారు. తన నాటక నేపథ్యానికి గుర్తుగా చిల్లరకొట్టుచిట్టెమ్మను తెరకెక్కించడమే గాక రంగూన్ రౌడీ పేరును ాపయోగించారు. కళాత్మక విలువలతో సున్నితమైన సమస్యతో మేఘ సందేశం అందించారు. అక్కినేనిని దేవదాసుగా మళ్లీ పుట్టించి ప్రేమాభిషేకంతో మరో మహాప్రేమికుడుగా మలచారు. సావిత్రిని మళ్లీ తీసుకొచ్చి అహెూ అనిపించారు. ఎన్టీఆర్‌ను సర్దార్‌గా, బొబ్బిలిపులిగా మార్చారు. . శోభన్‌బాబుతో బలిపీఠం గోరింటాకు వంటి చిత్రాలు తీసిన దాసరి కృష్ణతోనూ చక్కటిచిత్రాలు రూపొందించడమే గాక విశ్వనాథనాయకుడు వంటి చరిత్ర కథనూ తీసుకొచ్చారు.కృష్ణం రాజుతో దశలవారిగా పలు రకాల చిత్రాలు తీసి కటకటాల రుద్రయ్య, రంగూన్‌రౌడీ వంటి వాటితో దశను మార్చేశారు. వాటి రీమేక్‌తో హిందీ సినిమానూ వూపేశారు. మెగాస్టార్ రిక్షావోడుకు పోటీగా నారాయణమూర్తితో ఒరే రిక్షా తీసి ఆహెూ అనిపించారు. మోహన్‌బాబు, మురళీమోహన్, నారాయణమూర్తి, వంటి వారికి ఆయనే ప్రారంభకుడు. ఇవన్నీ సినిమా మాటల్లా కనిపించినా వీటి వెనక ఒక సామాన్యుడు సాధించిన విజయం వుంది. ఇందుకు కారణం ఏమంటే ఆయన ఏదో నైరూప్య పరిపూర్ణత కోసం పాకులాడలేదు. . కుటుంబ సంబంధాలు, ప్రేమలు విప్లవాలు, కులమతాలు, మహిళల అసమానత, ఉద్యమాలు, సాయుధ పోరాటాలు, రాజకీయ వ్యూహాలు, కళాప్రస్థానాలు ఒకటేమిటి ఆయన చేయని ప్రయోగం లేదు. ఆయనకు చాలా ఇష్టమైన అద్దాలమేడలో సినిమా జగత్తును చూపించి శివరంజని ద్వారా నాయికను శిఖరాగ్రాన ప్రతిష్టించారు. రావూరి భరద్వాజ పాకుడు రాళ్లు నవలకు మరో కోణం మనం శివరంజనిలో చూడొచ్చు. నటుడుగానూ ఆయన చిత్రాల సంఖ్య, విజయాలు కూడా తక్కువ కాదు. ఖచ్చితంగా 20ఏళ్లకిందట వచ్చిన ఒసే రాములమ్మ ఆయన చివరి ఘన చిత్రమని చెప్పొచ్చు. మరో మూడేళ్ల తర్వాతదైన కంటే కూతుర్నుకను కూడా జోడించవచ్చు.ఇంత భారీగా చేసినప్పుడు లోపాలోపాలుకూడా వుంటాయి. కాని ఆయన వెలిగించిన దీపాలే ఎక్కువ.

చాలా మాటలతో, నాటకీయతతో ముంచెత్తినట్టు కనిపించే దాసరిలో భావుకత చూడాలంటే మేఘసందేశంలో ఆకాశదేశాన, శివరంజనిలో జోరు మీదున్నావు తుమ్మెద, సీతారాములులో తొలిసంధ్యవేళలో, గోరింటాకులో కొమ్మకొమ్మకో సన్నాయి వంటివి గుర్తుచేసుకోవచ్చు. నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా, ఒసే రాములమ్మ వంటి ఆయన చిత్రాల పాటలు తెలుగు వారి చైతన్యంలో భాగమై పోయాయి.అన్నట్టు వేటూరితో పోట్లాట వచ్చి తనూ పాటలు రాయడం మొదలుపెట్టి కొన్ని మంచివి కూడా రాశారు.అన్నీ సహాయకులతో చేయించాడనేవారు ఎప్పుడూ వుంటారు గాని స్వంత శక్తి లేకుండా అది జరిగేపని కాదు. విశ్వనాథ్ అంతటివారు నోరు లేని మాలాటి వారికి ఆయన నోరిచ్చారని జోహార్లు చెప్పడం దాసరి జీవితంలో అతి గొప్ప భాగం. సినిమా కార్మికులు పనివారు బక్కమనుషుల కోసం నిలబడ్డారాయన. పత్రికా రంగంలోనూ మూసధోరణిని చేదించి కొత్త వరవడి పెట్టిన ఆయన వరవడి కూడా మరవలేనిది. ాదయం పత్రిక అస్తమించి వుండొచ్చు గాని ఆ కిరణాలు అన్ని చోట్లా ప్రసరించాయి. దాసరి దంపతుల దానధర్మాలు సేవలు కూడా అందరికీ తెలుసు. సామాజిక రాజకీయకోణం.స్వంత పార్టీతో రాజకీయాల్లోకి రావాలనుకొని వివిధ ప్రభావాలతో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఎంపిగా మంత్రిగా దీర్ఘకాలం పనిచేశారు. ఆ కాలంలోని కాలుష్యం ఆయనపైనా పడివుండొచ్చు. అదంతా విచారణలో వుంది. ఆ సందర్భంలోనూ మూలపీఠమైన ప్రధాని కార్యాలయాన్ని విచారించాలని దాసరి ధైర్యంగా అడగడం సమంజసమే. రిలయన్స్ వివాదంలో జైపాల్‌రెడ్డి, స్వంత కేసులో చిదంబరంకూడా అలాటివే మాట్లాడారు.అప్పటికి ఇప్పటికీ అది జరగలేదు. జరగదు కూడా. చివరి దశలో ముద్రగడ పద్మనాభం తలపెట్టిన ఆందోళనలో పెద్దన్న పాత్ర దాసరి ఆఖరి క్రియాశీల జోక్యమని చెప్పాలి. ఆ వెంటనే ఆయన ఐసీయులో చేరిన సన్నివేశం. అప్పటికే పరిస్థితి అర్థమై పోయింది. ఆయన ఆఖరి పుట్టిన రోజును అందరూ చేరి ఆ మహాదర్శకున్ని గౌరవించడం సంతృప్తి కలిగించిన సందర్భం. కట్టించిన కోటలేమో మిగిలిపోయెను..కట్టుకున్న మారాజు తరలిపోయెను అని ఆయన ఎవరికి వారే యమునాతీరేలో పాట. దాసరి వెళ్లిపోయినా ఆయన విశ్వరూపం చిరస్థాయిగా వుంటుంది.

**(సినారె, దాసరిల నివాళి వ్యాసాలు ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

***విశ్వనాథ్ అంతటివారు నోరు లేని మాలాటి వారికి ఆయన నోరిచ్చారని జోహార్లు చెప్పడం దాసరి జీవితంలో అతి గొప్ప భాగం. సినిమా కార్మికులు పనివారు బక్కమనుషుల కోసం నిలబడ్డారాయన.***

# నేటికీ ముఖం మొత్తని ముఖాముఖి

- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
9440222117



*తెలుగులో అభ్యుదయసాహిత్యం కొనసాగుతుండగా దిగంబర కవిత్వం వచ్చింది, విప్లవ సాహిత్యోద్యమం పురుడు పోసుకుంటున్నది. తెలుగు రాష్ట్రంలో వేర్పాటు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. రాజకీయ పార్టీలలో చీలికలు ప్రజలకు చికాకు కలిగిస్తున్నాయి. స్వాతంత్ర్య ఫలాలు ప్రశ్నార్థకమౌతున్నాయి. స్వతంత్రం వచ్చి పాతికేళ్ళు నిండుతున్న సందర్భంగా, దేశం స్వాతంత్ర్యరజతోత్సవాలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో, స్వాతంత్ర్యానంతర భారతీయ సామాజిక పరిణామాలను విమర్శనాత్మకంగా ప్రతిబింబిస్తూ సి. నారాయణ రెడ్డి గారు 'ముఖాముఖి' కావ్యం రచించారు.*

***రగులుతున్న పంక్తులు***
***పగుళ్ళువారిన పాదాలు***
***నెత్తురోడ్చే అక్షరాలు***
***కత్తిమొన లాంటి కవిత***

(డా.సి. నారాయణరెడ్డి సమగ్రసాహిత్యం, 9వ సంపుట: పు.113)

అభ్యుదయకవితకు అందమైన నిర్వచనమిది. ఇది డా సి.నారాయణరెడ్డి గారు రచించిన 'ముఖాముఖి' కావ్యంలోనిది. ఈ కావ్యం 1971లో వచ్చింది. ఇందులోని కవితలన్నీ 1971లో రచించినవే. ఆ కవితలు అప్పటి భారతీయ సామాజిక వాస్తవికతకు ప్రతిఫలనాలు, అంతే కాదు. ఆ కావ్యానికి ఈనాటికీ ఎంతో ప్రాసంగికత ఉంది. 1971 నాటికి భారతదేశానికి స్వతంత్రం వచ్చి ఇరవైనాలుగేళ్ళయింది. అప్పటికే స్వతంత్రంమీద ఉన్న ఆరాధనా భావం తగ్గనారంభించింది. అనేక ప్రశ్నలు, అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దేశంలో విప్లవోద్యమాలు పురుడు పోసుకుంటున్నాయి. ఆ ప్రభావం సాహిత్యం మీద కూడా పడుతున్నది. తెలుగులో అభ్యుదయసాహిత్యం కొనసాగుతుండగా దిగంబర కవిత్వం వచ్చింది, విప్లవ సాహిత్యోద్యమం పురుడు పోసుకుంటున్నది. తెలుగు రాష్ట్రంలో వేర్పాటు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. రాజకీయ పార్టీలలో చీలికలు ప్రజలకు చికాకు కలిగిస్తున్నాయి. స్వాతంత్ర్య ఫలాలు ప్రశ్నార్థకమౌతున్నాయి. స్వతంత్రం వచ్చి పాతికేళ్ళు నిండుతున్న సందర్భంగా, దేశం స్వాతంత్ర్యరజతోత్సవాలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో, స్వాతంత్ర్యానంతర భారతీయ సామాజిక పరిణామాలను విమర్శనాత్మకంగా ప్రతిబింబిస్తూ సి. నారాయణ రెడ్డి గారు 'ముఖాముఖి' కావ్యం రచించారు.

ఈ కావ్యంలో సినారె ప్రశ్నించిన, ఎత్తిచూపిన, విమర్శించిన అనేక సామాజికాంశాలు నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఇవాళ కూడా కొనసాగుతున్నాయి. కొన్ని మరింత క్రూరంగా కూడా తయారయ్యాయి. అందుకే "ముఖాముఖి" కావ్యం ప్రాసంగికత నేడుకూడా ఉంది. అభ్యుదయకవిగా సినారె అప్పటికి జరిగిన అభివృద్ధిని దాని వెలుగుచీకట్లతో ఆవిష్కరిస్తూనే, మారని కోణాలను, మారవలసిన కోణాలను ఎత్తి చూపారు. ఈ కావ్యానికి గుండెకాయ వంటి కవిత "నాదేశం కనిపించింది" అన్నది.

మనకు బాగా అలవాటైన లక్షణం ఆత్మోత్కర్ష, పరనింద. కాని ఆరోగ్యకరమైన లక్షణం, విమర్శ, ఆత్మవిమర్శ. మొదటిది పాలకవర్గ లక్షణం. రెండవది ప్రగతిశీల లక్షణం. మనదేశం గొప్పతనాన్ని గురించి మన పాలకులు, ఆధిపత్యవాదులు చాలా ప్రచారం చేస్తుంటారు. మన దేశాన్ని మచ్చలేని చందమామను చేస్తుంటారు. ఇది కడుపునిండిన వాళ్ళ లక్షణం. కడుపు

మాడేవాడి దృష్టి వేరు. అయితే మన దేశానికి ఉండే గొప్పతనం ఉంది. గొప్పతనంలో కూడా ఎవరి గొప్పతనం వారిది. ఏమైనా మనదేశం గొప్పతనం గురించి అతార్కిక ప్రచారాన్ని అభ్యుదయ కవి ఆమోదించడు. అభ్యుదయకవి ఉన్న గొప్పతనాన్ని ఆమోదిస్తూనే, సిగ్గుపడాల్సిన విషయాలను కూడా ఎత్తిచూపుతాడు.

*నా దేశం పావన గంగ*
*నా దేశం కరుణాంతరంగ....*
*గౌతముడు పుట్టిన నేల*
*గాంధీ పుట్టిన నేల.....*
*ఇది నా దేశం ఇది నా దేశం*
*ఇదే ఇదే నా దేశం*

(పైది : పు. 104)

అని ఎవరో ఉపన్యసిస్తున్నారు. కవి విన్నాడు. అలాంటి భారతదేశాన్ని వెతకడం ప్రారంభించాడు. ఇల్లిల్లు తిరిగాడు. ఎక్కడెక్కడో వెతికాడు. కవికి భారతదేశం కనిపించింది. కాని పాలకులు ప్రచారం చేసిన రూపంలో కనిపించలేదు. అందుకు విరుద్ధమైన రూపంలో కనిపించింది. తిరగబడి కనిపించింది. తలక్రిందులుగా కనిపించింది.

*మండిపోతున్న గంగానదిలో*
*రెండుగా చీలుతున్న కావేరిలో*
*మోడువడ్డ బోధివృక్షంలో*
*పుండువడ్డ భూమాతవక్షంలో*
*నాదేశం కనిపించింది.*

(పైది : పు. 106)

అని వర్ణించాడు కవి. అంటే ప్రచారానికీ, వాస్తవానికీ పొంతన లేదు అని అర్థం. అంతమాత్రం చేత కవి గతాన్ని పూర్తిగా తిరస్కరించాడని కాదు. వర్తమానాన్ని విస్మరించి గతంలో ఈదులాడే ధోరణిని ఎండగట్టడమే కవి చేసిన పని. సినారె తక్కిన కవితలో భారతదేశాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఎత్తిచూపారు.

*నోట్లకట్టల మధ్య నలిగే*
*ఓట్ల జన్మహక్కులలో....*
*పెచ్చరిల్లే ధరల దూకుడులో.....*
*డిగ్రీలమూట మూపున కట్టుకొని*
*ఆఫీసుల చుట్టూ చాంద్రాయణం చేసే*
*నిరుద్యోగుల నిట్టూర్పు సెగళ్ళలో....*

(పైది : పు. 108)

కవికి భారతదేశం కనిపించింది. రాజకీయ అవినీతి, ధరల పెరుగుదల, నిరుద్యోగం గత నాలుగున్నర దశాబ్దాలలో ఎన్ని వందల రెట్లు పెరిగాయో ఆశ్చర్యం వేస్తుంది. సినారె ఇవాళ 2017లో ఈ కవిత రాశారనిపిస్తుంది. అభ్యుదయకవికి అవినీతిరహిత, ఆకలిరహిత భారతదేశం ఒక స్వప్నం. అంతేకాదు

*శ్రమజీవుల చెమటబిందువులను*
*జాతిరత్నాలుగా తలచేది*
*మంచికి నిలబడ్డ మనిషిని*
*మహర్షిగా కొలిచేది*

(పైది)

ఇదీ అభ్యుదయ కవి భారతదేశ స్వప్నం. ఈ కవితలో కవి ప్రస్తావించిన రాజకీయ పార్టీల కుమ్ములాటలు, సరిహద్దు గొడవలు, హింసాసంస్కృతి, ఎన్నికలలో డబ్బుపాత్ర, విలువల పతనం, బలవంతుల పీడన వంటివి 1971 నాటికన్నా ఇవాళ ఇంకా ఎక్కువయ్యాయి. చట్టసభలలో అవినీతి ఆరోపణలు వింటుంటే దిగ్భ్రమ కలుగుతుంది. స్వతంత్ర భారతదేశం ఏ సమస్యను పరిష్కరించింది? అని అనిపిస్తుంది. అందుకే "ముఖాముఖి" కావ్యం 1971 నాటిదైనా, అది 2017 నాటిది కూడా.

అభ్యుదయ కవిది వర్గదృష్టి. శ్రమదోపిడి అభ్యుదయ కవికి శత్రువు, సంపద దాని సృష్టికర్తలకే చెందాలన్నది అభ్యుదయకవి ఆకాంక్ష. శ్రమదోపిడికి శ్రామికుల తిరుగుబాటే పరిష్కారమన్నది అభ్యుదయకవి సిద్ధాంతం. "ముఖాముఖి"లో నారాయణరెడ్డి గారు ఈ అంశాలనన్నిటినీ పొదిగించారు. నిచ్చెన, బొక్కెన అనే రెండు వస్తువులను శ్రామికులకు ప్రతీకలు చేశారు.

*నువ్వూ నేను నిచ్చెనలం*
*ఎవ్వరికో ఏతామెత్తే బొక్కెనలం*

(పైది : పు. 101)

ఈ నిచ్చెన, ఈ బొక్కెన ఇన్నాళ్ళు సంపన్నులకు సహనంతో ఊడిగం చేశాయి. ఇప్పుడు అవి తమ శ్రమ దోపిడి అవుతున్నదని తెలుసుకున్నాయి. మేల్కొన్నాయి.

*చిక్కిన ఫలితమంతా / ఒక్కడికే దక్కుతుంటే / ఒక్కడే బొక్కుతుంటే..../ ఉగ్గబట్టలేక వెలిగక్కిన / అగ్గిసెగల ఊర్పులివి*

(పైది : పు. 102)

అని పీడితుల చైతన్యాన్ని వర్ణించాడు కవి. శ్రీశ్రీ 'వ్యత్యాసం'లో కవిత చెప్పిందదే.

అభ్యుదయకవి విముక్తవాది. పీడన నుంచి, వివక్షనుంచి, దోపిడి నుంచి ప్రజలను విముక్తం చేయడం, మనుషులకు నిర్బంధంగా తగిలించిన సంకెళ్ళను తెగగొట్టడం, శ్రామికులకు స్వేచ్ఛ సహజహక్కుగా గుర్తించడం వంటివి అభ్యుదయకవుల లక్ష్యాలు. స్వేచ్ఛకోసం జరిగే ఏ చిన్న పోరాటాన్నైనా అభ్యుదయ కవులు సమర్థిస్తారు. సినారె "స్వేచ్ఛాఫలం" కవితలో బైబిల్‌లోని ఆడం ఈవ్ కథను తీసుకొని మానవుని స్వేచ్ఛాప్రీతిని ఆవిష్కరించారు.

***కిటికీ చువ్వల చుట్టూ / ఆటమటిస్తున్న తీగ/ నుంచి విడిపోవాలని/ ఊగిసలాడే చిగురాకులు/ చిగురాకులమీద పాకుతున్న/ చిన్న చిన్న చీమల బారులు/ తీగ స్వేచ్ఛను కోరుకుంటే/ ఆకులు స్వేచ్ఛను కోరుకుంటే/ సర్వోన్నతుడైన మానవుడు/ స్వచ్ఛందతను కోరడంలో/ విచిత్రమేముంది? విడ్డూరమేముంది?*** (పైది : పు. 115)

అన్నది కవిప్రశ్న. ప్రకృతిలో ప్రతిదీ స్వేచ్ఛను కోరుకుంటూ ఉంటే, మనిషిని బానిసను చేయడం అన్యాయమని కవి తీర్పు. ఈ అన్యాయాన్ని కాపాడడానికే కర్మ సిద్ధాంతం సృష్టించబడింది. కవి తన తీర్పును సమర్థించడానికి బైబిల్‌లో నిషిద్ధఫలాన్ని మనిషి తినడాన్ని గుర్తు చేశారు. నిషిద్ధ ఫలాన్ని తిన్నందుకు దేవుడు శపించినా, దిక్కులు గాండ్రించినా, కన్నెర్ర చేసినా, అవి మానవుణ్ణి నిలువరించలేకపోయాయి. అది మానవస్వేచ్ఛకు శ్రీకారం చుట్టడమేనని కవి భావించాడు.

అభ్యుదయకవికి మనిషే వాస్తవం. మానవుడే చరిత్రనిర్మాత. మానవేతర శక్తులు, భావవాదుల సృష్టి, సినారె అనేక కవితలలో మనిషిని వస్తువును చేశారు. 'ముఖాముఖి' లో 'ఒకే ఒక్కదీపం' కవిత ఆయన మానవకవితలలో ఒకటి. ప్రకృతిలోని సూర్యుడు, చంద్రుడు అనే దీపాల కన్నా, మనిషి అనే దీపం మిన్న అని సినారె ఈ కవితలో ప్రతిపాదించాడు. ఆ మనిషి ప్రగతిశీల మానవుడు. ఆ దీపం "నీతికి గోరికడితే నిప్పులు కక్కుతుంది" (పైది : పు142) అని నిర్వచించడంలో ఉద్యమమానవుడే ఉన్నాడు.

"ముఖాముఖి" కవితలో వర్గదోపిడీని చిత్రించిన కవి, తొండరగండడు' కవితలో బలవంతుల వంచనానీతిని ఆవిష్కరించారు. అభ్యుదయ కవి అసమసమాజంలోని ఎన్ని పార్శ్వాలను ఆవిష్కరించాలో సినారెకు బాగాతెలుసు. సమాజ అధ్యయనం, ప్రజాదృక్పథం ఏకవికైనా వస్తువును తెచ్చిపెడతాయి. ఊసరవెల్లి రాజకీయ రంగాన్ని కవిత్వీకరిస్తూ, నమ్మించి అంతం చేసే దుర్మార్గాన్ని సినారె 'తొండరగండడు' కవితలో ప్రదర్శించారు. 'గండరగండడు' అనేమాటకు సమీపంగా 'తొండరగండడు' అనే పదాన్ని కల్పించారు. తొండ ఈగను మచ్చిక చేసుకొని నోట్లో వేసుకునే ప్రక్రియను కథనాత్మకంగా, ఆసక్తికరంగా చిత్రించారు. రంగులు మార్చే ఊసరవెల్లిని పీడకవర్గానికి ప్రతీకగా చేసి పీడకులు అమాయకులైన సామాన్యులను ఎలా పీడిస్తారో చెప్పారు. కీటకాలు తొండ ఆగడాలు భరించలేక తిరుగుబాటు చేస్తే, తొండరంగు మార్చి కాషాయరంగు ధరించిందట. అయినా చీమలు దోమలు, క్రిములు, కీటకాలు ఊసరవెల్లిని చంపేశాయి. శ్రామికవర్గం తిరుగుబాటు చేస్తే దోపిడీవర్గం అంతు చూస్తుందని, పీడకపీడిత వర్గసంఘర్షణలో తుదివిజయం పీడితులదేనని మార్క్సిజం చెప్పిన సత్యానికి కవిత్వరూపం ఈ కవిత.

అభ్యుదయకవులు ప్రజలకు చైతన్యాన్ని ప్రబోధిస్తారు, ప్రజా ఉద్యమాలను సమర్థిస్తారు. అందుకే వాళ్ళు ప్రజాకవులు. 'ముఖాముఖి'లో సినారె 'ప్రతిఘటనం' కవితలో చైతన్యప్రబోధమే చేశారు.

***అచ్చమైన జీవితం అనుకరణంలో లేదు***
***ప్రతిఘటనంలో ఉంది నిజమైన వ్యక్తిత్వం***
***భజనలో లేదు సృజనలో ఉంది***

(పైది : పు. 154,155)

భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు ఒక దేశం రెండు దేశాలుగా చీలిపోవలసివచ్చింది. పాకిస్తాన్ నుండి మరో పాతికేళ్ళకు బంగ్లాదేశ్ విడిపోయింది. తూర్పు బెంగాల్ ప్రజల ఆకాంక్షలకు, ఉద్యమాలకు ప్రతిబింబం బంగ్లాదేశ్ అవతరణ. అప్పుడు భారతదేశం బంగ్లాదేశ్ ప్రజలవైపు నిలబడింది. భారతీయ అభ్యుదయరచయితలంతా బంగ్లాదేశ్ ప్రజలవైపే నిలబడ్డారు. సినారె అందులో భాగస్వామి అయ్యారు. 'జయహే బంగ్లాదేశ్' వంటి కవితలు రాశారు. బంగ్లా ప్రజల సమరశీలతను కవిగా అనేక భంగిమలలో కీర్తించారు. ఆ యుద్ధానికి నాయకత్వం వహించిన ముజిబుర్ రెహమాన్‌ను ప్రస్తుతించారు. విద్యార్థుల శౌర్యాన్ని కొనియాడారు.

***విముక్తికోసం పోరాడుతున్న / వీరధాత్రి బంగాదేశ్ / ముజీబ్ నీ ఊపిరి/ ప్రజాబలం నీ పిడికిలి/ విద్యార్థులే నీ విప్లవమూర్తులు*** (పైది : పు. 157)

## కవిత

# మొదటి సంఖ్య

- డా. సి. నారాయణరెడ్డి

**నా**ల్గు కాదు మూడు కాదు రెండు కాదు
*ఒకటి.*
*ఆ ఒక్కటి*
*మిగిలిన అన్నిటినీ*
*తన భుజం మీద నిలుపుకుని*
*తరలిపోతున్నది*
*భుజంమీద సంఖ్యలకు*
*పొగరొచ్చింది*
*అవి ఎగిరిదూకి తమ ప్రయాణం ప్రారంభించినై.*
*నాలుగు సంఖ్యలు కొంతసేపు*
*అటూ ఇటూ సాగిపోయినా*



*చూస్తూ చూస్తూ ఉండగానే*
*మొదటి సంఖ్య*
*ముందుకు దూసుకుపోయింది*
*ఏమైనా*
*మొదటిది మొదటిదే*
*పిదపది పిదపదే*

***(సాహిత్య ప్రస్థానానికి సినారె పంపించిన చివరి కవిత)***

అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు భుట్టో, సైన్యాధ్యక్షుడు యాహ్యాఖాన్ వంటి వాళ్ళు అప్పుడు చేసిన వ్యాఖ్యలను సినారె "సమరసంక్రాంతి" కవితలో విమర్శించారు.

***భారతీయుల్ని కుక్కలనినాడు / ప్రల్లదాలు పలికిన భుట్టో / పుట్టెడు చెమటపుట్టి నేడు / మట్టిగొట్టుక పోయాడు.***

పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ గెలిచినప్పుడు దేశంలోని పార్టీలన్నీ అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధిని అభినందించాయి. 'విజయేందిర' అని కీర్తించాయి. సినారె కూడా అలాగే అన్నారు.

***ఈ రణం స్వర్ణబంగ్లాధాత్రిలో/ ఇంటింటా పచ్చతోరణం/ ఈ రణం వీరభరత చరిత్రలో/ ఎల్లకాలం గర్వకారణం/ ఇదే నేటి అపూర్వసంక్రాంతి/ విజయేందిర సాధించిన విక్రాంతి***

(పైది : పు. 164)

పదునైన భావాలను అనువైన పదాలలో అభివ్యక్తం చేయడం ఏ కవికైనా తెలియాల్సిన విద్య. పద్యకవి ఛందస్సులో తేలియాడతాడు. వచనకవికి ఆ అవకాశం లేదు. సినారె పద్య, గేయ, వచన కవితలలో రాటుదేలిన కవి. శబ్దం మీద, పదసంయోజనం మీద పట్టున్న కవి. ప్రాసకోసం ప్రయాసపడని కవి సినారె. ఆయన కవిత్వం నిండా ప్రాసలుంటాయి. అవి సహజంగా కవి కలం ముందు వాలిపోతాయి. పద్యంలోని ప్రాసను, సినారె, వచన కవితలోకి తీసుకొచ్చి అందమైన ఊపును సాధిస్తారు. ఈ ప్రాస వల్ల సినారె వచన కవిత్వపదాలు ద్విపద రూపం ధరిస్తాయి. రెండేసి పాదాలకు ఒక్కో ప్రాసాక్షరం పెడతారు.

***"పచ్చి మొగ్గలుగా ఉన్నప్పుడే/ గుచ్చుకుంటున్న ముళ్ళనుచూసి" / తూర్పు ప్రసవించిందిప్పుడు / ఊర్పు ప్రణవించిందిప్పుడు*** (పైది : పు. 125)

వంటివి ఉదాహరణలు.

ఒక ఖండికలో నాలుగు పాదాలుంటే, మూడో పాదం తప్ప తక్కిన మూడుపాదాల చివరలో ఒకే అంత్యప్రాసను పెట్టి రాశారు సినారె.

***ఊడల మర్రిలా అల్లుకున్న అర్థరాత్రి / పాదునిద్రలో తూగుతున్న వృద్ధధాత్రి / పొత్తికడుపులో నెత్తుటికందు కేక / తత్తర పడిపోయింది కాలసవిత్రి.*** (పైది : పు. 135)

నాలుగు పాదాలలో ఒకటీ, మూడు పాదాలు ఒక రకంగాను రెండు నాలుగు పాదాలు మరోరకంగాను ముగియడం కొన్నిచోట్ల కనిపిస్తుంది.

***వెలయెంత అని అడిగితే / వెలవెలబోయి చూస్తుంది / ప్రతిఫలం చెల్లించబోతే / బ్రతికుండగానే చస్తుంది***


(పైది: పు. 134)

1971 నాటికి తెలుగు వచనకవితకు నాలుగు దశాబ్దాల చరిత్ర పూర్తి కావస్తున్నది. అప్పటికి ప్రసిద్ధులైన అభ్యుదయకవులలో సినారెది విశిష్టమైన గొంతుక. ఒకచోట ప్రచండత, మరోచోట మార్దవం సినారె శైలిని నడిపించాయి. ఒక లయ అంతస్సూత్రంగా ఉంటుంది. అది కవిత్వపఠనానికి ఊపునిస్తుంది. పాఠకునికి కవిత్వానికి మధ్య వారధి కడుతుంది.

***ఎక్కడుంది స్వేచ్ఛ? / విత్తనాన్ని చీల్చిన మొక్కలో / ఎక్కడుంది స్వేచ్ఛ ? / విహాయసంలో పొడిచిన చుక్కలో***

(పైది: పు. 132)

కవిత



# మట్టి నుండి మహా శిఖరాలకు!

- ఝాన్సీ కె.వి. కుమారి
9010823014

మట్టి పల్లెలే.. పర్వత శిఖరాలకు పుట్టిళ్ళు
రా.. రమ్మనే .. పర్వతాల మౌన బాసలు
విన్న ఆ హృదయానికి వందనం!
అది... సినారె మహాకవి అక్షర హృదయం...
అందుకే... సృష్టించింది అక్షయ సాహిత్యం!

తెలుగు సాహితీ సంద్రంలో
లక్షల అక్షర బిందువులు
కవితా సుమ పరిమళాలు
పాటల కోయిలల జలకాలాటలు
గేయ నాటికల రసరమ్య చిత్రాలు
గజళ్ళు... ప్రపంచ పదులు... బుర్రకథలు
ఎనభయ్యారు వసంతాలలో
శతాధిక రచనలు
సుశీలమ్మ ఎడబాటులో
సాహిత్యమే నిత్య సాహచర్యం
ప్రక్రియలన్నింటిలోనే కాదు... భాషల్లోనూ
సాహితీ సేద్యం... అక్షర పంటలు బస్తాల నిండా
నడచి వచ్చాయి అక్షయ కిరీటాలెన్నో

రా... వన్నెల దొరా...' అంటూ
వరించింది ద్వితీయ జ్ఞానపీఠం!

మంచిని పంచేందుకు
చెడును పరిహరించేందుకు
"సమత నా భాష
కవిత నా శ్వాస"
అని ఎలుగెత్తిన మహాకవి, సినారె,

నువ్వు లేవని తెలిసిన క్షణం
తెలుగు అక్షరం నివ్వెరపోయింది...
కన్నీరయింది...
నీ అక్షరం... ప్రజల నాల్కలపై సుస్థిరం
నీ పాట... జనజీవనంలో నిత్యచైతన్యం...

వాయుతరంగాల ఆకాశవాణిలో
శ్రోతల హృదయవీణలను మీటే
లలిత సంగీతాన్ని శ్రుతిచేసిన
ఆద్యులలో ఓ కవిగా
కవిగాయక బృందాలకు
స్ఫూర్తి ప్రదాతవైనావు, కవీ,
ఎన్నెన్నో ముద్రలు... నీవి..!
విశ్వమాత థెరీసమ్మ ఆశీర్వచనాలతో
గురజాడ, జాషువాల
విశ్వమానవ శ్వాసకు వారసుడవుగా
మట్టి నుండి మహాశిఖరాలకు
నువ్వు చేసిన ప్రస్థానం
భావితరాలకు అనుసరణీయం...

నీదైన ఆహార్యం తెలుగు ధనం...
పంచెకట్టు కండువాకు
నీ చిరునవ్వుల నెలవంకతో
హుందాతనపు ఆత్మీయతను
శాశ్వత చిరునామా చేశావు!

సాహితీ శిఖరమా, సినారె కవీశ్వరా,
తెలుగు జాతి నిండుగ వెలిగే జాతి' అన్నావు
అన్ని చీకట్లను తరిమే జ్యోతులై వెలగాలన్న
నీ ఆశయానికి తెలుగుజాతి
కావాలి అంకితం... అదే కదా, నీకు
తెలుగు వీరులర్పించే నీరాజనం...!

## కార్యశాల



# కవిత్వానువాదంతో కొన్నిరోజులు

- మందరపు హైమవతి
9441062732

***చెవులకు కేరళ అనే మూడక్షరాల మాట వినబడగానే మనసు ఉత్సాహం ఊయల ఊగసాగింది. మనసు పుస్తకంలో జ్ఞాపకాల పుటలు రెపరెపలాడసాగాయి. కేరళ కొత్త ప్రదేశమేమీ కాదు. అంతకు ముందు 2,3 సార్లు వెళ్ళొచ్చిందే. మొదటిసారి కేంద్రసాహిత్య అకాడమీవారు నిర్వహించిన దక్షిణ భారత కవి సమ్మేళనంలో పాల్గొనడానికి త్రివేంద్రం వెళ్ళాను. తర్వాత తిరూర్‌లో జరిగిన తుంచన్ ఫెస్టివల్‌కి వెళ్ళాను. మరోసారి అయ్యప్ప పణికర్ నేషనల్ సెమినార్‌లో పాల్గొన్నాను. ఈ మూడు సందర్భాల్లోనూ ఒక కవిగానే వెళ్ళానుగానీ అనువాదకురాలిగా వెళ్ళడం ఇదే మొదటిసారి***

వంటలు, కేరేజీలు సర్దడాలు, నీళ్ళసీసాలు పట్టడాలు గడియారం ముళ్ళతోపాటు పరుగెత్తే ఒక హడావిడి ఉదయపువేళ ఫోను పిలుపు. ఫోను తెరపై మెరిసిన కొత్త నంబరు. 'ఈ నెలాఖరులో కేరళలో పోయట్రీ ట్రాన్సులేషన్ వర్కుషాపు నిర్వహిస్తున్నాం. దానిలో పాల్గొనడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము" అని కేరళ నుంచి అన్వరాలీ అన్నారు.

కేరళలోని పాలక్కాడ జిల్లా పట్టాంబి కళాశాలలో పోయట్రీ కార్నివాల్, కేరళ సాహిత్య అకాడమీ కలసి మూడు రోజులపాటు 'కవితాయుధ' అనే పేరుతో కవిత్వోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో భాగంగానే అనువాద కార్యక్రమమని చెప్పారు. కొచ్చికి దగ్గరగా వున్న షార్నూరులో ఎస్.ఎన్ హెరిటేలో అనువాద కార్యశాల నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 25 సాయంత్రాన్నికల్లా కవులందరూ అక్కడికి చేరుకోవాలని అన్నారు. 26,27లలో అనువాదాలు చెయ్యడం, 28న పట్టాంబిలోని సంస్కృత కళాశాలలో కవితాపఠనం ఉంటుందని చెప్పారు. పోయట్రీ కార్నివాలుకి, ట్రాన్స్‌లేషన్ వర్కుషాపుకి అనుసంధానకర్త అన్వరాలీగారు, మళయాళ కవితలను తెలుగు తమిళ కన్నడ భాషలలోకి, ఆ భాషల కవితలను మళయాళంలోకి అనువదించడం కార్యశాల లక్ష్యమని, అనువాద కార్యక్రమమయ్యాక వాటినన్నిటినీ పుస్తకంగా తీసుకొస్తామని వివరించారు.

చెవులకు కేరళ అనే మూడక్షరాల మాట వినబడగానే మనసు ఉత్సాహం ఊయల ఊగసాగింది. మనసు పుస్తకంలో జ్ఞాపకాల పుటలు రెపరెపలాడసాగాయి. కేరళ కొత్త ప్రదేశమేమీ కాదు. అంతకు ముందు 2,3 సార్లు వెళ్ళొచ్చిందే. మొదటిసారి కేంద్రసాహిత్య అకాడమీవారు నిర్వహించిన దక్షిణ భారత కవి సమ్మేళనంలో పాల్గొనడానికి త్రివేంద్రం వెళ్ళాను. తర్వాత తిరూర్‌లో జరిగిన తుంచన్ ఫెస్టివల్‌కి వెళ్ళాను. మరోసారి అయ్యప్ప పణికర్ నేషనల్ సెమినార్‌లో పాల్గొన్నాను. ఈ మూడు సందర్భాల్లోనూ ఒక కవిగానే వెళ్ళానుగానీ అనువాదకురాలిగా వెళ్ళడం ఇదే మొదటిసారి

కేరళ అంతకు ముందు చూసిందే ఐనా ఎన్నిసార్లు చూసినా తనివితీరని అందాల ఊరు. కేరళ అనగానే మాతృస్వామ్య వ్యవస్థ గుర్తుకువస్తుంది. కమలాదాసు, అయ్యప్ప పణిక్కర్, సచ్చిదానందన్ మొ॥ కవులు జ్ఞాపకమొస్తారు. తోటల మధ్య ఇళ్ళు; ఇళ్ళ మధ్య తోటలు కాంక్రీటు వనాల చిరునామా

మరచిన సుమనోహర సుశ్యామల చిత్రం. అన్వరాలీగారి ఆహ్వానానికి అంగీకారం తెలిపాను.

వెంటనే పది, పన్నెండు కవితలు, ఆంగ్లానువాదాలతో పంపమన్నారు. ఒక్కొక్క భాష నుండి ముగ్గురు కవులను పిలుస్తున్నామని తెలుగులో డా॥ పత్తిపాక మోహన్‌గారు, మంత్రి కృష్ణమోహన్‌గార్నీ పిలుస్తున్నామన్నారు. ఇక పొద్దున్నే హైదరాబాదు వెళ్ళి ముగ్గురం ఒకే విమానంలో ఎక్కొచ్చి అక్కడి నుంచి షొర్నూరు చేరుకొన్నాము.

అన్వరాలీగారు, రామచంద్రన్‌గారు మమ్మల్ని ఆహ్వానించి రేపు ఉదయమే అనువాద కార్యశాల మొదలవుతుందని చెప్పారు. మర్నాడు ఉదయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులతో ఒక పండుగ వాతావరణం వచ్చింది. కార్యక్రమ సంచాలకులు సాహిత్య అకాడమీ పూర్వ ప్రధాన కార్యదర్శి ప్రముఖ మళయాళ కవి అనువాద కార్యశాలను ప్రారంభించారు. తన ప్రారంభోపన్యాసంలో "ఇంగ్లీషులో కన్నా భారతీయ భాషల్లో అనువాదాలు జరిగినపుడు ఇరుగు పొరుగు వారి భాషా సాహిత్యం తెలుస్తుందని, ఆ దిశలో ఇది గొప్ప ప్రయత్నమని అన్నారు. అనువాదం చేసేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించి ఒక భాషలో నున్న పదానికి సరియైన సమానార్థపదాన్నే ఎంచుకోవాలని ఒక భాషలోని నుడికారాలను జాతీయాలను అనువదించేటప్పుడు తు.చ తప్పకుండా మాటకుమాట కాకుండా ఆ భావాన్ని తీసుకురావాలని, ఈ రెండు రోజులూ నేనిక్కడే వుంటాను. ఎవరికైనా ఏదైనా సందేహం వస్తే నేను నివృత్తి చేసి సహకరిస్తానని" అన్నారు.

మొత్తం కవులను మూడు సమూహాలుగా విభజించారు. మొదటిది తమిళం నుంచి మళయాళం. సుకుమారన్, సుకీర్తరాణి, ఇషాయ్. తమిళ కవుల కవితలను వి.ఎం.గిరిజ, ఎన్.జి. ఉన్నికృష్ణన్, సంధ్య, ఎన్.పి మళయాళంలోకి అనువదించాలి. రెండవది కన్నడం – మళయాళం – అబ్దుల్‌రషీద్, మమతాసాగర్, మంజునాథ కన్నడ కవుల కవితాలను మనోజ్‌కురూర్, ఎ.ఎన్.గోపీకృష్ణన్, ఉమారాజీవ్ మళయాళంలో అనువదించారు. తెలుగు కవులు మందరపు హైమవతి, డా.పత్తిపాక మోహన్, మంత్రి కృష్ణ మోహన కవితలను కె.ఎం. ప్రమోద్, ఎం.ఆర్. రేణు, కె. సింధు తమ మాతృభాష మళయాళంలోకి అనువదించాలి అని అన్నారు.

> **మూలకవి అనువాదకవి ఒకేచోట కూర్చొని అనువాదం చెయ్యడం, చేసిన దానిని మళ్ళీ వాళ్ళకు వినిపించి ఎక్కడైనా తృప్తికరంగా లేకపోతే అక్కడ సరైన మాట పడేవరకు నానా కసరత్తు చేసాం.**

మామూలుగా మనం ఏదైనా కవితను అనువాదం చేసినపుడు పుస్తకంలో చదివి అనువదిస్తాము. ఎక్కడైనా మాటకు సరైన అర్థం తెలియనపుడు నిఘంటువులో చూసో, ఆ భాషలో బాగా పాండిత్యమున్న వారినో అడిగి తెలుసుకుంటాం. కానీ ఇక్కడ సౌకర్యమేమిటంటే ఆ కవితను సృష్టించిన కవే ఇక్కడుంటారు కాబట్టి ఆ కవినే అడిగి మన సందేహం తీర్చుకోవచ్చును. అదీ కాకుండా రెండు భాషలు తెలిసిన తరలి శేఖర్ కన్నడం, మలయాళం ప్రొ.శివకుమార్ కుప్పం (తెలుగు, కన్నడ, మళయాళం, సుకుమారన్ (తమిళ మళయాళం) మాతో ఉన్నారు. వీరే గాకుండా ఇండియన్ లిటరేచర్ ఎడిటర్ ఎ.జె. థామస్, కేరళ సాహిత్య అకాడమీ కార్యదర్శి మోహనన్ కార్నిదాల్ సంచాలకులు రామచంద్రన్ మాతో ఉన్నారు.

దీనితో అనువాదం ఎక్కడా రాజీ పడకుండా కొనసాగింది. మూలకవి అనువాదకవి ఒకేచోట కూర్చొని అనువాదం చెయ్యడం, చేసిన దానిని మళ్ళీ వాళ్ళకు వినిపించి ఎక్కడైనా తృప్తికరంగా లేకపోతే అక్కడ సరైన మాట పడేవరకు నానా కసరత్తు చేసాం. మాకిచ్చిన ఆంగ్లానువాదాలు సరిగ్గా లేనందువలన మూలకవులతో సంప్రదించాము. ఒక్కోసారి సరైన పదం స్ఫురించక మాటలు తిప్పలు పెట్టాయి. అల్లరి చేస్తున్న పిల్లలను సముదాయించి దోవకు తెచ్చుకొన్నట్లు సరైన మాటలను కూర్చి అమ్మయ్య అని నిట్టూర్చేవాళ్ళం.

అనువాదం సరిగా వచ్చినపుడు మూలకవి ముఖంలో ఆనందం ఇంద్రధనుస్సు విరిసినపుడు ఆ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని ఒక అపూర్వమైన హాయి అనిపించేది. గుండెల్లో నుంచి భారం దింపుకొన్నట్లయ్యేది. ఆ రోజు రాత్రి వరకు కొనసాగింది అనువాద కార్యక్రమం. ఈ అనువాదంలో శివకుమార్ గారు మా సందేహాలను తీర్చడంలో బాగా సహకరించారు.

ఆ రోజు రాత్రి అనువదించిన కవితలను చదివే కార్యక్రమం మూలకవితను ఆయాభాషల కవులు చదివారు. అనువాదకులు మళయాళ అనువాదాలను వినిపించారు. అనువాదం విన్న కవులు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండవరోజు త్రిభాషా కవులు తమకు కేటాయించిన మళయాళ

కవితలను వారి వారి భాషల్లోకి అనువదించే కార్యక్రమం జరిగింది. సచ్చిదానందన్ మళయాళ భాష అనువాదంలో అనువాదకులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆంగ్లానువాదం ఆధారంగా జరుగు తున్నపుడు లోపించే భాషా సౌందర్యం గురించి చెప్పారు. అనువాదం చేస్తున్న కవిత ఆంగ్ల అనువాదం, మళయాళ మూళ కవితలను చూపిస్తూ అనువాదకులకు వాటిపట్ల అవగాహన కల్పించారు.

**సచ్చిదానందన్ మళయాళ భాష అనువాదంలో అనువాదకులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆంగ్లాను వాదం ఆధారంగా జరుగు తున్నపుడు లోపించే భాషా సౌందర్యం గురించి చెప్పారు.**

మళయాళ కవులు అనువాద కవులకు తమ మళయాళ కవితలను చదివి వినిపించారు; ఆంగ్లానువాద సాయంతో అనువాదకులు వారి వారి కవితలను అనువదించారు. పత్తిపాక మోహన్‌గారు రేణుకుమార్ కవితను 'నల్లనివానలు' గోపీకృష్ణన్ కవిత 'నా జీవితంలోని తొలి మహిళ చివరి మహిళతో చెప్పింది' సంధ్య కవితలు 'చనుబాలు', 'నేను', 'పదిమంది', 'కళ్ళు' కవితలను అనువదించారు. మంత్రి కృష్ణమోహన్ సింధూ కవితలు 'ఒక ఒకే ఒక' 'రక్షకుడు', గిరిజ కవిత 'చేప' ఉమారాజీవ్ కవిత 'పటం' ను తెలుగులో అనువదించారు. నేను ఎస్.జి. కృష్ణన్ కవితలు 'పిల్లల పార్కు', 'అనంతం', ' కాగితం పడవ', ప్రమోద్ కవిత 'కర్కాటకం', 'అనుభూతులు', 'ఎమర్జన్సీలో కోల్పోయిన నా ఆరేళ్ళు' కవితలను, మనోజ్ కూరూర్ 'లొకేషన్' కవితను అనువదించారు.

ఇక మూడవ రోజు పట్టాంబిలో సంస్కృత కాలేజీలో కవితాపఠనం కార్యక్రమం. బయట విశాలమైన ఆవరణలో పుస్తక ప్రదర్శనశాలలోని పుస్తకాలను చూసి లోపలకు వెళ్ళాము. మొదట కె.ఎం. ప్రమోద్ నా సర్ప పరిష్వంగం మళయాళం అనువాద కవిత చదివితే తెలుగులో నేను చదివాను. ఆయన 'కర్కాటకం' చదివితే తెలుగు అనువాదం చదివాను. అలా మొదలు యళయాళంలో చదివిన తర్వాత తెలుగు, తమిళ, కన్నడ అనువాదాలు చదివాము. మొత్తం నాలుగు రోజుల పాటు అనువాద కార్యక్రమంలో పాల్గొన్నాక అనువాదం చెయ్యడం ఎంత కష్టమో తెలిసింది. 2 భాషలు తెలియాలి. కవి ఆత్మను గ్రహించగలగాలి. అప్పుడు ఆ కవిత సహజంగా వుంటుంది.

ఈ అనువాద కార్యశాలలో నేను గ్రహించందేమిటంటే చాలామంది మళయాళ కవుల కవితలు చాలా చిన్నవి. అల్పాక్షరముల అనల్పార్థ రచన అన్నట్లు చిన్న కవితలోనే గొప్ప భావాన్ని వ్యక్తీకరించాయి.

ఎన్.జి. ఉన్ని కృష్ణన్‌గారి 'కాగితం పడవ' కవిత చూడండి. "కాగితాన్ని తీసికొని / మధ్యకు మడచి / త్రికోణాకారంలో/ చదురస్రాకారంలో/ విచ్చుకొన్న పువ్వులా/ పడవను తయారు చేసి/ మండుతున్న ఎండలో వదిలాను/ కాగితం పడవను/ ఎవరైనా తయారు చేస్తారు/ అంతేగదా!

ఇది చూడడానికి చిన్న కవితేగానీ, దీనిలో గొప్ప వ్యంగ్యార్థం వుంది. మామూలుగా మనం కాగితం పడవలను నీళ్ళలో వదులుతాము. వాన కురిసినపుడు ఇంటి చూరు నుండి వర్షం ధారలుగా పడుతున్నపుడు దానిలో కాగితం పడవలను వదలడం మనం చేసే సర్వసాధారణ దృశ్యం. కానీ కవి ఇక్కడ ఏమి చెప్పాడంటే పడవను తయారు చేసి ఎండలో వదిలాడని. అక్కడ వానలు లేవనే వ్యంగ్యార్థాన్ని గుండెలు పిండేటట్లు వర్ణించారు. కె.ఎం. ప్రమోద్ తన 'కర్కాటకం' కవితలో ఇలా అంటారు. "ఇంటికి ఫోను చేసినపుడు / శబ్దాలు చేస్తున్నారు / ఇంటి ముందు అక్కడక్కడా తిరుగుతూ / చిన్నపిల్లలు / ఆకలితో కేకలు వేస్తున్నారు / అంబలి ఇవ్వమ్మా!/ ఇంటి మూలల నుంచి / తల్లి కప్ప పిల్లల్ని ఓదారుస్తుంది / ఇస్తున్నాను ఇస్తున్నాను / పొలాల నుంచి వచ్చిన / పెద్దకప్ప తల్లి కప్పతో/ పిల్లలకు ఇవ్వు / పిల్లలకు ఇవ్వు/ అని బెకబెకలాడుతుంది / తర్వాత (మండుతున్న తలలాగ మెరుస్తున్న కరువు రక్కసి ' ఆకాశం నుండి / ఉరుముతుంది/ 'ఎక్కడ నుండి తెచ్చిస్తావు ఎ-ఖ-ద- నుంచి తెచ్చిస్తావు "! అని ఆగస్టు సెప్టెంబరు నెలల్లో కర్కాటకం వస్తుంది. అప్పుడు ఉరుములతో, మెరుపులతో మెరిసే వర్షాకాలం కానీ అపుడు ప్రజలకు తిండి దొరకని భయంకర కరువుకాలం ఈ కరువును కళ్ళకు కట్టినట్లు దృశ్యమానం చేస్తూ కరుణ రస చిత్రాన్ని ఆవిష్కరించారు. ఇక మనోజ్ కురూర్ 'లొకేషన్' కవిత ఒక విషాద భీభత్సమైన కవిత.


సుకీర్తరాణి, రేణుకుమార్, మంజునాథ, కార్పెంటర్ శక్తివంతమైన దళితకవులు, సుకీర్తరాణి ఏమి జంకుగొంకు లేకుండా తన స్త్రీ వాద భావాలను నిర్భయంగా వ్యక్తీకరించే కవయిత్రి. తమిళ కవితారంగంలో తన బలమైన ముద్రను వేసిన కవయిత్రి.

రోజూ రాత్రి భోజనాలైనక సుకీర్తరాణి, మంజునాథ, కార్పెంటర్, నేను బయటకు షికారుకు వెళ్ళేవాళ్ళం. అక్కడ

## కవిత

# హైకూలు

- బి. గోవర్ధనరావు
9441968930



చార్లీ చాప్లిన్
హాస్యనటవిలాసం
నవ్వుల రేడు!

ఫ్రెంచివిప్లవం
స్వేచ్ఛకోరిన తరం
హక్కుల శకం

స్విచ్ వేసాను
బల్బ్‌తో ఎడిసన్
కాంతినిచ్చాడు!

నేటి జీవనం
అంతా లెక్కల మయం
మనిషి మాయం

మనలోమాట
అంతా నడిచే బాట
సంఘంతో నేను

భూమి పండగ
పంటలన్నీ మెండుగ
మట్టి వసంతం !

నిలబడదాం
మనుష్యులుగా వుందాం
జయం మనదే !

మేలుకొలుపు
ఆశలకు పిలుపు
కొత్త ఊహాలు

ఉప్పుడు బియ్యం భోజనం, ఉప్పు కారం లేని కూరలతో అర్థాకలి కడుపులతో బయట ఏదైనా తినడానికి వెళ్ళేవాళ్ళం. కబుర్లతో ఛలోక్తులతో సరదాగా ఒక గంటా అరగంటా తిరిగి వచ్చేవాళ్ళం. రోడ్లమీద గోడలపై రోహిత్ ఫోటోలు వున్న వాల్‌పోస్టర్లు ఫోటోలు తీసుకోవడం, సెల్ఫీలు తీసుకోవడంతో సరదాగా గడచిపోయాయి.

అనువాద కార్యక్రమం అయ్యాక ఆరు బయట కూర్చొని అందరు కవిత్వం గూర్చి మాటలాడుకోవడం, అర్ధరాత్రి వరకు అంతాక్షరి, పాటలుతో అందరూ ఒక్కసారి బాల్యంలోకి వెళ్ళిపోయేవారం. ముఖ్యంగా ఎన్.జి. ఉన్నకృష్ణన్ గారు పెద్దవారై వుండి సరదాగా పాటలు పాడుతూ అల్లరి చేయడం ఒక అద్భుత దృశ్యం.

రామచంద్రన్ గారు తెలుగు కవిత్వం గురించి మాట్లాడారు. ఫేస్‌బుక్‌లో నేతల ప్రతాపకుమార్, పెట్టిన కవిత తనకు నచ్చిందని చెప్పగానే నేను ఆశ్చర్యపోయాను. ఆయన తెలుగు కవితలు కూడా చదువుతారని. తర్వాత నా కవిత్వం గురించి గూడా ఆయన తన అభిప్రాయాలు చెప్పారు. నా కవితల ఆంగ్లానువాదాలు చదివారట. స్త్రీ వాద భావాలను నిర్భయంగా నిజాయితీగా చెప్తానని అన్నారు.

ఇక ఆ రోజు రాత్రే వీడ్కోలు దృశ్యాలు. కొంతమంది ఆ రోజు రాత్రే వెళ్ళిపోయారు. మరికొంతమంది మర్నాడు పొద్దున్న ప్రయాణం. మేము అందరికీ కొంచెం విషాద హృదయంతో వీడ్కోలు చెప్పి వచ్చేసాము.

ఇన్ని రోజుల కార్యక్రమంలో నాకు నచ్చిందేమిటటంటే మళయాళీల మాతృభాషాభిమానం. వాళ్ళ సాహిత్యంపై అపారమైన ప్రేమ. వాళ్ళ కవిత్వాన్ని ఇతర భాషలలోకి అనువదింపచేయడం. 3 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంత కష్టం. ఆ పని చేసి చూపించారు. ఈ కవిత్వోత్సవానికి వేరే భాషల కవులు కూడా వచ్చారు. కానీ మళయాళం తప్ప మరో భాష వినబడలేదు అక్కడ. బయట మేము రోడ్లమీద ప్రయాణం చేసినపుడు కూడా ఎక్కడా మళయాళం తప్ప మరో భాష లేదు. అక్కడ వారికి వాళ్ళ భాష మీద మమకారం, అక్కడ కవుల మీద గౌరవం. ప్రేమ గొప్పది. తుంచన్ ఫెస్టివల్‌లో తుంచన్ కవి పేరిట 5 రోజుల ఉత్సవాలు చేస్తారు. అప్పుడూ మళయాళం తప్ప మరో భాష వినబడదు. పెరియార్‌లో అయ్యప్ప పణికర్ సెమినార్ జరిగినపుడు దేశం మొత్తం మీద హిందీ, పంజాబీ మొ.. కవులు వచ్చారు. అక్కడా అంతే మళయాళం తప్ప మరో భాష వినబడదు.

కానీ ఇక్కడ మనం తెలుగువారం మాత్రం మన ప్రాంతంలో నిర్వహించే సభల్లో అనర్గళంగా ఆంగ్లం మాట్లాడతాం. బయటనుంచి వచ్చిన వారికి తెలుగులో మాట్లాడితే అర్థం కాదని, ఎంత విశాల హృదయాలో కదా! తెలుగు వారికి మనకీ శ్రీశ్రీ గురజాడ, జాషువా, తుమ్మల ఉ న్నారు. ఎవరి పేరిటనైనా ఒకరోజు ఉత్సవాలు చేస్తున్నామా? అభివృద్ధి పనుల మీద తప్ప భాష గురించి పట్టించుకోని ప్రభుత్వాలు. పొరుగు రాష్ట్రాల్లో తెలుగు భాషను తొక్కేసినా ఇక్కడ ఆ భాష చదువుకొనేందుకు పాఠశాలలకు గుర్తింపు ఇస్తుంది. వీధుల్లో దుకాణాలపై 'ఇంప్రెషన్' 'వుడ్‌వరల్డ్' మొదలైన ఆంగ్లబోర్డులు దర్శనమిస్తాయి. ఇంగ్లీషులో మాట్లాడితేనే గొప్ప అనుకొంటారు ప్రజలు. పిల్లల్ని ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చేర్పిస్తారు. ఈ స్వభావం ఎప్పటికి మారుతుందో, మనలో కవులున్నారు. ఇక్కడా ఇలాటి అనువాద కార్యక్రమాలు నిర్వహించే మంచిరోజులు వస్తాయా? ఎప్పటికైనా!

## కవిత

### చీకటిని జయించాలి

- డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
9490332323

కాఫీ కప్పులో నీటి బిందువులు
ఒక దానికొకటి ఘర్షణ పడుతున్నాయి
ఇంతలో కాఫీ పొడి రేణువులు
చక్కెర తునకలు
గుద్దుకుంటున్న ధ్వని
నిశ్శబ్దంగా వినిపిస్తోంది
మనం ముగ్గురం కలిసిపోదామా
వేర్వేరుగా ఘర్షణపడి
పింగాణి కప్పును ముక్కలు చేద్దామా అని
ఆకాశానికి భూమికి మధ్య
వాయువు నిశ్శబ్ద ఘోష చేస్తోంది



ఆ ఘోష వెనుక కంకాళ నృత్యం
తడి ఆరిన నాలుకలు మడతబడ్డాయి
మనసు ముడి విప్పాలని
మనిషి ఎద వెంపర్లాడుతోంది
ఆకాశం నిశ్శబ్దాన్ని వర్షిస్తోంది
నేలను తాకుతున్న శబ్దం
కిక్కురుమనడం లేదు
చీకటిలో నక్షత్రాలు దాగుడు మూతలాడుతున్నాయి
చీకటిని జయించాలని కాబోలు
వెలుగు రెప్పలు భారంగా మూసుకుంటున్నాయి

### భూమి పుత్రుడు

- విడదల సాంబశివరావు
9866400059


అతడు భూమి పుత్రుడు
మేఘం కరుణించి వర్షిస్తే
మట్టి పరిమళంలో
మల్లెల సువాసనలను ఆఘ్రాణిస్తాడు!
విశ్వమానవాళికి
కడుపు నింపాలనే తపన తప్ప
మరో ఆలోచన లేనివాడు!
వేకువ చీకటిని చీల్చుకొని
పొలంగట్టున హలంపట్టి
భూమి పొరలను చీల్చి చెండాడి
పదునుపెట్టి నారు నాటిన శ్రామికుడు!
కడుపు మాడ్చుకొని.....
కన్నీరు దిగమింగుకొని....
భూమితల్లి కడుపుపంటకు
లక్షల రూపాయలు వెచ్చించిన
ఆశాజీవి... ధరిత్రీ తనయుడు!
అప్పుల భారంతో నడుము ఒంగినా...
మిరపరాసులతో నిండిపోయిన
నట్టింటి సౌందర్యం చూసి



ఆనంద తరంగాలలో ఓలలాడాడు!
అమ్మ అవని అనుగ్రహించినందుకు
రైతన్నకళ్ళల్లో...
కౌముదికింతులు తళుకులీనాయి
గుండెల్లో నిండిన సంతోషమంతా
మూడునాళ్ళ ముచ్చటే అయ్యింది..

విపణి వీధిలో వ్యాపారాసురులు
ఒక్కటిగా కలిసిపోయి
రైతుబిడ్డ కష్టాన్ని
గిట్టుబాటు రహితంగా దోచుకున్నారు.
గుండె పగిలింది కష్టజీవికి...
అప్పుల వాళ్ళ జాతర
కన్నులముందు సాక్షాత్కరించింది!
ఆత్మాభిమానం అంతరంగాన పొడచూపి
పొలంగట్టువైపు నడిపించగా
నీడనిచ్చిన వేప చెట్టుకొమ్మ
ఉరికొయ్యలామారి ఉసురుతీసింది
పరువును కాపాడుకోవాలని
ప్రాణత్యాగం చేశాడు అన్నదాత!
అవును...
అతడు భూమి పుత్రుడు

# కేబుల్ బంధం




- చిత్తలూరి
9133832246

"అరె! మొన్ననే కదూ మనం అతనితో మాట్లాడింది... ఇంతలో ఎలా జరిగిందిది... నమ్మలేకుండా వుంది... మంచివాడు... ఎప్పుడూ నవ్వుతూ పలకరించే వాడు.... మొహం మీద చిరునవ్వు లేకుండా ఎప్పుడూ చూళ్లేదతన్ని.. ఇంతలోనే"..... కళ్లు తుడుచుకుంటూ అందామె.

రోజు రోజుకి నువ్వు మరింత సెన్సిటివ్గా తయారవుతున్నావేమోనని అనుమానంగా వుంది నాకు... అబ్బాయంటే... నువ్వు అంతకన్నా ఎక్కువలా వుంది.... వాడ్ని చూస్తేనేమో మొన్నటికి మొన్న... రోడ్డు మీద పిల్లి చచ్చి పడివుండటాన్ని చూసి కంటికి మింటికి ఏకధాటిగా ఏడ్చాడు..... వాడి ఏడుపును ఆపటానికి మన తల ప్రాణం తోకకొచ్చింది... ఎవడో కావాలని చంపేసి పోయుండాడులేరా నాన్నా... ప్రమాదవశాత్తు లారీ కింద పడిపోయి వుంటుంది... అయినా అదేమయినా మన పెంపుడు పిల్లా... దానితో మనకేమిటి సంబంధం... దానికోసం నువ్వెందుకేడవాలిరా కన్నా.... అని నువ్వు కూడా ఓదారుస్తూ వుండిపోయావు. అయినా వాడేమన్నా అంత త్వరగా ఏడుపు మానాడా... వాడు పిల్లికెలా కనెక్టయ్యాడో అంతుపట్టక ఇప్పటికీ నా బుర్ర బద్దలవుతూనే వుంది... ఇప్పుడు నువ్వు కూడా చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నావు.... మనదంటే అయిపోయింది... ఎటు చూసినా హింస... దోపిడీ... మోసం.. కుట్రలూ.... కుతంత్రాలు... వెన్నుపోట్లు... ఎప్పుడెవడు వెనకనుంచి వచ్చి పొడుస్తాడో తెలియదు.... ఎవడి స్వార్థం కోసం ఎవడెన్ని కపట నాటకాలాడుతాడో తెలియదు.... స్నేహం నటించినట్టే నటించి, ఎవడెప్పుడు శత్రువుగా మారుతాడో తెలియదు... ఇంతటి అభద్రత కలిగిన ఈ సమాజంలో మనలాంటి బుడ్డోడు ఎట్లా బతుకుతాడో తలుచుకుంటేనే నాకు చాలా భయంగా వుంది. అందుకే వాణ్ని కాస్త కఠినంగానే పెంచాలి కాని వాడు ఇంత సున్నితంగా... ఏ కుక్క చచ్చినా... చివరికి గోడమీది బల్లి చచ్చినా ఇలా అల్లాడిపోతే వాడెట్లా బతుకుతాడు మరి... అలాంటిది వాడికి.... "అంత సున్నితత్వం పనికిరాదు బిడ్డా" అని నువ్వు చెప్పాల్సిందిపోయి...... వాడేడ్చినట్టు నువ్వు కూడా ఏడిస్తే ఇంక నేనెవడికి చెప్పేది... నిజానికి ఈ సున్నితత్వమంతా నీనుంచే వచ్చి వుంటుంది వాడికి....

ఇంకా ఏడుపు ముఖం తుడుచుకుని త్వరగా బాక్సు సర్దు నాకు ఆఫీసుకు టైమవుతోంది.... నిజంగా నిన్ను చూస్తుంటే చిరాకేస్తుంది నాకు... ముందా ఏడుపు మొహం మార్చుతావా లేదా... ఇప్పుడు మీ వాళ్లెవరయినా వచ్చి చూస్తే నన్ను తప్పుగా అర్థం చేసుకుంటారు ఖచ్చితంగా.. లేదా దగ్గరి వాళ్లెవరయినా పోయారా ఏంటి... అనుకుంటారు... మనకు తెలియని

మనుషులు దూరమయితే మనకేమి అనిపించదు గాని.... ఇంతో అంతో పరిచయమున్న వాళ్లయితే బాధేననుకో నువ్వన్నట్టు... అందునా ఆ మనిషి కొన్నాళ్లు మనతోనే సహవాసముండి... కష్టసుఖాలు మాట్లాడుకున్న మనిషయితే మరింత బాధే.... అలాంటి వాళ్ల గురించి బాధ పడటం సహజమే... కానీ కరెంటు బిల్లు వసూలు చేసుకెళ్లే వాళ్లు... గ్యాసు బండలు వేసెళ్లే వాళ్లు... పాలవాళ్లు... పేపరు వాళ్లు...




రోజు అంట్లు తోమి బట్టలుతికి వెళ్లిపోయే మన పనిమనిషి లాంటి వాళ్లు... ఇలాంటోళ్లు ఎంతో మంది వుంటారు... పోతారు... వాళ్ల కోసం కూడా మనమిలా ఏడుస్తూ కూర్చునుంటే బతగ్గలమా..... మనం చేయాల్సిన పనులు ఒత్తిడి వల్ల మన గురించి మనమే ఆలోచించుకోలేని పరిస్థితి ... అయినా తమ దగ్గరి బంధువులు పోయినా... ఏదో మొక్కుబడిగా వెళ్లి వచ్చి తమ పనులు తాము చక్కబెట్టుకునే వాళ్లే అంతా లోకమ్మీద.......

ఇదంతా ఎందుకు... మొన్న మన బుడ్డాడి విషయంలో మన పొరుగు వాళ్ల ఇంటి దగ్గర జరిగిన విషయమే తీసుకుందాం.... వాళ్ల బిన్ని భలే అందంగా వుంటుంది. చూడగానే ముద్దు పెట్టుకోవాలనిపించేత తెల్లని మెత్తని ఉన్నిలాంటి బొచ్చుంటుంది దాని వొళ్లంతా నీకు తెలిసిందేగా... పాపం దానికి మాత్రం ఏం తెలుసు యజమానురాలు ట్రెయినింగును బట్టే అది నడుచుకుంటుంది.... అసలే పక్కింటి వాళ్లకు... బిన్ని వాళ్ల యజమానురాలుకి మధ్య పచ్చగడ్డి వేయకపోయినా ఎప్పుడూ మండుతూనే వుంటుంది.

అలాంటిది... బిన్నీ వెళ్ళెళ్ళి వాళ్ల గోడమీద ఉచ్చు పోస్తే ఊరుకుంటాడా ఆ ఇంటాయన... ఇంతెత్తున లేచి విరుచుకుపడ్డాడు. యజమానురాలి మీద ... అంతే ఆమెకు కోపం నషాలానికి అంటి బిన్నీని కర్ర పుల్లతో సుయ్ సుయ్యని బాదటం... అది కుయ్యో మొర్రో అంటూ గేటునుంచి మన ఇంటిలోపలికి దూరటం... సరిగ్గా అప్పుడే మన బుడ్డోడి కళ్లల్లో పడటం క్షణాల్లో జరిగిపోయింది... అంతే వాడు గభాల్న బిన్నీని తన చేతుల్లోకి తీసుకుని గుండెలకత్తుకుంటూ వాడి రూంలోకి దూరిపోయి యజమానురాలి వంక కోపంగా చూస్తూ నిలబడ్డాడు.... బిన్నీని కొట్టడానికి నీకెన్ని గుండెలు.... అన్నట్టుంది వాడి చూపు... హతాశురాలయిన యజమానురాలు... మా కుక్క నా ఇష్టం కొట్టుకుంటాను... చంపుకుంటాను... మీ అబ్బాయెవరు అడగటానికని... నీమీదనేగా ఇంతెత్తున తాచులా లేచింది... గుర్తుందిగా నీకు.... ఎలాగోలా సర్ది చెప్పి ఆమె కుక్కను ఆమె చేతిలో పెట్టి పంపిస్తున్నప్పుడు.... "వొద్దు మమ్మీ బిన్నీని మనవే పెంచుకుందాం... ఆంటితో పంపించామంటే కొట్టి చంపేస్తుంది తను" అంటూ వాడు కళ్ల నీళ్లు బిగబట్టడం.. అది మన వాడి గుండెల మీద కాళ్లతో తంతూ మొరాయించటం.... నన్నొదలకు ప్లీజ్... నేను నీతోనే వుంటాను... నా యజమానురాలితో వెళ్లనంటే వెళ్ళను అని భీష్మించుకుని కూర్చోలేదు మన వాడి వొళ్లో... నువ్వు గమనించే వుంటావు... ఆ తరువాత ... అది వాళ్లు పెంచుకుంటున్న కుక్కరా... అది మనకెలా ఇస్తారు... దానికి యజమానురాలితో వుండటం ఇష్టం లేకపోయినా సరే అది వాళ్ల సొంత కుక్కరా... అది మనకెలా ఇస్తారు... దానికి యజమానురాలితో వుండటం ఇష్టం లేకపోయినా సరే అది వాళ్ల సొంత కుక్కరా కన్నా... మూగ జీవాలను ప్రేమగా చూసుకోవాలనే ఇంగితం అందరికీ వుండదు.. అందునా మనది కాని కుక్కపై కూడా నువ్వంత ప్రేమ చూపిస్తున్నావని తెలిసి... ఆ కుక్కను నీకివ్వకపోయినా ఫర్వాలేదు నీ ప్రేమ నుండి స్ఫూర్తిని పొంది... ఇక మీదట ఆ యజమానురాలు బిన్నీని కొట్టకుండా బాగానే చూసుకుంటుందని ఆశిద్దాం సరేనా... ఈ సారి మళ్లీ అలా జరిగితే బిన్నీని మనింటికే తెచ్చుకుందాం... ఇక ఆ ఏడుపాపరా బాబూ.... అని మనవాడ్ని వారించటానికి ఎంత టైం పట్టింది మనకు తెలుసుగా... వాడి ప్రేమను చూస్తే నాకు ముచ్చటేస్తుంది... మూగ జీవాలంటే మరి ప్రేమ వాడికి... వాటినెవరయినా బాధ పెట్టటం చూస్తే చంపెయ్యాలన్నంత కోపమొస్తుంది వాడికి వాళ్ల మీద ... వీడ్ని చూస్తుంటే నాకు ... ఫ్రెండ్ ఆఫ్ ది ఫ్రెండ్లెస్... అని కీర్తించబడ్డ మిస్టర్ హెన్రీ బెర్గ్ గుర్తొస్తాడు... మనుషుల్ని మనుషులే గుర్తించని ఈ లోకంలో జంతువుల బాగోగులు పట్టించుకోవటం చాలా గొప్ప విషయం... ఒకసారి మనవాడేమన్నాడో నీకూ చెప్పానుగా.... బిన్నీ మీద ఆలోచనలతో కాస్త నలతగా కనిపిస్తున్నాడేమోనని... నీ సలహా మేరకు నేనో అందమైన బుజ్జి బొచ్చుకుక్కను కొనుక్కొస్తాను పెంచుకుందాం.... నువ్వు రోజూ ఆడుకొవొచ్చు దానితో సరేనా నాన్న... అంటే వాడేమన్నాడు... "ఎందుకు డాడి వీధి కుక్కలను పెంచుకుందాం.. పాపం వాటి ఆలనా పాలన చూసే వాళ్లెవరూ వుండరుగా... ఇలాంటి ఖరీదయిన కుక్కల్ని డబ్బున్న వాళ్లెవరో వొకరు ఇంట్లో పెట్టుకుంటారులే డాడి... పాపం వీధి కుక్కల్ని చూస్తుంటే నాకు జాలెస్తోంది".

నువ్వు కూడా అదిరి పడ్డావ్ వాడి మాటలతో... ఛీ.... ఛీ... వీధి కుక్కల్ని తెచ్చి మన ఇంట్లో పెట్టుకుందామంటావేమిటిరా... నీ ప్రేమ పాడుగాను.. అని విసుక్కున్నావు కూడా నువ్వు.... తోటి మనుషులు బాగా తెలిసిన వాళ్లు ఇబ్బందుల్లో వుంటేనే... మాకెందుకులే అని ఊరకుండె ఈ సమాజంలో వీధి కుక్కల్ని ఆదరించాలని చూసే వాడి ప్రేమ ఎంత గొప్పది... ఇక్కడ నాకు ఒక మదర్ తెరెసా ప్రేమ గుర్తొస్తుంది... ఎవరూ పట్టించుకోని.. భయంకరమయిన రోగాలతో వొళ్లంతా పుళ్లు పడిపోయి... అయిన వాళ్లు కూడా అసహ్యించుకున్న ఎంతో మంది రోగులను తన గుండెలకత్తుకుని వాళ్ల అవసాన దశలో అమ్మలా సేవలందించి ఆదుకున్న మదర్ ప్రపంచానికి అమ్మయింది తెలుసుగా.. అయ్యో బాబాయ్ నేను నిన్ను పొగుడుతున్నానా... తెగడుతున్నానా...



ఇవ్వాళ నేనిక ఆఫీసుకు వెళ్లినట్టే...ఇప్పటిదాకా నువ్వేమో ఏడ్చుకుంటూ కూర్చొవటం... నేనేమో నిన్ను ఓదార్చుతున్నట్టుగా అనవసర విషయాలకు అంత ప్రాధాన్యత ఇవ్వక్కరలేదన్నట్టుగా ఓ చిన్నపాటి ప్రసంగంలాంటి ఉపదేశమివ్వటం జరిగిపోతుంది. అయినా నువ్వలా ఓ పక్క బాధ పడుతూ వుంటే నేనేలా ఆఫీసుకెళతాను... ఇంత చెప్పినా నువ్వింకా ఫ్రీ అయినట్టుగా లేవు... పాలవాడి పట్ల ... పేపరు వేసే వాడి పట్ల కూడా మరి ఇంతగా జాలిపడుకుంటూ పోతే మనల్ని మనం ఏం చక్కబెట్టుకుంటాం... పక్క వాళ్ల మీద చూపించే సింపతిగ్గూడా ఓ హద్దుండాలంటాన్నేను... మన బుడ్డాడికి మనం బోధించేది అదే కదా.... ముందు వాడ్ని ఎలా మార్చాలా అని నేను తంటాలు పడుతుంటే.. నువ్విలా తయారవటం తల పోటుగా వుంది... తల పోటంటే గుర్తొచ్చింది... కాస్తంత కాఫీ అన్నా పెడతావా లేదా... ఈ లోపు నేను టీవీలో కాసేపు వార్తలన్నా చూస్తూ వుంటాను...


ఓ సారీ ! వార్తల్లో పడిపోయి టీపాయి మీద నువ్వు కాఫీ పెట్టెళ్లావన్న సంగతే గమనించలేదు.. అన్నట్టు ఆ బట్టలు సర్దటం అయిపోయిందా... ఒక వైపు బాధతో వుండి కూడా నీ డ్యూటిని మాత్రం నువ్వు ఇంత పర్ఫెక్టుగా ఎలా చేస్తావో నాకిప్పటికి అర్థం కాదు... కాఫీ చల్లారితే పోనిలే... ఆ వార్త చూస్తుంటే నాకు ఈ కాఫీ కూడా నోట్లోకి పోవటంలేదు జయా.... అయినా.... కొంత మంది జాలిగొలిపే వార్తల్ని... అయ్యో పాపమంటూ... కనీస సానుభూతిని తెలపాల్సిన... ఘోరమయిన వార్తల్ని కూడా... ప్లేట్లో జీడిపప్పు ఉప్మా తింటూ టీవీలో చూస్తూ వుంటారట.... అదెలా సాధ్యమో... నాకిప్పుడు కాఫీ తాగాలంటేనే మనసంతా అదోలా వుంది...

ఈ ఘోరం చూశావా... కనీసం కన్న కొడుకుని కూడా చూడకుండా ఆ తల్లి... తన ప్రియుడితో కలిసి... ముక్కలుగా నరికి గోనే సంచిలో కూరి ఇంట్లో దాచి పెట్టిందట.... నాలుగయిదు రోజుల తరువాత ఆ ఇంట్లోంచి కంపు వాసన రావటం గమనించిన చుట్టుపక్కల వాళ్లు.... పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఈ ఘోరం బయటపడిందట... టీవీలో వచ్చే న్యూసదే... తలుచుకుంటేనే... గుండె చెరువవుతోంది... దుఃఖం ఎగదన్నుకొస్తోంది.... ఏమయిపోతున్నారీ మనుషులు... కూతురికి ఆస్తి పంచటం కోసం... కొడుకు అడ్డుగా వున్నాడని ఇంత కిరాతకంగా తన కన్న పేగునే నరుక్కునే తల్లుల్ని చూస్తుంటే... ఈ మనుషుల్లోని సున్నితత్వమేమయి పోతుందనిపిస్తుంది... ఆపదలో వున్న మనిషిని చూసి చలించిపోయే గుణం చచ్చిపోతుందా... యాక్సిడెంటయి రోడ్డు మీద చావు బతుకుల్లో వున్న మనిషిని ఆస్పిటలుకు తీసుకుపోవాలనే స్పృహ లేకుండా... పులి ఎంక్లోజరులోకి ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తిని... కాపాడే ప్రయత్నం చేయకుండా మదమెక్కిన ఏనుగు తొక్కి చంపుతున్న మనిషిని తప్పించే ఆలోచనేదో చేయకుండా... హాయిగా సెల్ఫోన్లల్లో చిత్రీకరించి ఫేస్‌బుక్కుల్లో అప్ లోడ్ చేయాలని ఆరాటపడుతూ మానవత్వం మరిచిపోయే ప్రబుద్ధుల్ని చూస్తున్నాం... అలాంటి నీ పరిస్థితి చూడు....

అతనితో నీకేమంత పరిచయముందని... నెలకోసారి తనకు రావాల్సిన డబ్బులేవో వసూలు చేసుకునెళ్లి తన యజమానికి అప్ప జెపుతూ వుంటాడు... కాకపోతే తనకు రావాల్సిన డబ్బులు కూడా ఎంతో మర్యాదగా అడుగుతాడు... ఈ రోజు లేవు పోవయ్యా అంటే అదే చెరగని చిరునవ్వుతో.... "అయ్యో ఇప్పటికే రెండు నెలలయిపోయింది... మా యజమాని ఊరుకోడు సార్... దీనిలో మాకొచ్చే కమిషన్ కూడా ఏమీ లేదు"... అంటూ చాలా మర్యాదగా అతనేదో మనకు బాకీ వున్నట్టుగా ఫీలవుతున్నట్టుంటుంది... మనకే కాదు అతనితో ఇలాంటి అనుభవం ఈ వీధిలో దాదాపు అందరికీ వున్నట్టుంది... ఏ కంప్లయింటు చెప్పినా... మన రెండు నెలల బకాయి వున్నామని...

తెలిసి కూడా.... ఏ మాత్రం అలక్ష్యం చేయకుండా... ఫోన్ చేయగానే మనింట్లో వాలి... ఆ కంప్లయింటేదో క్షణాల్లో

చేసి పెడతాడు... ఈ వీధిలో ఎవర్నడిగినా అతను చాలా మంచివాడనే వాళ్ళేగాని... ఒక్కరు కూడా వేలెత్తి చూపించేవాళ్లు లేరు... నేను కూడా ఆఫీసుకెళ్లేటప్పుడు ఈ వీధిలోనే అతన్ని చాలా సార్లు చూశాను... లైను మీద తిరుగుతూ ఎప్పటికప్పుడు కేబులెక్కడయినా తెగి పోయిందాని పరిశీలనగా చూస్తూ వెళ్ళేవాడు.... ఆ రోజెవరయినా ఫోన్లో కంప్లైంయింటిస్తే



టంచనుగా అక్కడ వాలేవాడు... అతనికో చిన్న పాతదయిన సైకిలు.. చేతిలో ఓ డైరీ.. హేండిలుకో చిన్న పని ముట్లున్న కవరు సంచి తగిలించుకుని... సైకిలు తొక్కుకుంటూ ఈ వీధి వీధంతా తిరిగేవాడు... ఎదురు పడిన ప్రతి వాళ్లని నవ్వుతూ పలకరించడం అతని నైజం... మీ టీవి క్లియర్‌గా వొస్తుందా సార్ ఏమన్నా కంప్లయింటుంటే చెప్పండి చేసి పెడతానని పలకరింపుగా నువ్వుతూ వెళ్లేవాడు... అలాంటి వాళ్లను చూస్తే ఎవరికయినా అభిమానముంటుంది నిజమే... కానీ ఇంత మాత్రానికే మరి నీ అంత అభిమానాన్ని ఎవరూ ప్రదర్శించరు....

మొన్న మీ బాబాయి చనిపోతే ఎంతగా ఏడ్చావని... దానిలో అర్థముంది... మీ బాబాయితో నీకున్న అనుబంధం అభిమానం అలాగే వుంటుంది. ఎంతయినా నాయిన తోడబుట్టినోడు కదా... నీ విషయంలోనయితే మరీను... మీ నాయినకంటే నువ్వు మీ బాబాయినే ఎక్కువ అభిమానించడం నేను కూడా చాలా సార్లు గమనించాను... అతను కూడా కడుపు తెరిచి కన్న మీ నాయిన కంటే... నిన్ను తన సొంత కూతురికన్నా ఎంత బాగా చూసుకునేవాడో నువ్వే నాకు ఎన్నిసార్లు చెప్పలేదు. మనతో ఎక్కువ కాలం కలిసి జీవించిన వాళ్ళు..... మన కష్ట సుఖాలను పట్టించుకున్నవాళ్ళు... మనమంటే కాస్తంత ఎక్కువ ప్రేమాభిమానాలను చూపించే వాళ్లను మనం అభిమానించటం... వాళ్లు పోతే... తట్టుకోలేకపోవటం సహజమే కానీ... మరీ నువ్వేంటో నాకు అంతుపట్టటంలేదు... ఇప్పుడు అర్థమవుతుంది నాకు మన బుడ్డాడిది కూడా నీ పెంపకమే గదా మరి..... "ఎంతసేపూ నువ్వే మాట్లాడుతున్నావు... నన్ను మాట్లాడనిస్తేగా" .... అంటావా?...... హమ్మయ్య! కనీసం ఈ ప్రశ్నతోనయినా ఈ లోకంలోకొచ్చావు సంతోషం.

---

మీరన్నది నిజమేనండి... అతనితో నాకేమంత పరిచయంలేదు... కానీ వున్న కొద్ది పరిచయమయినా... మన చుట్టూ ఆత్మీయంగా తిరిగి మనకు సేవలందించే ఒక తోటి మనిషి.. అందునా ఇంకా ఎంతో జీవితమున్న వ్యక్తి... పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలు... ఇంకా చదువు పూర్తికాని ఒక మగ పిల్లాడు వుండి... తను పని చేస్తేగాని కుటుంబం గడవని పేదవాడు... ఇంత హఠాత్తుగా మాయమైపోతే.... పాపం... ఆ కుటుంబం పరిస్థితేంటోనని... తలుచుకుంటే దుఃఖమొచ్చిందండి... పాపం మొన్న ఆదివారమే కదా అతను మనింటికొచ్చింది కేబులు బిల్లు కోసమని... నా చేతులతో నేను కప్పు కాఫీ కూడా ఇచ్చాను పాపం.... మీతోపాటు కలిసి తాగాదు కూడా... నిజమే ఆలోచిస్తే ఇప్పుడు నాకు ఏడపొస్తోంది జయా.... నిన్న సాయంత్రం అక్కడేదో వైరు తెగిందని సరి చేస్తాడేమోనని నేనేగా ఫోను చేశాను... రెండుసార్లు హలో అంటున్నాను. ప్రతిగా అతని గొంతు వినిపిస్తుందేమోనని... కానీ అవతలి వైపునుంచి ఎవరో గట్టిగా ఏడుస్తూ అతికష్టం మీద గొంతు పెకలించకుని చెప్పారు. గొల్లుమంటూ... "ఆంజనేయులు చచ్చిపో.... యా ....దం......డి..... నిన్న రాత్రి గుండె పోటొచ్చింది".. అంటూ అతనెవరో... వాళ్ళ తమ్ముడో అన్నో అయ్యుంటాడు... ఏడుస్తూనే వున్నాడు.... అవాక్కయిన నా చేతిలోంచి ఫోను జారి కిందపడింది.... పాపం దుఃఖంలో వున్నారు.... స్వయంగా వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి.... మన సానుభూతిని తెలియజేసొద్దామనుకుని మళ్ళీ ఫోను చేయలేదు.... ఆ విషయమేగా నీకు చెబుతున్నా... అంతే! ఎవరో ఆత్మీయులు పోయినట్లు ఇంకా ఏడుస్తూనే వున్నావు... నువ్వే కరెక్టనిపిస్తుందోయ్... రోజు రోజుకా యంత్రాలకు దగ్గరవుతున్న మనిషి.... తనకు తానే ఓ మరయంత్రంలా మారిపోయి... సున్నితత్వాన్ని కోల్పోతున్న ఈ ప్రస్తుత సమాజంలో నీలాంటి వాళ్ళ అవసరమే చాలా వుందనిపిస్తోంది... మనిషన్నాక దుఃఖ్ఖానికి, సంతోషానికి చలించాలి... సాటి మనిషిపట్ల సానుభూతినో సహానుభూతినో ప్రకటించాలి..... అయినా ఒక మనిషి మరో మనిషిని ప్రేమించడానికి..... ఏ రక్త సంబంధమో.... స్నేహ బంధమో అక్కరలేదు.... చిన్న కేబుల్ బంధమయినా చాలేమోననిపిస్తుంది నిన్ను చూస్తుంటే.....!

**విశ్లేషణ**

# కె. సుభాషిణి 'అమూల్య' కథలు -వస్తు వైవిధ్యం



**ఆచార్య కె. ఆశాజ్యోతి**
**9449672394**

వృక్షాన్ని బిగువుగా పైకెత్తి స్ఫుటం చేస్తూ – ఋతువులకు అనుగుణంగా ఆకులు రాలుతూ కాల క్రమేణా చెట్టు నశిస్తున్నా, తిరిగి చివురులు తొడిగించి పూతలు పూయించి మరుజన్మనిచ్చేది భూమి పొరల్లో ఉన్న వేర్లే. ఆ చెట్టు దహించుకుపోయినా, మోడు వారినా తిరిగి బతికించగలిగే శక్తి వేర్లు తీసుకుంటాయి. బతుకునివ్వడం వేర్ల లక్షణం. బతకవలసిన అవసరం చెట్టుది. చెట్టుకు బలమూ, అందమూ, ఆధారమూ వేర్లే !

ఏ సమాజం లోనైనా వేర్లు చేసే పని సాహిత్యం చేస్తుంది. సమాజం ఎదగడానికి, నిత్యం సమాజం తనను తాను పరిశీలించుకోవడానికి సాహిత్యం. ఒక ఉపబలకం. సమాజం ఉన్నతీకరింపబడడానికి సాహిత్యం తోడ్పాటు అవసరం. సమాజ చలన సూత్రాలలో సాహిత్యం ప్రధాన భూమిక పోషిస్తుంది. సమాజానికి దిక్సూచి సాహిత్యం. బతకవలసిన అవసరం సమాజానిది. బతికించాల్సిన బాధ్యత సాహిత్యానిది. వృక్షానికి చెదలు పట్టినట్టే సమాజాన్ని సమస్యలు పట్టి పీడిస్తాయి. ఆ పీడ చెదలను తొలగించేదే సాహిత్యం.

రాయలసీమ అనగానే కళ్ళకు దర్శనమిచ్చేవి. కరువు, ఫాక్షనిజమ్. రాళ్ళుపగిలే ఎండలు ! నీటి ఎద్దడి ! వీటితోపాటు నేనున్నానని బండల మధ్య మొలిచే మొక్కలా రాయలసీమ సాహిత్యం ! ఏ సాహిత్యానికైనా సమాజామే ఆధారం. రాయలసీమ సాహిత్యోద్భవానికి ఆదరువు కూడా సమాజమే! ఐతే సాంఘిక, ఆర్థిక, రాజకీయ అణచివేత సాహిత్యాన్ని పదునుపెట్టాయి. రాయలేలిన రాయలసీమ రాళ్ళ సీమగా మారడం వెనుక గమనించవలసిన, అర్థం చేసుకోవలసిన చరిత్ర ఉంది. రాయలసీమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలకు కారణంగా నిలిచిన ప్రభుత్వాల విధానాలు, ప్రకృతి వైపరీత్యాలు ప్రధానంగా చర్చకు పెట్టవలసిన అంశాలు. నదులు ఎండిపోవడం, వర్షాభావం, ప్రపంచీకరణ పేరుతో సాగుతున్న నగరీకరణ, రైతుల వలసలు, దుక్కి దున్నడం కానీ, సాగు కానీ లేకపోవడం, కాలవల ద్వారా రాయలసీమకు చేరవలసిన నీరు అందకపోవడం, కరువుతో అల్లాడుతున్న రాయలసీమను మరింత పీడనకు గురిచేస్తూ ఎగువ ప్రాంతాల నీరు రాయలసీమకు రాకుండా మళ్ళింపుకు గురికావడం, కెనాల్ నీళ్ళ ద్వారా సాగు తగినంతగా లేకపోవడం – అన్నీ శాపాలే రాయలసీమకు ! ఈ నేపథ్యంలో వచ్చిన గాయాల, వెతల సాహిత్యమే రాయలసీమ సాహిత్యం !

రాయలసీమ సాహిత్యంలో రచయిత్రుల కథా సాహిత్యం పరిశీలిస్తే ప్రారంభంలో రాశిలో తక్కువే ఐనా రాయలసీమ గొంతును, ముఖ్యంగా రాయలసీమ రచయిత్రుల స్వరాన్ని బలంగా వినిపించే ప్రయత్నం కథా సాహిత్యంలో కనబడుతుంది. మామిడి రుక్మిణమ్మతో (సుందరి – 1927 జనవరి) మొదలైన కథా సాహిత్యం, పూండి చెల్లమ్మ (సీతా బాయి – 1927 ఆగస్ట్), అలవేలమ్మ (బారా కట్ట – 1927 డిసెంబర్), డి.పాపమ్మ (అత్తగారూ రేడియో తెలుసుకొంటిరా? 1928 నవంబర్) వంటి కథా రచయిత్రులు తమ స్వరం వినిపించే ప్రయత్నం చేసారు. వీరి తరువాత కథా రచయిత్రులు జోళపాలెం మంగమ్మ, ఆచంట శారదాదేవి, ఉమాశశి, సి.ఉమాదేవి, పద్మావె వాచస్పతి, ఆచార్య ఎం.కె.దేవకి, పోగాకు శైలజ, గల్లా అరుణ కుమారి,పసుపులేటి మాణిక్యవీణ, మంజులా శివానందం, మల్రెడ్డి నాగమణి, మండువ రాధ, ఎం.ఆర్.రమణి కుమారి, పసుపులేటి గీత, అమ్మాజి. శైలజామిత్ర, ప్రసన్న లక్ష్మి, మూలింటి చంద్రిక, గండికోట వారిజ, ఉమ ప్రసన్న, గంజాం భ్రమరాంబ, జ్యోతిరెడ్డి, భారతి, పుల్లమ్మాదేవి,హైమాభార్గవ్, భాగ్యలక్ష్మి, కె.మధుజ్యోతి, ఆర్. వసుంధరా దేవి, చక్కిలం విజయలక్ష్మి, ఎ.శ్రీదేవి, షహనాజ్ బేగం, జి. నిర్మలారాణి, ఆర్. శశకళ, కె.సుభాషిణి మొదలైనవారు. వీరిలో కె. సుభాషిణి రాసిన కథలలోని వస్తు వైవిధ్యం ప్రస్తుతాంశం.

సుభాషిణ రెండు కథా సంకలనాలను వెలువరించారు. అందులో 'మర్మమెల్లా గ్రహించితి తల్లీ' 2008 లోనూ, 'అమూల్య' 2015లోనూ వచ్చాయి. అమూల్య కథా సంకలనంలో మొత్తం పదిహేను కథలున్నాయి. అమూల్య, గుహ, లక్షణ, గద్ద రెక్కల చప్పుడు, డా.నీలకంఠం పిహెచ్.డి. గిఫ్టు, రమాదేవి కొడుకు, బ్రహ్మ సూత్రాలు, గాయాలు, బ్లాక్‌హోల్, అన్వేషణ, ఒకటి ×రెండు =నాలుగు, నీవు నేర్పినదే, అరుణ కోసం, జారవిడుచుకున్న రంగులు. ఈ కథలు కొన్ని స్త్రీల సమస్యలను ప్రతిబింబించే కథలు. మరికొన్ని ప్రపంచీకరణ ప్రభావంలో మానవ సంబంధాలు దిగజారుతున్న తీరును ప్రధాన వస్తువుగా తెలిపే కథలు. అందుకే ఈ కథలన్నీ రెండు విభాగాలుగా పరిశీలిస్తే, స్త్రీ సమస్యలను ప్రతిబింబించిన కథలు. ప్రపంచీకరణ ప్రభావం ప్రతిబింబించిన కథలుగా కనబడతాయి.

> ***ఈ కథలు కొన్ని స్త్రీల సమస్యలను ప్రతిబింబించే కథలు. మరికొన్ని ప్రపంచీకరణ ప్రభావంలో మానవ సంబంధాలు దిగజారుతున్న తీరును ప్రధాన వస్తువుగా తెలిపే కథలు.***

***స్త్రీ సమస్యలను ప్రతిబింబించిన కథలు :*** అమూల్య, గుహ, లక్షణ, గిఫ్టు, రమాదేవి కొడుకు, బ్రహ్మ సూత్రాలు, గాయాలు, అన్వేషణ, అరుణ కోసం జారవిడుచుకున్న రంగులు.

**ప్రపంచీకరణ ప్రభావం ప్రతిబింబించిన కథలు :** గద్ద రెక్కల చప్పుడు, డా.నీలకంఠం పిహెచ్.డి. బ్లాక్ హోల్, ఒకటి ×రెండు =నాలుగు, నీవు నేర్పినదే కథలు చేరతాయి.

ఈ కథలన్నీ స్త్రీల సమస్యలు వాటి పరిష్కారాలు, ప్రపంచీకరణ ప్రభావంతో మృగ్యమవుతున్న మానవ సంబంధాలను తెలుపుతాయి. 'అమూల్య' కథ ప్రపంచీకరణ పేరుతో ఇళ్ళ ముందుకు దిగిన మార్కెట్ వస్తువుల ప్రలోభానికి గురవుతున్న ఆడపిల్లలు తల్లిదండ్రుల కాయ కష్టం గ్రహించలేని స్థితిని చూపెడుతుంది. 'గుహ' కథ ఫండ్స్ పేరుతో ట్రైనింగ్ ప్రోగ్రాం నడిపే యుజిసి లాంటి సంస్థ వ్యర్థం చేస్తున్న డబ్బు వల్ల సాధించినదేమీ లేకపోగా, ఎందరో విద్యార్థుల సొమ్మును వ్యర్థపరుస్తున్న తీరుకు ఆందోళన చెందిన స్త్రీ హృదయం కనబడుతుంది. 'లక్షణ' విలక్షణమైంది. శ్రీకృష్ణుని భార్యలలో చివరిదైన లక్షణ భర్త తన కోసమే కొంతైనా సమయం వెచ్చించాలని ఆశపడుతుంది. అది జరగక పోవడం వింత కాదు. ఐతే లక్షణ ఆ ఒంటరితనం భరించలేనంటూ శ్రీ కృష్ణుడంతటి వాణ్ణి తిరస్కరించగల స్థితికి చేరడం వెనుక ఉన్న అంతర్మథనం ఆహ్వానించదగ్గ పరిణామం. 'గిఫ్టు' కథలో 'ఇచ్చేవాడికి తీసుకునేవాడు లోకువ' చందాన మల్టీ నేషన్ కంపెనీలు తమ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు కానుకలివ్వడం, ఆ కనుకలు ఎందుకూ కొరగానివి కావడం, అవి తీసుకున్న ఉద్యోగులు తమ ఇళ్ళల్లో పనిచేసేవారికి ఇవ్వడం వంటి పరిస్థితులు నిచ్చెన మెట్ల తీరును తెలిపే వర్ణ వ్యవస్థకు ప్రతిబింబాలు. తాము మోసపోతే తమ కిందనున్న వారిని మోసం చేసే నైజం మానవ బలహీనతకు నిదర్శనం. ఆ గుణం అద్దంలో చూసినట్టుగా అనిపించే కథ ఇది. 'రమాదేవి కొడుకు' కథలో వస్తువుకు ఉన్న విలువ తల్లి శ్రమకు లేకపోవడం, బాధ్యతారాహిత్యంగా తిరుగుతూ శ్రమ విలువ తెలీని కొడుకు లక్షల కొద్దీ తల్లి చేత అప్పు చేయించి, మళ్ళీ కొత్త అప్పు అడుగుతున్నందుకు మానసిక వేదన అనుభవించి ఎటువంటి

పరిస్థితుల్లోనూ అప్పు చేయకూడదని నిర్ణయించుకున్న ఒక తల్లి కథ. 'గాయాలు' మరొక విలక్షణమైన కథ. ప్రాంతీయ ఆధిపత్యాల వల్ల అణచివేతకు గురవుతున్న ప్రాంతాలలో ప్రజలు అనుభవించే వ్యథను తెలిపే కథ. క్షామం, నీటి ఎద్దడి వంటి సమస్యలతో సతమతమవుతున్న రాయలసీమకు రకరకాల కారణాల వల్ల వచ్చిన కోస్తా ప్రజలు తమ కోస్తాంధ్ర ప్రాంతాలలో ఉన్న ఆచారాలు, ఆహారపుటలవాట్లు గొప్పవని చెప్పుకుంటూ రాయలసీమ ప్రజల నైతికతను దెబ్బ తీసే పరిస్థితులు ఏర్పడడంతో ప్రమాదమని భావించి, మధనపడి, ఆ భావజాల ఆధిపత్యాన్ని తిరస్కరించే స్థాయికి ఒక స్త్రీ పాత్ర చేరుకోవడం కథ. ప్రశ్నించవలసిన సందర్భంలో వెనకడుగేస్తే ఎప్పటికీ అణచివేయబడతామని తెలిపే కథ ఇది. 'బ్రహ్మసూత్రాలు' బ్రహ్మ లోకం నేపథ్యంలో బ్రహ్మ, సరస్వతులు ప్రధాన పాత్రలుగా సాగిన కథ. భూలోకంలో స్త్రీలు చైతన్యంతో బతుకుతున్న పరిస్థితుల వల్ల తమకు చిక్కులొస్తున్నాయని పురుషులు బ్రహ్మను వేడుకోవడం, వాళ్ళ సంభాషణలో స్త్రీలకు అన్యాయం జరుగుతుందని విన్న సరస్వతి బ్రహ్మపై తిరుగుబాటు చేయడం, స్త్రీలను అజ్ఞానులుగా చెయ్యాలన్న పురుషుల డిమాండ్‌కు తన నిరసనను తెలుపుతూ సరస్వతి బ్రహ్మను విడిచి భూలోకం వెళ్ళడం ఒక మంచి కథ. 'అన్వేషణ' మరో కథ. స్త్రీ చైతన్యాన్ని, అభివృద్ధిని ఏ మాత్రం ఆశించని సమాజంలో, పురుషుల కోసం ఏర్పడిన ఈ సంఘంలో ఏ వర్గ స్త్రీ ఐనా పిల్లల పెంపకం తను చూడవలసిందే కానీ, పురుషుడు ఆ బాధ్యత తలకెత్తుకోక పోవడంలోని విషాదం తెలిపే కథ. 'అరుణ కోసం' కథలో మానభంగానికి గురైన అరుణకు వెన్నుదన్నుగా ఉంటూ, విద్యార్థి లోకం, మానవ సంఘాలు జరిగిన సంఘటనను తీవ్రంగా పరిగణిస్తూ అరుణకు తోడుగా ఉండడం ప్రధాన వస్తువు. 'జారవిడుచుకున్న రంగులు' కథలో వస్తు వ్యామోహంలో, ప్రపంచీకరణ మాయాజాలంలో రంగులను గుర్తించలేనంతగా తనను తాను పోగొట్టుకున్న అమ్మాచి మనిషిలోని మృదుత్వాన్ని తిరిగి పొందడం ప్రధాన వస్తువు. తను ఎందుకు రంగులను గుర్తించలేక పోయిందో గ్రహించి అందులోంచి వెలుపలికి రావడం ముఖ్యాంశం.

*ఈ కథలలో స్త్రీలు ప్రధాన పాత్రలుగానో, కథను నడిపించే పాత్రలుగానో ఉంటారు. తాము చైతన్యవంతులౌతూ, పాఠకులకు ఆ చైతన్యంలో భాగస్వాములను చేస్తారు.*

ప్రపంచీకరణ ప్రభావం మానవ సంబంధాలను ఇరుకు చేసే సందర్భాలను తెలుపుతూ, విదేశీ మార్కెట్ స్వదేశీ మార్కెట్‌ను కబళిస్తున్న తీరును, అందువల్ల దేశీయ వస్తువులనూ, సమాజాన్నీ పరిరక్షించుకోవడం కోసం ఆరాటం, తాపత్రయం ప్రధాన వస్తువులుగా సాగిన కతలు మిగిలినవి. 'గద్ద రెక్కల చప్పుడు' కథ ఇటువంటిదే. తమ పొలాలను గద్దల్లా తన్నుకుపోతూ, ఫ్యాక్టరీ పెట్టాలని చూస్తూ, ఊర్లల్లో బతకలేని పరిస్థితులు కల్పిస్తూ, ఊరిని వల్లకాడు చేస్తున్న వ్యక్తులపై తిరుగుబాటు చేసే ప్రయత్నం, గద్ద నుండి తన పిల్లలను రక్షించుకున్న కోడి పెట్టను ప్రతీకగా చూపించిన కథ గద్ద రెక్కల చప్పుడు కథ. 'డా.నీలకంఠం పిహెచ్.డి' కథ ఒక యువకుడి కథ. పిహెచ్.డి. చేస్తూ మూఢ నమ్మకాలకు లొంగిపోయిన ఒక యువకుడు, ఆ పద్ధతి సరి కాదని మేలుకోవడం కథా వస్తువు. 'బ్లాక్‌హోల్' కథలో సమాజంలో ప్రముఖులుగా పేరొందినవాళ్ళు, రాజకీయ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ స్వంతానికి మళ్ళించే తీరును తెలిపే కథ. అబ్కారి నిధులను లిక్కర్ వ్యాపారం వైపు మళ్ళించేందుకు మంత్రులు, ఎం.ఎల్.ఏ లు స్త్రీలను కూడా కలుపుకోవడం కోసం చేసే దగుల్బాజి ఆలోచనను తెలిపే కథ. 'ఒకటి×రెండు = నాలుగు' కథ ఒక మల్టీ నేషనల్ కంపెనీలో పని చేసే యువకుడు కంపెనీ పనిలోనే తన జీవితం కరిగిపోవడంలోని దౌర్భాగ్యాన్ని గమనించి, తన కుటుంబం కోసం కూడా తన జీవితమని గుర్తించి మేలుకోవడం వస్తువు. 'నీవు నేర్పినదే' కథ కార్పొరేట్ విద్య కోసం బిడ్డలను బలి ఇచ్చే తల్లిదండ్రులకు కనువిప్పు. తాము స్వర్గంగా భావించే విషయం పిల్లలకెంత నరకప్రాయమో తల్లిదండ్రులు ఎంత కఠినంగా ఉంటున్నారో, తమ దాకా వస్తే స్వర్గం ఎంతటి నరకమో తెలిపే కథ ఇది.

ఈ కథలలో స్త్రీలు ప్రధాన పాత్రలుగానో, కథను నడిపించే పాత్రలుగానో ఉంటారు. తాము చైతన్యవంతులౌతూ, పాఠకులకు ఆ చైతన్యంలో భాగస్వాములను చేస్తారు. స్త్రీలపై అత్యాచారాలను తీవ్రంగా ఖండించే కథ, మానవీయ కోణంలో ఆలోచింపచేసే కథ 'అరుణ కోసం'. స్త్రీల పై సాగే హింసలో సమాజం, అధికారం తమ పాత్రలను నిర్విఘ్నంగా సాగించే తీరును


## కవిత

# నాకు యుద్ధమో, శాంతో కావాలి

**- రెహానా**

ఝీలం, చీనాబ్, తావి
పరవళ్ళ పరవశం అంచున
బారులు కట్టిన సైన్యం క్యాంపులు

నింగి-నేల కలిసే ఆ
చివరి రేఖ వరకు
పైర్ల పచ్చదనం మాటున
యుద్ధ ట్యాంకర్ల మోహరింపు



విశాల మైదానాల నుంచి
గాలి తెరలతో పాటు
తరలి వచ్చే తూటాల తుంపర్లు

పర్వత సానువుల్లో
లోయల ఊయల్లో
హిమనీ నదాలతో పాటు ప్రతిధ్వనించే
కాల్పుల నాదాలు

ఓ సాయంత్రం వేళ
వాకిట నులక మంచం పై
సేద తీరుతున్న దేహాన్ని
ఛిద్రం చేసిపోయే మోర్టార్
బాంబుల పలకరింపులు

అవును నాకు
యుద్ధమో, శాంతో కావాలి...

---

ప్రశ్నించే కథ ఇది. మహిళా సాధికారత సాధించే క్రమం వైపు నడవవలసిన అవసరం తెలుపుతుంది. ఈ కథ. మార్జినలైజ్ అవుతున్న స్థితి నుండి బయటకు రావలసిన అవసరం తెలిపే కథ ఇది. ప్రాంతీయ అస్తిత్వానికి, ఆత్మాభిమానానికి పెద్ద పీట వేసిన కథ 'గాయాలు' ఆధిపత్య ప్రాంతాలుగా గుర్తింపబడి రాయలసీమ ప్రాంత ఆచారాలు, ఆహారపుటలవాట్లను కించపరచడం వెనుక ఉన్న వర్గ దోపిడి, ప్రాంతీయ ఆధిపత్యం పెచ్చుమీరుతున్న ధోరణిని గమనించాల్సిన అవసరం తెలిపే కథ. లక్ష్మణ, బ్రహ్మ సూత్రాలు, జారవిడుచుకున్న రంగులు స్త్రీలు చైతన్యవంతులు కావలసిన అవసరాన్ని తెలిపే కథలు. స్త్రీలు సమీకృత శక్తిగా ఎదగవలసిన ఆవశ్యకతను తెలిపే కథలు. దుర్భరమైన అవమానాలను, దోపిడీలను ఎదిరించాలని చెప్పే కథలు. హింస శారీరకమే కాదు మానసికం కూడా అని ఈ కథలు చెబుతాయి.

రాయలసీమ భాష ఈ కథలకు అదనపు బలం. పూర్తిగా అన్ని కథల్లో అనంతపుర యాస కనబడకపోయినా, కనిపించిన ప్రతీ సందర్భంలో రాయలసీమ మట్టి వాసన పరిమళాలను పంచుతుంది. సందర్భోచిత సంభాషణ, జీవితాన్ని కాచి వడబోసిన అనుభవాలసారం కొన్ని సందర్భాలలో దర్శనమిస్తుంది. కథా సంభాషణల్లో కొన్ని చోట్ల (బ్రహ్మసూత్రాలు) కనిపించే వెటకారం పాఠకులకు నవ్వు తెప్పిస్తుంది.

'వర్తమానంతో గతాన్ని మాట్లాడించే ప్రయత్నం' - అమూల్య

'స్త్రీల మనస్సులను ఈ మగవారు ఎప్పుడు అర్థం చేసుకుంటారో' - లక్ష్మణ


'సంవత్సరాల తరబడి బిగుసుకు పోయిన గొంతు.... గురకతో కూడిన శబ్దంతో కర్ణ కఠోరంగా ఉంది. సరస్వతి అదిరిపడింది' - బ్రహ్మ సూత్రాలు

'మహా ఐతే జొన్నల్ని గేదెలకు పెడతారు - గాయాలు

'ఇది అశాంతి కాదు.... బాధ్యత... మనిషిగా బ్రతకాలి అంటే దీన్ని మోయాల్సిందే' - అన్వేషణ

వంటి వాక్యాలు రచయిత్రి, శైలిని పట్టిస్తాయి. కథా కథనంలో తనదైన శైలితో, రాయలసీమ సాహిత్యంలో రచయిత్రుల కథా సాహిత్యానికి తనదైన ఒరవడితో కథా సాహిత్యాన్ని సృష్టిస్తున్న కె. సుభాషిణి అమూల్య కథల ద్వారా ప్రస్తుత సాహిత్యావసరాలను స్పృశించింది. సమాజం ప్రాంతీయాలుగా విడిపోతున్న వాస్తవ పరిస్థితులలో సాహిత్యం కూడా మార్పు చెందడం చైతన్యానికి నిదర్శనం. ఆ చైతన్యాన్ని అంది పుచ్చుకుని సాగిన రచనలుగా కె. సుభాషిణి కథలు నిలబడతాయి.

# విదేశాంధ్ర సాహిత్యకారుడు - డాక్టరు గూటాల కృష్ణమూర్తి



- దాసరి శివకుమారి
9866067664

*విదేశాలలో ఇంకా తెలుగు సంఘాలేవీ పరుడు పోసుకోకముందే న్యూ ఇంగ్లండ్, స్టేట్స్‌లో వున్న తెలుగు వారితో కలిసి తాను ముందుడి తన సారధ్యంలోనే అనేక తెలుగు సాహిత్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పదేళ్లపాటు లండన్ లోని ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్‌కు అధ్యక్షునిగా వుండి ఎనిలేని సేవలను అందించారు. ఆ సమయంలోనే దాశరథి, డా॥నారాయణరెడ్డి, పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీ కవితా పఠనాలూ, ఉపన్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేసి లండన్ లోని తెలుగువారికి వీనులవిందులు చేసేవారు.*

ఆధునిక తెలుగు సాహిత్యంపై చాలా మక్కువ కలిగిన వ్యక్తి శ్రీ గూటాల కృష్ణమూర్తి. లండన్‌లో నివాసమున్నా తన మాతృభాషకూ, ఇక్కడి ప్రముఖ వ్యక్తులకూ ఎనలేని ఖ్యాతిని ఆర్జించి పెట్టాలని తపించిన మానవీయమూర్తిగా వారిని శ్లాఘించవచ్చు. వీరి అనన్య ప్రతిభాప్రవత్తుగాల గురించి అనేక అంతర్జాతీయ పత్రికలలో ప్రస్తుతింపబడివున్నది. లండన్‌లో వున్నప్పుడే ఎన్‌సైక్లోపీడియాలో డాక్టర్ గూటాల. రెండు వ్యాసాలు అక్కడి వారికోసం వ్రాశారు. ఆ దేశపు రాణీగారి నుండి సామాన్య పాఠకుడి వరకూ వీరిని అభిమానించారు, ఆదరించారు. కృష్ణమూర్తి ఆంధ్ర ఆంగ్ల భాషల్ని ఔపోసన పట్టారు. అంతటి ప్రతిభామూర్తి అయిన డాక్టరు గూటాల కృష్ణమూర్తి 17-5|1929న పక్లా కిమిడిలో జన్మించారు. హైస్కూలు చదువు విజయనగరంలో ఇంటరు ఏ.వి.యన్.కాలేజీలో, బి.ఎ., ఆనర్సు ఆంధ్రా యూనివర్శిటీలో పూర్తి చేశారు. పి.హెచ్.డి. సాగర్ యూనివర్శిటీలో ప్రారంభించారు. బిలాస్‌పూర్‌లో ఉద్యోగిస్తూ, సాగర్ విశ్వవిద్యాలయంలో పార్ట్ టైం పరిశోధకునిగా "ఫ్రాన్సిస్ థామస్, ఎ. క్రిటికల్ బయోగ్రఫీ" అను అంశంపై పరిశోధించారు. 1962వ సం॥లో లండన్ టైమ్స్ పత్రికా కార్యాలయంలో ఉద్యోగం కోసం లండన్ వెళ్లారు. లండన్‌లోనే పి.హెచ్.డి. కొనసాగించి 1967వ సం॥లో డాక్టరేట్ సంపాదించారు. ఆ తర్వాత లండన్ ఎడ్యుకేషన్ అథారిటీ సర్వీసులో ప్రవేశించి లండన్ లోని వివిధ విశ్వ విద్యాలయాల్లో పనిచేశారు. 1968 నుండి 1972 వరకు ఉద్యోగరీత్యా అమెరికా వెళ్లి మరలా తిరిగి లండనే వచ్చేశారు.

విదేశాలలో ఇంకా తెలుగు సంఘాలేవీ పరుడు పోసుకోకముందే న్యూ ఇంగ్లండ్, స్టేట్స్‌లో వున్న తెలుగు వారితో కలిసి తాను ముందుడి తన సారధ్యంలోనే అనేక తెలుగు సాహిత్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పదేళ్లపాటు లండన్ లోని ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్‌కు అధ్యక్షునిగా వుండి ఎనిలేని సేవలను అందించారు. ఆ సమయంలోనే దాశరథి, డా॥నారాయణరెడ్డి, పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీ కవితా పఠనాలూ, ఉపన్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేసి లండన్ లోని తెలుగువారికి వీనులవిందులు చేసేవారు. ఇంకా బాపు చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీరగంధం దాసు చేత రుక్మిణీ కల్యాణ హరికథా కాలక్షేపాన్ని గూడా అందించి లండన్‌లోని తెలుగువారికి తమ సంస్కృతీ, సాహిత్య వైభవ, సౌరభాలను వారు ఎదల నిండా నింపుకునేందుకు దోహదపడ్డారు. విదేశాంధ్ర ప్రచురణ సంస్థను స్థాపించి ఎంతో ఉదాత్తమైన సాహిత్యాన్ని ప్రచురింపజేసి ప్రపంచానికి అందించారు. పురిపండా అప్పలస్వామి "పులిపంజా"ను ప్రచురించారు. ఎంతోమంది అభిమానుల్ని సంపాదించుకున్న

శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలంటే గూటాల కృష్ణమూర్తిగారికి మదినిండా పులకరింతేలే. ఆ మహా ప్రస్థాన కవితల్ని ఫాక్స్‌మిల్ ఎడిషన్‌గా తీసుకొచ్చారు. శ్రీశ్రీ గారి దస్తూరీతో, బాపూగారి బొమ్మలతో, మంచి ఆర్ట్ పేపరు మీద అచ్చు వేయించారు. పుస్తకం వ్రాత ప్రతిని లండన్‌లోనే తయారు చేయించి, కవితాపఠనం రికార్డింగ్ అక్కడే చేయించారు. వీటికోసం, పురిపండాగారినీ, శ్రీశ్రీ దంపతులనూ లండన్ పిలిపించి కొన్ని నెలలపాటు ఆతిథ్యమిచ్చి ఈ పనులన్నీ పూర్తి చేశారు. మహాప్రస్థానం కవితల్ని శ్రీశ్రీ గారిచేతే, చదివించి, రికార్డ్ చేసి ఆడియో క్యాసెట్లు తయారు చేయించారు. మహా ప్రస్థానం ఫాక్స్‌మిల్ ఎడిషన్ లండన్‌లో రాణిగారి చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ పుస్తకం ఇండియాలో నవంబరు 2007లో విడుదలైతే 2008 ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌లో విడుదలయ్యింది. టంగుటూరి సూర్యకుమారిగారు యూ.కె.లో వుంటూ “ఇండియా ఫెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్” అనే సంస్థను స్థాపించి యువతరానికి ట్రెయినింగ్ ఇచ్చేవారు. “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” పాట పాడిన గాయనిగా ఆంధ్రులందరికీ ఆమె అభిమానపాత్రురాలు. అలాంటి సూర్యకుమారిగారంటే గూటాలగారికీ చెప్పలేనంత అభిమానం. 2008వ సం॥లోనే సూర్యకుమారి గారిపై మూడు సంపుటాలు వెలువరించారు. ఇవి చాలా పెద్ద సైజులు రెండువందల ఎనభై పేజీలలో వందల కొలదీ ఛాయా చిత్రాలతోను, డాక్యుమెంట్లతోను నిండివున్న బృహత్తర రచనగా పేరుగాంచింది. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ వున్న రచన కోసం రష్యన్ పెయింటర్ **Lud milla Prima koff** చేత బాపూగారి చేతనూ రెండు సూర్యకుమారిగారి బొమ్మలు గీయించి మరీ ముద్రించారట. అదీ తన తెలుగు ప్రముఖవ్యక్తుల పట్ల కృష్ణమూర్తిగారికున్న అభిమానం, ఆరాధనాను. ఇంకా వారు ఎంతోమంది ప్రముఖులకూ, స్నేహితులకూ లేఖల రూపంగా ఎంతో అభిమానాన్ని పంచారు. లండన్‌లో తెలుగు, ఇంగ్లీషు లిటరరీ యాక్టివిటీస్‌ను ఎంతో ఖర్చుపెట్టి ఏర్పాటు చేసారు. **The Francis Thompson society** ని స్థాపించారు. **The hound of heaven makers of the nineties series** కు ఎడిటర్‌గా వ్యవహరించారు. సాహిత్యం మీద అపార జ్ఞానం కలిగి వున్నందున వారితో మాట్లాడటమంటే ఒక గ్రంథాలయంలో వున్నట్లే అని భావించేవారట. ఎదుటి వారి మనస్సులను ఆకట్టుకునేటట్లుగా మాట్లాడటం, లండన్ వెళ్లిన సాహిత్యాభిమానులందరికీ ఆతిథ్యమివ్వటం ఆయనకే స్వంతం వృత్తిరీత్యా ఇంగ్లీషు ప్రొఫెసర్ అయినా ప్రవృత్తి రీత్యా సాహిత్యాభిమాని, మంచి రచయిత గూడా. చిన్న వయసు నుండే కథలు వ్రాయటం ప్రారంభించారు. వాటిలో చీడపురుగు, పిల్లితో చెలగాట, అస్థిపంజరం, అక్కపాప, క్వీన్ ఆఫ్ బోహిమియా, పిల్లల్లారా ! మీరేమంటారు? శ్రీమాన్ సర్వజ్ఞారావు లాంటివి, 1953 నుంచి 1981 మధ్యకాలంలో ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రికలలో ప్రచురింపబడినవి. చాలా కథలు బహుమతులకూ ఎంపికైనవే. వీరు జుబ్బా లేని అబ్బాయి” అనే పేరుతో పెద్ద నవల వ్రాయాలని సంకల్పించారు. మనదేశంలోని సామాజిక జీవన అసమతుల్యతలు, దోపిడీవ్యవస్థ, మొదలగువాటిని ప్రతిబింబిస్తూ రచన కావించాలని ఆకాంక్షించారు. అది కొంతవరకే పూర్తయిందని చెప్తున్నారు. రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి పట్ల తన ఇష్టాన్ని ప్రకటిస్తూ రాచకొండ అంటే ఎవరెస్ట్ శిఖరమే కదా అని ప్రశంసించేవారు. ఇండియా వచ్చినా కూడా ఏ సాహిత్య కార్యక్రమాన్నీ విడిచిపెట్టేవారు కాదు. వై రాంబాబు & సాయిగారలు వ్రాసిన ‘సొతంత్రం చిగురేసింది’ అనే కథాసంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని 15.8.1985లో విశాఖపట్నంలో తన అధ్యక్షతలో అత్యంత వైభవంగా నడిపించారు. ప్రియమిత్రులు బాపును చూడటానికి పెద్ద వయసులో లండన్ నుంచి కుటుంబంతో ఇండియా ఇచ్చిన ఆత్మీయులు శ్రీ గూటాల.

> ***శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలంటే గూటాల కృష్ణమూర్తిగారికి మదినిండా పులకరింతేలే. ఆ మహా ప్రస్థాన కవితల్ని ఫాక్స్‌మిల్ ఎడిషన్‌గా తీసుకొచ్చారు.***

శ్రీ గూటాల కృష్ణమూరి తెలుగు భాషకే కాక ఆంగ్ల భాషకూ ఎనలేని సేవలు చేశారు. ప్రసిద్ధమైన గ్విన్ ఆంగ్ల–తెలుగు నిఘంటువును ప్రజలకు చేరవేసిన ఘనత వీరిదే. పురాతన ఆంగ్ల సాహిత్యాన్ని సేకరించి ఇంగ్లీషు వారికే అందించిన సారస్వత ప్రేమికులు. ఇంగ్లీషులోనూ పెక్కు రచనలు కావించి ప్రచురించారు. భజగోవిందం, కుకునం, క్లినసం, స్లిపనం అంటూ వంట చేయటం, పాత్రలు శుభ్రం చేయటం, కాపురం చేయటం వంటి విషయాల పైనా రచనలు చేసారని తెలుస్తున్నది.

భేషజం లేని వ్యక్తిగా స్వచ్ఛమైన అంతరంగం కలిగి వుండేవారని వారి పరిచయస్తులందరూ మెచ్చుకునేవారు. మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవటం ఆయనకు చాలాప్రీతిపాత్రమైన విషయం. ప్రతి ఆదివారం ఓగంటసేపు

## కవిత

# అట్రాసిటీ

- శ్రీరాం పుప్పాల
9963482597

చెప్పులుకుట్టేవాడి చేతుల్లో
మైనం పూసిన దారాన్ని
దొరకబుచ్చుకున్న ఆరె మొన

సనాతన మందపాటి చర్మానికి
ఇంకా తన సంపదనీ గౌరవాన్నీ
కలగలిపి కుట్లు వేస్తూనే ఉంది

ఊబకాయ దేశం కాళ్ళనెత్తికి కిరీటం పెట్టాలని
ముళ్ళ తివాచీ మీద తపస్సుక్కూర్చుని
ఒక ముని ఎండకాస్తున్న రోడ్లకి
అనాదిగా చెప్పులు తొడుగుతూనే ఉన్నాడు

ఇప్పుడింకా అసమానతల దారి పొడవునా సొంత
నడకలు తెగ్గోసుకున్న పాదముద్రలే కనిపిస్తున్నాయి



కుప్పలెత్తే వాడి నూనె రాసుకున్న దేహం
నిలువెల్లా చీలికలైన వెదురు బద్దలా మారి
అశుద్ధ మేకిన్ ఇండియా గుంతలోకి దూరి
పవిత్ర గంగా నదుల్లా ప్రవచిస్తున్న శరీరాల్ని
మూలమూలనుంచీ శుభ్రం చేస్తూనే ఉంది

అసలేవాసనా లేని సమాజం ఆత్మకి
సుగంధం పూయాలని
ఒక దేవమూర్తి మురికి కూపంలో మునిగి
అనాదిగా పాకీ పనికి
పుష్కర స్నానం చేయిస్తూనే ఉన్నాడు.

ఇప్పుడింకా సిగ్గుపడని నాగరికతల వేలి చివర్న
కళ్ళూ చెవీ ముక్కుల్నీ మూసేసిన దుర్గంధమే
గుబాళిస్తోంది

♦

విముక్త బాకాలూత్తున్న దేశ చరిత్రలో
ఒక జీవన రూపం మీద
నిర్లజ్జగా జరుగుతున్న విధ్వంసమే కనిపిస్తుంది

మట్టినీ చెట్టును విడదీస్తున్నట్టు
రాజ్యాంగాన్ని నీడలేకుండా నిలబెట్టినట్టు
అరగని అగ్ర కుల మలమెత్తిన
మెత్తటి చేతులనొక పక్క
అరిగిన చెప్పుల్తో సహా కాలి బూడిదైన
కాంక్షల కాళ్ళనొకపక్క
పదిలంగా వర్గీకరించి పాతిపెట్టినట్టు

అంటరానితనం కన్నీళ్ళింకిన భూమిలో
తవ్వినకొద్దీ అడుగడుక్కీ
నిద్రాణ భోధి విత్తనాల్లో
ఆత్మగౌరవ కళేబరాలు బయల్పడుతున్నాయి

♦

ఇప్పుడోసారన్నా గుళ్ళో దేవుణ్ణి తాకితే బావుణ్ణు
ఇప్పటికైనా వెట్టివాడొకడు రాజైతే బావుణ్ణు.

---

తన రాట్నం మీద దారం వడికేవారు. ఆగస్టు 15, అక్టోబరు 2, జనవరి 30 తేదీలలో ఉదయం, పది గంటల నుండి సాయంత్రం ఐదుగంటల వరకూ అఖండ సూత్రయజ్ఞం చేసేవారు. వాతావరణం అనుకూలంగా వుంటే 'టాలీస్టాక్ స్క్వేరు"లోని గాంధీజీ విగ్రహం ముందో, లేదా తన ఇంట్లోనే ఈ సూత్రయజ్ఞాన్ని కావిస్తానని వారే స్వయంగా తెలియజేశారు. ప్రపంచ ప్రసిద్ధ పత్రికలవారు వారితో ఇంటర్వ్యూలు తీసుకున్నారు. వారి సాహిత్య కృషిని అభినందిస్తూ ఎన్నో వ్యాసాలను ప్రచురించారు. మన ప్రాంతంలో కూడా ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మొదలగు పత్రికలలో వీరిని గురించి విరివిగా వ్రాసేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోనూ వీరి విషయాలు వ్రాసేవారు.

కుటుంబపరంగా వీరు నిండైన జీవితమే గడిపారు. భార్య శ్రీమతి రమణవరం గారు, ప్రిన్స్‌పాల్‌గా రిటైరయ్యారు. కొడుకులిద్దరూ అమెరికాలో సెటిలయ్యారు. అమ్మాయి, అల్లుడూ ముంబైలో నివాసముంటున్నారు. చివరిదశలోని విశాఖపట్నం తిరిగి వచ్చారు. శ్రీ గూటాల కృష్ణమూర్తి 13.7.2016న పరమపదించారు. వీరి మరణం అటు లండన్, ఇటు తెలుగుప్రాంత సాహితీవేత్తలకు, సాహిత్యరంగానికి తీరని లోటుగా భావించవచ్చు.

# అతీతమైన వేళ

- బొడ్డపాటి చంద్రశేఖర్
9951131566



మనసు పొత్తంలోని
జ్ఞాపకాల పేజీలను తిప్పుతున్నా

అక్షరాలలో ఘనీభవించిన
అనంతమైన అనుభూతులెన్నో

నా ఆలోచనా మలయమారుతానికవి ద్రవించి
దృశ్యాల వర్షపు జల్లులయ్యాయి

మనసు ఆనందపు గిరికీలు కొట్టిన క్షణం
అవి ఝరీపాతమే

కుంగుబాటుకు మనసు తుత్తునియలైనప్పుడు
గట్లు తెంచుకుని ఒడ్డున కురిసే వరదది

భావోద్వేగాల కతీతమై
మనస్సు స్థితప్రజ్ఞయైన వేళ
అది ఝరీపాతమైనా,
తొలకరైనా
స్వాగతమే

# ప్రజా గజళ్ళు

- చింతాడ రామారావు
9866087709



జీవజాలమంతటికి ఆలవాలమైన నేల ధనదాహదాడులతో నిర్జీవం ఔతున్నది
మేధస్సును మేళవించు ఉత్పాదక జనవనరులు మూఢ నమ్మకాల భ్రమతో నిర్వీర్యం ఔతున్నది

నాగళ్ళు కొడవళ్ళు సుత్తులు సమ్మెటలు నగరాల శివార్లలో గుడిసెలలో చేరుకున్నవి
కుమ్మరి కమ్మరి సకల పల్లెవృత్తులు కొనసాగలేక కాలంలో నిక్షిప్తం ఔతున్నవి

కలిమితో కలిమిగూడి లేమిచెంత లేమిచేరి కలవలేని ధృవములుగా మనుషులను విడదీసి
ధనస్వామ్యం వాకిట్లో జనస్వామ్యం బంధీయై సమన్యాయ పాలనలో వైఫల్యం చెందుచున్నది


నాయకుల విగ్రహాలు పార్టీలజెండాలు బ్యానర్లు ఫెక్సీలు జనరద్దీ కూడళ్ళలో విరివిగా వెలిసి
ఏ నేరం పాలెరుగని సామాన్యుని జీవనం గతి తప్పిన గమనంతో కకావికలమౌతున్నది

బానిసత్వ భావఝరిని విడనాడక పాలకులు వారసత్వ రాజనీతి ప్రజల ఒంట పట్టించిరి
అల్పశాతం ఓట్లతో అధికారం పొందగల్గు విధానంలో సంస్కరణలు అనివార్యం ఔతున్నవి.

పేదరికం నిర్మూలన పథకాల ప్రకటనలు నాయకులను కీర్తించే నగారాగమారి 'సిరా'
వేలకోట్ల ప్రజాధనం మధ్యలోనే మాయమై నిరుపేదల బతుకుల్లో నిప్పుకణం ఔతున్నవి.

## నచ్చిన రచన

# ఇప్పుడిప్పుడే రేకులు విప్పుతున్న పువ్వు




- కమలకుమారి
9949831146

ఇప్పుడిప్పుడే రేకులు విప్పడంలోని పనిదనం, అ పరిమళంలో పసితనపు కసరుదనం కనిపిస్తున్నా, స్నిగ్ధ పరిమళాన్ని నింపుకొని సంపూర్ణంగా వికసించడానికి కావలసిన హంగులన్నీ నావద్ద ఉన్నాయని దృఢంగా చెప్తూంది శ్రీశేయ తన కవిత్వంతో.

అందమైన శీర్షిక, అంతకన్నా అందమైన ముఖచిత్రంతో మన ముందుకొచ్చిన ఈ చిన్ని పుస్తకం ఓ చిన్నారి కవయిత్రి సృష్టి.

ఈమె తన ఐదవ ఏట మొదలుపెట్టి గత పదీ, పందకొండేళ్ళుగా సాహితీ ప్రపంచంతో సావాసం చేస్తుంది. ఈ మధ్యకాలంలో (తన 6వ ఏట నుంచి16వ ఏట వరకు) ఆమె రాసిన 32 కవితల సమాహారం ఈ పుస్తకం.

ముందుగా అభినందించవలసినది ఈ తరం బాలిక తన భావప్రకటనకు మాధ్యమంగా కవిత్వాన్ని ఎన్నుకోవడం. రెండోది ఆమె ఆశావహ దృక్పథం. అందుకే ఆమె 'కష్టాలను సముద్రంలా కాకుండా.. నీటిబొట్టులా చూడాలని చెప్తుంది. ఓటమి నుంచి వచ్చిన గెలుపు ... ఎప్పటికీ నిలుస్తుందని' నమ్మకంగా చెప్తుంది.

ఒక్కమాట 'ప్రోత్సాహం' చావబోయే వారికి ఊపిరియ్యగలదని, ఒక్క 'చిరునవ్వు'తో ప్రపంచాన్ని మనవైపు తిప్పుకోగలమనీ శ్రీశ్రేయ దృఢంగా చెప్తుంటే కాదని ఎలా అనగలం!

'ఎందుకు'లో, 'నాకర్థం కాలేదు' లో 'అమాయకపు కళ్ళలో ఈ ప్రపంచంలో మనుషుల కెందుకు ఈ స్వార్థపరత్వం, ఈ కలిసి బ్రతకలేని తనం!' అని ఆశ్చర్యంతో ప్రశ్నించిన బాలిక '

'సపోటా పిక్కల్లో ఈనాటి మానవసంబంధాల్లోని డొల్లతనాన్ని గట్టిగానే నిరసిస్తుంది.

తన ఇల్లు, ఇంటి ముంగిటి పూల మొక్క తన లాలనలోని మూగప్రాణికి తల్లి, తండ్రి, గురువు, మిత్రులు, రైల్లో నీళ్ళ సీసాలమ్మే కుర్రాడూ, బిచ్చగాళ్ళు, అనాధలూ, వృద్ధులూ తన చిన్న ప్రపంచంలో తనకి తెలిసిన, తాను చూసిన పాత్రలన్నీ ఆమెకు కవితా వస్తువులే.

ఆమె 'రహదారి' గుండె చప్పుడు వినగలదు.
పూలమాల కన్నీళ్ళకు అర్థం వెతకగలదు
పండగలూ పర్వదినాలూ మనుషులని కలపడం కోసం
మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉండాలని ఆహ్వానించగలదు
ఆ పండగ వాతావరణాన్ని ఆధునికీకరణలో
యాంత్రికంగా మారుస్తున్న మన పోకడలను
యెద్దేవా చెయ్యగలదు

డైరీ



# అరుంధతీయుడు

- ఈ. రాఘవేంద్ర
94940 74022

తానొక
నిర్మాణం చేపట్టాడు
తన ధర్మజలాన్ని పోగులుగా జేసి
సమాజ పాదాలు కందకుండగా
పద్మాల ముద్రికలను సిద్ధం చేస్తున్నాడు

తెగిన సంబంధాలకు పునరుజ్జీవనం పోస్తూ
అనుబంధాల జోడు ముద్రలను కలుపుతూ
పాతబడిపోయిన ఆప్యాయతకు
ఊపిరిలూదుతున్నాడు

ఎన్ని సూదిపోట్లు
తన గుండెకు గుచ్చుకున్నా
నింగికెగిరే మతాబులా
తెల్లగా నవ్వుతుంటాడు

ప్రభుత్వ కార్యాలయ ప్రహరీ గోడలను
ఆధారం చేసుకున్న అతను
గోడపై రాసిన
ఒక నినాదంగా కనిపిస్తుంటాడు

ఆ నాలుగు రోడ్ల కూడలిలో
ఎందరో వస్తూ పోతూ వుంటారు

రెండు సంధ్యల మధ్య కాలమంతా
దీక్షకు దిగిన మునిలా
అతనొక్కడే
ఎప్పుడూ
అక్కడే
దర్శనమిస్తుంటాడు

తాను సమాజ ప్రేమికుడు
పిడికెడు ఆత్మగౌరవం కలిగిన వాడు
తన చుట్టూ గిరి గీయకండి
హద్దులు అంతకన్నా రాయకండి

---

మనుషులూ జంతువులూ డబ్బు జబ్బుకు
లోనవడాన్ని ఎత్తిపొడవ గలదు.

'ఎంత బాగుంటుందో' అని చిన్న పిల్లల నిష్కల్మషపు ఆలోచనల్ని ముద్దు ముద్దుగా రాస్తూనే కొన్ని కొన్ని కవితల్లో తన ఆలోచనల్లోని చురుకునీ, తన వాక్యాలు అంత కంతకీ పదునెక్కుతూ ఉండడాన్ని ప్రదర్శిస్తుంది.

'నా కథ'లో మనం చేసే పుణ్య కార్యాలలోని పుణ్యమెంత? అని నిలదీస్తూ భక్తులకు భగవంతుడు తప్ప అన్నార్తులు కనబడరా' అని నిర్భయంగా అంటుంది.

చెత్తకుప్ప పాలైన ఆడశిశువు ఆక్రోశాన్ని హృదయం ద్రవించేలా వర్ణిస్తూనే అలా చేయవలసి వచ్చిన ఆ తల్లి దౌర్భాగ్యాన్ని గుర్తించడంతో పాటు

'నీ మీద నాకు కోపం లేదమ్మా'

మళ్ళీ నీ కడుపులోనే ఆడపిల్లగానే పుడతా

అప్పుడైనా కాలాన్ని మనం తిరిగి రాద్దామమ్మా

తిరగరాద్దాం' అనడం ఆమె ఆలోచనల్లోని పరిణితికి ఉదాహరణ.

'నీ రెప్పపాటు నిర్లక్ష్యం

మన రెప రెప లాడే జెండాను గాయపరచ వచ్చు'

అని రాసిన అమ్మాయి చిన్న చిన్న వాక్యాల్లో గొప్ప గొప్ప భావాల్ని పదునుగా రాయగలనని నిరూపిస్తుంది కొన్ని కవితల్లో. వాటిలో ముఖ్యమైంది 'ఇది నిజం'

'మానవుడు తలిచాడా, సాధ్యం కానిదేదీ లేదు

అవును!

మానవుడిప్పుడు గొప్ప కార్యం చేపట్టాడు


సూర్యుని కంటే భూమిని వేడిగా

తయారుచేసే పనిలో నిమగ్నమై ఉన్నాడు' చాలా పదునైన చమత్కారం. సాటి మనుషుల పట్ల ప్రేమ, సమాజం గురించిన అవగాహన, చూస్తున్న ప్రపంచాన్ని గురించిన పరిశీలన, అవసరమైన చోట్ల ఆత్మ విమర్శ. మంచి కవి లేదా కవయిత్రి కావడానికి కావలసిన అర్హతలైతే వాటికి కావలసిన బీజాలన్నీ తనలో ఉన్నాయని నిరూపించుకునే ప్రయత్నమే కుమారి శ్రీశ్రేయ కవిత్వం. అభినందనీయం.

కథ

# ఆమె గళమెత్తింది!

- నల్లపాటి సురేంద్ర
9490792553



పోలీస్ జీప్ రయ్యిమని దూసుకువచ్చింది ఆ వీధిలోకి

"ఇక్కడ శ్రీవాణి ఇల్లు ఎక్కడ.." అంటూ పోలీసులు అక్కడి వీధిలో వాళ్లని వాకబు చేయసాగారు. కొందరు కంగారు పడి ఆ కనిపిస్తున్న ఇల్లేనండి అని చెప్పారు.

వెంటనే కమిషనర్, ఎస్సై, ఇద్దరు లేడీ కానిస్టేబుళ్లతో ఆ ఇంటికి చేరుకున్నారు. శ్రీవాణి వాళ్ల ఇంటికి పోలీసులు వచ్చారన్న సంగతి ఆ వీధిలో వాళ్లందరికీ తెలిసింది.

ఒక్కొక్కరూ ఒక్కో విధంగా మాట్లాడుకుంటూ, మెల్లగా ఏమి జరుగుతుందో చూద్దామన్నట్లు... ఆ ఇంటి ముందు గుమిగూడారు.

శ్రీవాణి తండ్రి పోలీస్‌లను చూడగానే కంగారుపడ్డాడు. "ఇదేంటి మా ఇంటికి పోలీసులు వచ్చారు" అని అనుకుంటూ వరండాలోకి రాబోతుంటే... పోలీసులే సరాసరి ఇంటి లోపలికి వచ్చేసారు. "శ్రీవాణి వుందా" అంటూ కోపంగా అడిగాడు కమిషనర్

"తన రూమ్‌లో చదువుకుంటుంది సర్"

"చదివింది చాలు గాని... మీ అమ్మాయిని పిలవండి...."

చాలా భయం వేసింది వెంకట్రావుకి. అనుకోని ఈ పరిణామానికి ముచ్చెమటలు పట్టాయి.

"శ్రీ వాణి ఒకసారి ఇలా రా"

"సరే నాన్న..." లోపలి నుండే బదులిచ్చింది ఆ అమ్మాయి.

వంటింట్లో వంట చేస్తున్న లక్ష్మికి హాల్లో పోలీస్‌లను చూస్తుంటే కాళ్లూ... చేతులూ ఆడడం లేదు.

"సర్.. ఏమయింది?" వణుకుతూనే ప్రశ్నించింది.

"మీ అమ్మాయికి చదువు ఎక్కువైంది... అందుకే స్టేషన్‌కి తీసుకెళ్దామని..."

శ్రీవాణి తల్లిదండ్రులకు అక్కడ అసలు ఏం జరుగుతుందో ఏమి అర్థం కావడం లేదు.

మరలా అడుగుదాం అనుకున్నా... భయంతో తటపటాయించారు...

ఏదో చదువుకుంటూ... నవ్వుతూ హాల్‌లోకి వచ్చిన శ్రీవాణి పోలీస్‌లను చూడగానే హతాశురాలైంది.

"నీ పేరే కదా శ్రీవాణి... నీ మీద ఎంక్వయిరీ ఫైల్ అయ్యింది. నీ నుంచి సేకరించాల్సిన సమాచారం కొంత ఉంది. నువ్వు కమీషనరేట్‌కు ఓసారి రావాలి"


కమీషనర్ అంత కరకుగా ఎందుకు మాట్లాడుతున్నాడో, ఆ కాలేజీ విద్యార్థినికి ఏమీ అర్థం కావడం లేదు

ఓసారి తల్లిదండ్రుల వైపు దీనంగా చూసింది

"సర్... మా అమ్మాయి ఏ తప్పు చేసింది..." మొదట

అడగకూడదనుకున్నా, ధైర్యం చేసి అడిగాడు శ్రీవాణి తండ్రి వెంకట్రావు.

"ఈ సోషల్ మీడియా పుణ్యమా అని... ఈ మధ్య నీ కూతురు లాంటోళ్లు బాగానే రెచ్చిపోతున్నారు. ఒక రోజుతోటే పాపులరై యూత్ లీడర్ అయిపోవాలనుకుంటుందా నీ కూతురు.... కాలేజీకి వెళ్లి శుభ్రంగా చదువుకోక... ఇలాంటి వేషాలు వేయడం అవసరమా... ఈ పిల్ల ఏమైనా మామూలు పని చేసిందా... ఇటీవలే మరణించిన ఓ రాష్ట్ర క్యాబినెట్ మంత్రికి వ్యతిరేకంగా ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో ఓ పోస్టు పెట్టింది. అదే పోస్టులో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఆ మంత్రి అనుయాయులు ఈ అమ్మాయి చేసిన వాఖ్యలు అతివాద ధోరణిలో ఉన్నాయని.... నక్సలిజాన్ని సమర్థించే విధంగా ఉన్నాయని ఎంక్వయిరీ వేయమని... కంప్లైంట్ ఇచ్చారు. ఇక మీరు ఏమి చెప్పాలన్నా... ఎంక్వయిరీ పూర్తయ్యాక స్టేషన్ కొచ్చి చెప్పుకోండి" అంటూ సూటిగా చెప్పాడు కమీషనరు.



లేడీ కానిస్టేబుల్స్ శ్రీవాణి చేయి పట్టుకొని నడిపించుకుంటూ...ఇంటి బయటికి తీసుకొచ్చి జీపు ఎక్కించారు.

శ్రీవాణి తనలో తాను ఆలోచించడం మొదలుపెట్టింది.

ఒక వారం రోజుల క్రితం క్యాబినెట్ మంత్రిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి హత్య చేయబడ్డారు. అతను ఇదివరకే ఉప ముఖ్యమంత్రిగా ఓ సారి, కేంద్రమంత్రిగా రెండుసార్లు, రాష్ట్రమంత్రిగా మూడు సార్లు పని చేసారు. నిజమే ఓ గొప్ప రాజకీయవేత్త చనిపోవడం రాష్ట్రానికి లోటే.... కానీ ఆ నిర్యాణ కార్యక్రమం చాలా హుందాగా జరగాలి. కానీ మంత్రి వర్గీయులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. రోడ్లు నిండా ఎక్కడ చూసినా బ్యానర్‌లు, కటౌట్లు. పైగా వాహనాలు వెళ్లకుండా రహదారులన్నీ బ్లాక్ చేసేశారు... కనీసం కదలాలంటే కూడా చాలా భయం.. ఎవరినీ మెయిన్ రోడ్డు మీదకి వెళ్లనివ్వడం లేదు. మంత్రి చనిపోయినందుకు సంతాపం ప్రకటించాలని సూచిస్తూ... ఒకటే స్లోగన్లు.... దాంతో పాటు మంత్రి చనిపోవడానికి గల కారణం మీద సీబీఐ ఎంక్వయిరీ వేయించాలని కోరుతూ, అప్పటికప్పుడే బంద్ ప్రకటించారు.

ఈ పరిస్థితి చూసి శ్రీవాణి స్నేహితురాలు ఒకటే ఏడుపు. ఆ రోజే తనకు జిల్లా కేంద్రంలో బ్యాంకింగ్ ఎగ్జామ్‌కు సంబంధించిన ఫైనల్ ఇంటర్వ్యూ ఇప్పటికి అయిదు సార్లు ఎంట్రన్స్ రాస్తే రెండు సార్లే ఇంటర్వ్యూ వరకూ వచ్చింది. ఇది మూడోసారి. చాలా టెన్షన్‌గా ఉంది. అనుకున్న సమయానికి చేరుకోలేక పోతే తను ఒక అవకాశాన్ని వదిలేసుకున్నట్లే.... ఏ ఆటోవాడిని, ట్యాక్సీ వాడిని అడిగినా... ఎక్కడ అద్దాలు పగలకొడతారేమోనని... బండి తీయడానికి ఎవరూ ఒప్పుకోవడం లేదు. వారికేం చేయాలో అర్థం కావడం లేదు. చివరికి చేసేదేం లేక, వెనక్కి వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నారు.

కానీ శ్రీవాణి ఈ విషయాన్ని అంత తేలికగా వదిలేయలేదు. ఓసారి చుట్టూ జరుగుతున్న సంగతిని పరికించి చూసింది.

ఆ మంత్రి అనుయాయులు చేస్తున్న తప్పు సామాన్యమైంది కాదు. వాళ్లు కనీసం ఎవరినీ అడుగు కూడా ముందుకేయనివ్వకుండా ట్రాఫిక్ నిలిపివేయడంతో ఎందరో విద్యార్థులు, ఆఫీసుకి వెళ్తున్న ఉద్యోగులు, చిరు వ్యాపారులు, దినసరి వేతగాళ్లు... అంతకు మించి రెక్కాడితే గానీ డొక్కాడని కూలీజనం.... అందరూ ఏం మాట్లాడకుండా వెనుదిరిగిపోసాగారు. అంబులెన్సులతో పాటు ఎన్నో వాహనాలు ఆగిపోయాయి. అయినా ఆ కిరాయి తొత్తులు కనికరించలేదు.

అందుకే అక్కడ జరుగుతున్న సంఘటనలను ఘాటుగా విమర్శిస్తూ "ఎవరికి ఉపయోగం" అని టైటిల్ పెట్టి ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో ఓ పోస్టు పెట్టింది. దాని సారాంశం ఇది.


"ఓ మనిషి చనిపోవడం బాధాకరం... కానీ నాయకుడిగా పేరొందిన ఆ వ్యక్తి వర్గీయులు చేస్తున్న హడావుడి మాత్రం ఉపయోగం లేనిది...అతని ఇంటి నుండి శ్మశానానికి ఉండే దూరం రెండు కిలోమీటర్లే...కానీ మెయిన్‌రోడ్‌ని బ్లాక్ చేసి...హైవేలో ప్రదర్శన చేయడమే కాకుండా సడెన్‌గా బంద్ ప్రకటించడం వల్ల సామాన్య జనానికి ఎంత ఇబ్బందో కనీసం ఆలోచించారా...ఏదో యాత్రను హైలైట్ చేయాలని తప్ప ప్రజల ఆలోచనలతో వీరికి అసలు పనే లేదు".

"ఈ మధ్యకాలంలో దేశంలో నిజంగానే అసహనం పెరిగిపోతోంది. అసలు ఈ నాయకులు జనాలకు ఒరగబెట్టేదేమిటో నాకు అసలు అర్థం కాదు. అసలు చెప్పాలంటే ఆ చనిపోయిన మంత్రి గారిది మాత్రం ఘనమైన చరిత్రా...ఎన్నిసార్లు తనపై అవినీతి ఆరోపణలు రాలేదు...అతని పేరిట స్విస్ బ్యాంకులో మూలుగుతున్న డబ్బు గురించి ఎన్ని వార్తలు పేపర్లో ప్రచురితమవలేదు. గిరిజన భూములను

లాక్కోవడం...దళారీగా ఉంటూ బడా కంపెనీలకు వాటిని కట్టపెట్టడం. ఇది మాత్రం ఎవరికీ తెలియని భాగోతమా...అలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ రాజకీయ చీడపురుగును ఎవరో హత్య చేస్తే...వాళ్ల వర్గీయులెవరో రోడ్డు మీద పడి జనాలను క్షోభపెట్టడం ముమ్మాటికీ అన్యాయమే...ప్రజాస్వామ్యానికి మాయని మచ్చే....ఆ మహానుభావుడు ఎలాగో చనిపోయాడు. కానీ ఆయన తొత్తులు సడెన్‌గా బంద్ ప్రకటించడం వల్ల...ఈ రోజు ఒక అంబులెన్సు వెళ్లే దారి లేక పోయింది...నా కళ్లు ఎప్పుడు చెమర్చాయంటే ఆ జరిగిన బంద్ వల్ల...ఓ అభాగ్యురాలికి రోడ్డు మీద ప్రసవం జరిగింది. ఆమెకు పుట్టిన బిడ్డ కూడా చనిపోయాడు...ఆ పాపం తగిలి ఆ మంత్రి గారి ఆత్మ శాంతిస్తుందా...లేక నరకానికి తరలిపోతుందో నాకు తెలియదు. ఇదే బంద్ వల్ల నా స్నేహితురాలు కూడా తనకు రావాల్సిన ఉద్యోగం కోల్పోయింది.

ఇవే స్టేట్‌మెంట్స్ సోషల్ మీడియాలో రాస్తూ....ఆ బంద్ సమయంలో అక్కడ జరిగిన సంఘటనలను తన సెల్ కెమెరాతో ఫోటోస్ తీసి పెట్టింది. అంతే ఒక రోజు గడిచిందో లేదో...వేల మంది స్పందించారు. పాలకుల మీద రకరకాలుగా అసహనాన్ని, అసహ్యాన్ని వ్యక్తం చేసారు. అయితే అదే పోస్టు శ్రీవాణి తన మెడకు చుట్టుకుంటుందని భావించలేదు. తను పోలీసు ఎంక్వయిరీల గురించి ఇది వరకే చాలా వార్తలు విని ఉంది. ఇప్పుడు ఎవరో ఆ పోస్టు చూశాకా, ఆ మంత్రి హత్య చేయబడ్డాడు కాబట్టి...ఈ అమ్మాయికి ఏమైనా దాంతో సంబంధముందా...పైగా ఆ అమ్మాయి మాటలు అతివాదులు, విప్లవకారులు మాట్లాడే విధంగా ఉన్నాయి కాబట్టి నిఘా పెట్టాల్సిందే..ఎంక్వయిరీ చేసి నిజనిజాలు ఏమిటో తెలుసుకోవాల్సిందే...అని గవర్నరు స్థాయిలో ప్రభుత్వం మీద, పోలీసు కమీషనరు మీదా ఒత్తిడి తీసుకురావడంతో, పోలీసులు శ్రీవాణిని స్టేషన్‌కు తీసుకురావడం తప్పలేదు.

అయితే శ్రీవాణి పోలీసు స్టేషన్‌కి చేరుకొనేసరికే అక్కడ చాలా మంది తనతో చదువుకుంటున్న విద్యార్థులు, తన శ్రేయోభిలాషులు కనిపించారు. కొందరు మీడియా మిత్రులు జరుగుతున్న విషయాన్ని లైవ్ టెలికాస్ట్ చేస్తున్నారు. వారందరూ తనకు సహాయం చేయడానికి వచ్చారని తెలుసుకొని శ్రీవాణి



ఆశ్చర్యపోయింది. తన పోస్టు చదివి ఒక న్యాయసలహా కేంద్రాన్ని నడుపుతున్న న్యాయవాది ఆమె పేరు మీద ముందస్తు బెయిల్ పెట్టించడానికి ముందుకొచ్చి, పేపర్లు రెడీ చేసి, శ్రీవాణి చేత సంతకం పెట్టించుకొని, కమీషనరుకు అందించాడు.

ఒక కాలేజీ విద్యార్థినికి ఇంత ఫాలోయింగా...అదీ కేవలం ఒక సోషల్ మీడియా పోస్టు వల్ల....

విస్తుపోవడం ఇప్పుడు పోలీసుల వంతైంది.

శ్రీవాణి మీడియా వారితో మాట్లాడుతూ "భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ నేరమా? ఒక దారుణాన్ని చూసి స్పందించడం నేరమా? నా ఉద్దేశంలో కానేకాదు. ప్రభుత్వాలు పనిచేస్తుంది ప్రజల కోసమే కదా.... మరి అవే ప్రభుత్వాలు సామాన్యులు బాధలు పడుతుంటే పట్టించుకోకపోవడం. నేరం కాదా...మరి ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వమే నేరం చేస్తున్నప్పుడు నేను ప్రశ్నించడం తప్పు అనిపించడం లేదు. అవి తప్పు అయితే ఈ రోజు నేను అడగకుండానే ఇంతమంది ప్రజలు నన్ను సమర్థిస్తూ నన్ను వెతుక్కుంటూ రారు. ఒక మంత్రి హత్య చేయబడ్డాడు. అందుకు కారణాలు ఏవైనా... పరిశీలించి నేరస్థులను పట్టుకోవడానికి సీబీఐలు, సీఐడీలు ఉన్నాయి. దానిని సాకుగా తీసుకొని...ఎప్పుడు సమయం దొరుకుతుందా...ఎప్పుడు బంద్‌లు, ధర్నాలు చేద్దామా...అని హింసా మార్గంలో వెళ్తుంటే...వారి మీద కేసులు బనాయించకుండా...ఏదో నా పోస్టు అతివాద ధోరణిలా ఉందని నా మీద బురద జల్లడం పాలకుల అవివేకానికి, దాష్టీకానికి పరాకాష్ఠ. వారి వల్లే కదా ఆ రోజు ఆ గర్భిణీ రోడ్డు మీద ప్రసవించింది....దానికి ఆ మంత్రికి పదవి కట్టబెట్టిన ప్రభుత్వం చెప్పేదేమిటి...మరి ఇలాంటి పనులను సమర్థించుకుంటూ...అర్ధనిమీలిత నేత్రాలతో చూసీ చూడనట్టు ప్రభుత్వం జనాల్ని అన్యాయం చేస్తూపోతుంటే...మరి అసహనం పెరిగిపోదూ...ఆ పోస్టు రాస్తున్నప్పుడు నాలోనూ అదే అసహనం ఉంది. నన్ను వెతుక్కుంటూ వచ్చిన జనాల్లోనూ అదే అసహనం కనిపిస్తోంది. ఇలా శ్రీవాణి చెబుతుంటే....

సోషల్ మీడియా ద్వారా ఆమె స్పీచ్‌ను ఎందరికో షేర్ చేయసాగారు. ఆమెకు మద్దతిస్తున్న యువతీయువకులు...ఈ సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత...

## కవిత

# భూతాల స్వర్గం

- సిరికి స్వామినాయుడు
94940 10330



మీ స్వర్గలోకపు రాచనగరి నిర్మాణానికి
మా దేహాల్ని తవ్విపోసుకుని మట్టినైతే యిచ్చాం గానీ....
మా స్మశానాలకైనా చారెడు నేల మిగులుద్దా ?
యింకిపోయిన మా కళ్లనదుల యిసుకమేటల్లో
చెలమదీసి కళశాలతో కన్నీళ్లనైతే యిచ్చాంగానీ....
మా శవాలనోట తులసితీర్థమయ్యేందుకైనా
తల్లి కృష్ణమ్మ బతికుంటుందా ?

బావ్....మీ దేవతల రాజధానిలో
మా పేదలకింత చోటుంటుందా ?
నిలువ నీడుంటుందా ?
మా యిల్లూ పొల్లూ  తోటలూ దొడ్లూ
పశులమందలూ పంటలరాశులూ
పచ్చనిఅందాల పల్లెసీమలుంటాయా?
వేకువలూ వెన్నెలదీపాలూ
సమస్త వృత్తుల సహజీవనాలూ
తరతరాల పండగలూ పబ్బాలుంటాయా?
యివేవీ లేకపోతే మీ రాజధాని మాకెందుకు బావ్ ?

పంటచేల్లో పందులు పడ్డట్టు
పెట్టుబడులతో మా పల్లెలమీద పడి
మా భూముల్ని గుంజుకున్నారు !
మా యింటి సస్యలక్ష్మిని సమాధిజేసి
మా బతుకుపచ్చని పల్లెల్ని కూల్చేసారు !
మీ హైవేల నిర్మాణాల కోసం
మా అరటితోటల్ని కూలగొడుతున్నపుడు
మా పత్తితోటలమీంచి
 బుల్డోజర్ లు నడచిపోతున్నపుడు
' తీరిపోయిందిరా రుణానుబంధం ' అంటూ
తల్లిభూదేవి గగ్గోలు పెడుతున్నట్టే ఉంది !
తరాలుగా యీ మట్టితో పెనవేసుకున్న
పేగుబంధమేదో తెగిపోతున్నట్టే ఉంది !
యిపుడు నా మట్టి వ్యాపారమయ్యింది !
శ్రీమంతుల పాదాల కింద చిక్కిపోయింది !

మా నవ్వుల్ని దొంగిలించి
మీ నగర దువ్వారాలకు నెలవంకల్నిచేసేరు !
మీ రాచనగరి బురుజులమీద
మా బతుకుల్ని శిధిల చిత్రాల్ని జేసేరు !
మా కళ్లకు గంతలుకట్టి కలల్ని వేలాడదీస్తున్నారు !
మా పేదల చితిమంటల్ని
ఆగర్భ సంపన్నులకు హారతి పడుతున్నారు!
మా కన్నీళ్లతో వాళ్ల పాదాలు కడుగుతున్నారు !
మీ రాచనగరి ముఖద్వారానికి
నాగలిని దిష్టిబొమ్మను జేసి వేలాడదీస్తున్నారు !

కానీ.....బావ్
రైతులేని రాజధాని మీకు భూతల స్వర్గమేమో గానీ....
మాకు మాత్రం భూతాల స్వర్గమే....!!

---

శ్రీవాణి పోస్టు...ఆమెపై ఎంక్వయిరీ...ప్రజల మద్దతు మొదలైన అంశాలను చర్చిస్తూ...ప్రభుత్వాల దాష్టీకాలపై ఎందరో మీడియా మిత్రులు, ఎన్జీఓలు, న్యాయవాదులు కలిసి నమోదు చేసిన పిటీషన్‌పై హైకోర్ట్ స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వం మీద నిప్పులు చెరిగింది. ప్రభుత్వాలు గాడి తప్పితే, పోలీసు యంత్రాంగం లా అండ్ ఆర్డరుని కంట్రోల్ చేయడంలో ఫెయిల్ అయితే...శ్రీవాణి వాళ్లు తమ భావాలను కరకుగా, కఠినంగానూ వెల్లడించడం సహజమేనని....నేటి యువతను తక్కువ అంచనా వేయద్దు అనడంతో టీవీలో ఆ వార్తను చూస్తున్న శ్రీవాణి మొహంపై ఆమె తల్లిదండ్రులకు చిరునవ్వు వెలుగుతూ కనిపించింది.

## తవ్వినకొద్దీ చరిత్ర - 7

# తెలుగు నేలపై కన్నడ శాసనాలు - వరంగల్ జిల్లా

- ఈమని శివనాగిరెడ్డి
9848598446

వరంగల్ జిల్లాలో మొత్తం 27 కన్నడ శాసనాలున్నాయి. ఇవి రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య రాజవంశాలకు, కాకతీయ, పొలవాస మాండలికులకు, కొరిమ జైనాచార్యులు, కాలాముఖ పండితులకు చెందినవి. క్రీ.శ. 872 వ సంవత్సరం శాసనం మొదటిది కాగా, క్రీ.శ. 14వ శతాబ్ది శాసనం చివరిది.

వరంగల్‌లోని కాజీపేటలోనున్న క్రీ.శ. 872 నాటి రాష్ట్రకూటి అమోఘవర్షుని (మొదటి) మహామండలేశ్వర సత్యాశ్రయ భీమరసు శాసనంలో అక్కడి స్థానిక అధికారులైన పెర్గడె, కరణం, తలారులకు కొంత ధనాన్ని ఇస్తూ, కొన్ని అపరాధాలకు సుంకాలను కూడా నిర్ణయించినట్లు తెలియజేశాడు. షామీరుపేటలోని పంచాయతీ కార్యాలయంలోనున్న క్రీ.శ. 999 జ్యేష్ట ఆదివారంనాటి శాసనంలో గడిపాల అగ్రహారానికి అధిపతి అయిన మంగి, రాజు వమ్మశెట్టి సోదరుడైన అత్యపశెట్టికి దశబంధ మాన్యాన్ని దానం చేసినట్లుగా చెప్పబడింది. జఫర్‌గడ్‌లోని వేల్పుగొండ మీద గల నరసింహస్వామి దేవాలయం, చెరువు దగ్గరగల ఒక బండమీదగల క్రీ.శ. 10వ శతాబ్ది నాటి శాసనంలో రాష్ట్రకూట వంశానికి చెందిన పాణార ప్రస్తావనతో పాటు, అదే వంశానికి చెందిన శంకరగండ భూప వేల్పుగొండ పైన ఒక చెరువును నిర్మించినట్లు పేర్కొనబడింది. ఈ శాసనం చివరన రాష్ట్రకూట రాజైన నృపతుంగుని ప్రస్తావన గావించటం గమనించదగ్గ విషయం. తద్వారా వరంగల్ ప్రాంతం రాష్ట్రకూటుల ఆధీనంలో ఉందని తెలుస్తుంది.



చేర్యాల పట్టణానికి దక్షిణంగా గల క్రీ.శ. 1002 నాటి కళ్యాణ చాళుక్య ప్రభువైన ఇఱవ బెడంగు దేవుని శాసనంలో, అయ్యబ్బదేవి అనే రాణి సోదరి బుబ్బె, వేరియంలగోఓవయ గావుడ బిజ్జమయ్యకు దశవంధమాన్యాన్ని దానం చేసినట్లు నమోదైంది. ఈ శాసనాన్ని అయ్యబ్బె, గోకరణయ్య, పరిగావుండల సినబోవ (లెక్కలు రాసేవాళ్లు) రాశారు.

నారాయణగిరిలోని ఊరిబయట బండపై గల క్రీ.శ. 1004 నాటి మహా సామంతాధిపతి సత్యాశ్రయ కులాన్వయ గుణగరస పాలిస్తుండగా అతని ఉద్యోగి అయిన గంగెయ, సుంకమయ్య ప్రతిష్ఠించిన మల్లికార్జున స్వామికి, కొంత భూమిని దానం చేసిన వివరాలున్నాయి. పొన్నవోలు లోని విష్ణుదేవాలయ గర్భగుడిలోనున్న క్రీ.శ. 1007 అక్టోబరు, 19వ తేది నాటి కళ్యాణ చాళుక్య రాజు ఇఱివబెడంగ దేవుని అంగరక్షకుడు, తంత్రపాలుడూ అయిన అరసప్పయ్య శాసనంలో, అయ్యన వొలాలు (ఐనవోలు) తూర్పునున్న చెరువుకు దక్షిణంగా ఉన్న 40 మరుతర్ల భూమిని వాజి కులబ్రాహ్మణుడైన కేసనమయ్యకు 'పన్నస'గా దానం చేసినట్లునూ, ఈ భూమిలో 35 ద్రమ్మల సిద్ధాయం లభిస్తుందని చెప్పబడింది. రాఘవాపురంలోని విష్ణుదేవాలయ గోడకు బిగించిన జైన ప్రతిమపై గల ఇదే కాలానికి చెందిన శాసనంలో రాచతూరి జోగసామి ఈ గ్రామంలో ఒక చెరువు త్రవ్వించినట్లు

తెలియజేస్తుంది.

బాణాజిపేటలో ఊరికి తూర్పుగా నున్న ఒక శాసనంలో క్రీ.శ. 1082, డిసెంబరు 25, ఆదివారం నాడు కళ్యాణ చాళుక్య రాజైన త్రిభువనమల్లదేవుని సామంతుడైన మహామండలేశ్వర మేడరస, మహామండలేశ్వర కాకతీయ బేతరస (రెండో బేతరాజు) ల ప్రస్తావన ఉంది. మేడరస నిర్మించిన వీరకమల జినాలయానికి కొంత భూమిని దానం చేసిన వివరాలున్నాయి. ఈ శాసనాన్ని అయ్యప్పయ్య శ్రీధర అనేవారు రాశారు.

కాజీపేటలోని క్రీ.శ. 1090, నవంబర్ 24 ఆదివారం నాటి శాసనంలో కళ్యాణ చాళుక్య రాజు త్రిభువనమల్లదేవుడు సామంతుడు మహామండలేశ్వర కాకతీయ బేతరస, అనుమకొండ పురానికి నైరుతి దిక్కున పర్వతావళి శాఖకు చెందిన కాలాముఖాచార్యుడైన రామేశ్వర పండితుని కాళ్లు కడిగి శివపురాన్ని (శివాలయాన్ని) నిర్మించినట్లు చెప్పబడింది. శ్రీ పర్వతంలోని మల్లికార్జున శిలామఠానికి చెందిన రామేశ్వర పండితుడు కొన్ని నిదాన శుల్క దండ ధన ఉప భోగాలను సర్వమాన్యంగా ఇచ్చినట్లునూ, బేతరస కుమారుడైన మహామండలేశ్వర దుగ్గన్నపతి, ఈ శాసన స్థంభాన్ని ఎత్తించినట్లునూ, బేతాళేశ్వర దేవాలయ అఖండ దీపానికి కావలసిన రోజూ మానెడు నూనెను అన్మకొండ నకరం (మార్కెట్టు) ఇచ్చినట్లు ఈ శాసనాన్ని ఒంటికొండ (వరంగల్) కు చెందినట్లునూ చెప్పబడింది. ప్రస్తుతం ఈ శాసనం ఏమైందో తెలియటం లేదు.

నిడిగొండలోని చెరువులో ఉన్న క్రీ.శ. 1104వ సంవత్సరం డిసెంబరు 24 నాటి కళ్యాణ చాళుక్య ప్రభువు త్రిభువన మల్ల దేవుని సామంతుడైన దుగ్గి భూపని శాసనంలో, అతని భార్య ముప్పాంబిక, నిడిగొండలో ముప్పేశ్వర దేవునికి ఆలయాన్ని నిర్మించిందనీ, ఆ ఆలయానికి మాండలిక దుగ్గరస 2 మరుతుర్ల తరినేలను, 20 మత్తర్ల కారంబాన్ని, రట్ట సముద్రం వెనుక దానం చేయగా, ముప్పాంబిక, గుండుమి బండకు చెందిన నేరపు గుంటను పూజారులకు సమర్పించిన వివరాలున్నాయి. బైరాన్‌పల్లిలోని జైనాలయం దగ్గరున్న క్రీ.శ. 1108 నాటి శాసనంలో, కళ్యాణ చాళుక్య రాజైన త్రిభువన మల్ల దేవుని దండనాయకుడైన బైరమరెడ్డి, బిట్టికుల తిలక

***అనుమకొండలోని పద్మాక్షి దేవాలయంలోని క్రీ.శ. 1117, డిసెంబరు 24, సోమవారం నాటి శాసనంలో చాళుక్య ప్రభువైన త్రిభువన మల్లదేవ, అతని సామంతుడైన మహామండలేశ్వర కాకతి బేతరస అనుమకొండ పురీవరాధీశ్వరుడుగా ఉన్నట్లు చెప్పబడింది.***

జినాలయంలో ఒక జన ప్రతిమను ప్రతిష్ఠించి, ఒక మామిడితోటను, 20 మర్తర్ల కరంబ భూమిని దానం చేసినట్లు చెప్పబడింది. దండనాయక బైరమరెడ్డి భువనగిరి ముఖ్యపట్టణంగా కలిగి ఉన్నాడనీ, అతడు విట్టి వంశానికి చెందిన రెడ్డి అనీ, అదే జినాలయానికి నంగునూరు పున్నిరెడ్డి, వెల్లమపట్టి రేవిరెడ్డి మరి కొంత భూమిని దానం చేసినట్లు చెప్పబడింది. మేడపల్లిలోని చెరువుగట్టు మీదున్న క్రీ.శ. 1112, డిసెంబరు 12, గురువారం నాటి శాసనంలో అచనపెగ్గడ నిర్మించిన అచేశ్వర, విష్ణుదేవులకు ఆలయాలను నిర్మించిన పర్వతోజుకు రెండు మత్తర్ల భూమిని దానం చేశాడని చెప్పబడింది.

అనుమకొండలోని పద్మాక్షి దేవాలయంలోని క్రీ.శ. 1117, డిసెంబరు 24, సోమవారం నాటి శాసనంలో చాళుక్య ప్రభువైన త్రిభువన మల్లదేవ, అతని సామంతుడైన మహామండలేశ్వర కాకతి బేతరస అనుమకొండ పురీవరాధీశ్వరుడుగా ఉన్నట్లు చెప్పబడింది. పద్మాక్షి గుట్టమీద గల కడలాలయ బసదిని, కాకతి ప్రోలుని మంత్రి, బేతని భార్య మైలమ నిర్మించి, 2 మత్తర్ల నల్లనేల, 6 మత్తర్ల కరంబ భూమిని ఆలయ అవసరాలకు పూజారుల తిండి, బట్టలకు దానం చేసినట్లు చెప్పబడింది.

గూడూరులోనున్న క్రీ.శ.1124, డిసెంబరు 24, బుధవారం నాటి శాసనంలో కళ్యాణ చాళుక్య రాజు త్రిభువన మల్ల దేవుడు జయంతీపురం నుంచి పాలిస్తుండగా, అతని కుమారుడు చాళుక్య గంగ పెర్మాడి కుమార సోమేశ్వర దేవుడు కొల్లిపాక - 7000 కు పాలకుడుగా ఉన్నాడని, అతని మహాప్రధాని దండనాయక కొల్లిపాకె సావిపయ్యల విజయాల ప్రస్తావనతో పాటు, సావిపయ్య అభ్యర్థనపై కుమార సోమేశ్వరుడు, గుముడూరులోని మల్లేశ్వర దేవునికి, వేల్పుగొండ-24 లోని బమ్మరిగెను దానం చేసినట్లు చెప్పబడింది.

వరంగల్ జిల్లాలోని కన్నడ శాసనాల్లోని విషయాలు వరంగల్ జిల్లా చరిత్ర పునర్నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

## స్వీకారం

### ఈ యుగం మాది కవిత్వం



**డా॥ కత్తి పద్మారావు**

వెల : 500/- పేజీలు: 480

ప్రతులకు : 9849741695

కవి ఉదాత్త భావాలు, కావ్యంలా రూపొందాయి. ఇన్ని విశేష భావాలు మామూలు కవులకుండవు. ఇంత విశిష్టమైన కవి అరుదైన సంఘటన. అద్భుతమైన సందర్భం. రమణీయమైన సన్నివేశం. కత్తి అభివ్యక్తిలో సూత్రీకరణలు సూక్ష్మీకరణలు ఆశ్చర్యపరుస్తాయి.

**- డా॥ కొలకలూరి ఇనాక్**

### అనంత సాహితీ సమాలోచన



**సాహితీస్రవంతి, అనంతపురం జిల్లా**


వెల : 40/- పేజీలు: 84

ప్రతులకు : 9490122229

పాతతరం సాహిత్యకారులను పరిచయం చేస్తూ కొత్త కలాలకు, గళాలకు ఊతమిస్తూ సాగుతోంది సాహితీస్రవంతి. అనంతపురం జిల్లాలో సాహితీస్రవంతి ఇప్పటికే రెండు రచనలను ప్రచురించింది. ఒకటి పిళ్ళాకుమారస్వామి రచించిన 'ప్రపంచీకరణపై పోటెత్తిన కవితా సముద్రం', రెండు 'అనంత కవితా స్వరాలు', ఇప్పుడు 'అనంత సాహితీ సమాలోచన'.

**- పిళ్ళా కుమారస్వామి**

### నిశ్శబ్ద శబ్దాలు నానీలు



**సిహెచ్.వి. బృందావనరావు**

వెల : 80/- పేజీలు: 87

ప్రతులకు : 9963399189

కొన్ని చురుకైన బాణాలు, కొన్ని ఖండించే శస్త్రాలు, కొన్ని పరిమళ కుసుమాలు, కొన్ని ఆహ్లాదకౌముదులు, కొన్ని సరదా చక్కిలిగింతలు, కొన్ని సూక్తిరత్నాలు, కొన్ని మృదువైన నెమలీకలు - ఇలా వైవిధ్యభరితం నానీల వెన్నెలవనం. ఈ వెన్నెల కిరణాలను ఆస్వాదించే చకోరాలు పాఠకులే.

**- డా॥ వై. రామకృష్ణారావు**

### సాహితీ ఉద్యమంలో కరదీపికలు (వ్యాసాలు)



**అడపా రామకృష్ణ**


వెల : 40/- పేజీలు: 84

ప్రతులకు : 99505269091

సైద్ధాంతిక అవగాహన, ఉద్యమస్ఫూర్తి ఉన్న రచయిత, సమాజాన్ని చూసే కోణం నిర్దిష్టంగా, నిష్ఠగా, నిశితంగా, నిజాయితీగా ఉంటుంది. సామాజిక రుగ్మతలను, జీవిత సంక్లిష్టతను పట్టుకోవడం చుట్టూ జరుగుతున్న అవినీతిపై గొంతెత్తడం, అవినీతి నిరోధానికి ఉద్యమించే వారికి సహకారం అందించడం ఆయా అంశాలను కవిత్వంగా, కథలుగాను మలుస్తున్న కవులు రచయితల్లో 'అడపా రామకృష్ణ' గారొకరు.

**- కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

### మేమే



**శ్రీశ్రీ, వరద, ఆరుద్ర**

**కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్**


వెల : 35/- పేజీలు: 40

ప్రతులకు : 9246277375

1953 డిసెంబర్ 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లో తెలంగాణా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవ సభలు జరిగాయి. శ్రీశ్రీ, ఆరుద్ర, ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. హిమాయత్‌నగర్‌లోని అబ్బూరి వరదరాజేశ్వరరావుగారి ఇంట్లో అతిథులుగా ఉన్నారు. ఇది అప్పుడు ముగ్గురూ కలిసి రాసింది. ఇది ప్రఖ్యాత రచన కాదు - ముగ్గురు ప్రఖ్యాత కవుల రచన. ముగ్గురు ప్రఖ్యాత కవుల మొట్టమొదటి సంయుక్త రచన.

**- శ్రీశ్రీ సాహిత్య నిధి**

### మారిపోయెరా కాలము



**టైలర్ల జీవితాల్లోని కష్ట సుఖాలను చర్చించిన నవల**

**వి. వెంకట్రావు**

వెల : 80/- పేజీలు: 216

ప్రతులకు : 9440343479

అయితే అంతమాత్రానే టైలర్లు భయపడాల్సినదేమీ లేదు. ఇది రూపం మార్పు మాత్రమే. జనం బట్టలు తొడిగినన్నాళ్ళూ మా వృత్తికి వచ్చిన డోకా ఏమీ లేదు. నిజానికి యంత్రాలు కార్మికులకు మేలే చేస్తాయి. కానీ...ప్రస్తుత వ్యవస్థలో గందరగోళం సృష్టిస్తున్నాయి. అందులో వున్న మంచి చెడ్డలు చర్చించడమే ఈ నవలలోని కథా వస్తువు. నాకు తెలిసిన జీవితాన్నీ, కళ్ళ ముందు కనిపిస్తున్న మార్పుల్ని , నా అవగాహన మేరకు చిత్రించాను.


**- వి. వెంకట్రావు**

డైరీ

# సాహితీస్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ 34వ వర్ధంతి సభలు



విజయవాడలో ఎం.బి. విజ్ఞానకేంద్రంలో జూన్15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'శ్రీశ్రీ సాహిత్యం–ఆర్థిక, రాజకీయ దృక్పథం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొండపల్లి మాధవరావు. చిత్రంలో కె. ఉషారాణి, శాంతిశ్రీ, కొత్తపల్లి రవిబాబు, సింగంపల్లి అశోక్‌కుమార్, అరసవిల్లి కృష్ణ ఉన్నారు.



అనంతపురంలో లలిత కళాపరిషత్‌లో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో కాత్యాయనీ విద్మహే పుస్తకావిష్కరణ దృశ్యం. చిత్రంలో ఎం. ప్రగతి, రాచపాళెం, సింగమనేని




అనంతపురంలో జూన్ 15న ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీ వర్ధంతి సభలో మాట్లాడుతున్న మల్లెల నరసింహమూర్తి. చిత్రంలో సాహితీస్రవంతి బాధ్యులు రసూల్, షరీఫ్



అనంతపురం జిల్లా కదిరిలో విజ్ఞాన్ బిఎడ్ కళాశాలలో జూన్ 15 జరిగిన శ్రీశ్రీ వర్ధంతి, సినారె సంస్మరణ, చిత్రంలో పిల్లా కుమారస్వామి, ఫర్జానా, సుందరమోహనరెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి తదితరులు



కర్నూలులో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో కాత్యాయని విద్మహే పుస్తకావిష్కరణ దృశ్యం. చిత్రంలో జె.యన్. శేషయ్య, ఇనయతుల్లా, కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు.



పాలకొల్లులో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణ. చిత్రంలో వి. శ్రీరామమూర్తి, దాసిరాజు, వంగా నరసింహారావు, మామిడిశెట్టి శ్రీనివాస్. గోఖలే తదితరులు



సాహితీస్రవంతి ఆధ్వర్యంలో పెద్దాపురంలో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో మాట్లాడుతున్న స్టాలిన్. చిత్రంలో జోశ్యుల కృష్ణబాబు, గనారా తదితరులు. సాహితీస్రవంతి అధ్యక్షులు జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సభలో స్టాలిన్ మాట్లాడుతూ దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో అన్ని అంగాల స్వరూపాన్ని కవిత్వంలో ఇమిడ్చి ఆయన ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. కష్టజీవికి దన్నుగా కవిత్వాన్ని అందించిన కవులందరికీ ఆయన మార్గదర్శకులయ్యారన్నారు. వస్తువు, శిల్పాన్ని మిళితం చేసి సామాజిక వాస్తవికతతో మార్పిజాన్ని అన్వయించిన కవి శ్రీశ్రీ అన్నారు.



సాహితీస్రవంతి, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆధ్వర్యంలో తిరుపతిలో జూన్ **15**న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ చిత్రంలో ముక్కోటి, ఓ. వెంకట రమణ, వి. చంద్రశేఖర్, డా॥ మౌని, అడిగోపుల వెంకటరత్నం తదితరులు.



కడపలో సాహితీస్రవంతి, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జూన్ **18**న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ కథా రచయిత్రి ఎం.ఎం. వినోదిని. చిత్రంలో ఎ. రఘునాథ రెడ్డి, చీపాటి రాజేశ్వరరావు తదితరులు



విజయవాడలో సాహితీస్రవంతి, ఎం.బి. విజ్ఞానకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జూన్ **12**న జరిగిన సినారె నివాళి సభ. చిత్రంలో ప్రజాశక్తి ప్రధాన సంపాదకులు పాటూరి రామయ్య, కొండపల్లి మాధవరావు, పి. మురళీకృష్ణ, వెంకటరెడ్డి, రాజేష్, రంగారెడ్డి, కవి పిఎన్ఎమ్



తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జూన్ **15**న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో టిపిఎస్‌కే హాలులో జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ. చిత్రంలో భూపతి వెంకటేశ్వర్లు, మహేష్ దుర్గే, కిల్లె గోపాల్, ఆశయ్య, శ్రీరాంనాయక్, ధర్మానాయక్, రమేష్, స్వామి తదితరులు



విజయవాడలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో మే **13, 14** తేదీలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆవిర్భావ సభలను ప్రారంభిస్తున్న మండలి బుద్ధ ప్రసాద్. చిత్రంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య, పాపినేని శివశంకర్, చలపాక ప్రకాష్ తదితరులు



సాహితీస్రవంతి, అరసం సంయుక్త ఆధ్వర్యంలో మే**5**న విశాఖపట్నం పౌరగ్రంథాలయంలో 'మార్క్సిజం-సాహిత్యం' అంశంపై జరిగిన సభలో ప్రసంగిస్తున్న ఎం.వి.ఎస్. శర్మ. చిత్రంలో ఎ.వి. రమణారావు, జగద్ధాత్రి, ఎ.జె. స్టాలిన్, తదితరులు

అనంతపురంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మే **24** న వామపక్షాలు నిర్వహించిన కరువు ఉద్యమానికి కవులు, రచయితలు, కళాకారులు ఒకవేదికపైకి వచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథారచయిత సింగమనేని నారాయణ, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎండి బాష, ప్రేమ్‌చంద్, బోస్, ఆశావాది ప్రకాష్‌రావు, డాక్టర్ రాధేయ, , విశాలాంధ్ర ఈరన్న, మదారు వేణుగోపాల్, పసుపులేటి సాయినాథ్, చంద్రశేఖర్, రాంమూర్తి, ఒంటెద్దు రామలింగారెడ్డి, కదలిక ఇమాం, ఓబులేసు, లక్ష్మీనారాయణ, పి. కుమారస్వామి, రవిచంద్ర, అశ్వర్థరెడ్డి, నానీల నాగేంద్ర పలువురు కవులు, రచయితలు, కళాకారులు పాల్గొని బంద్‌కు సంపూర్ణ మద్ధతు తెలిపారు.

## మెర్సీ మార్గరేట్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం


మెర్సీ మార్గరేట్

కేంద్ర సాహిత్య అకాడమీ జూన్ 22న బాల, యువ పురస్కారాలను 24 భాషల్లో 24 మందికి ప్రకటించింది. తెలుగు విభాగంలో యువ పురస్కారం మెర్సీ మార్గరేట్‌కు లభించింది. బాల సాహిత్య పురస్కారం వాసాల నరసయ్యకు లభించింది. 2011 జనవరి 1 నుండి 2015 డిసెంబర్ 31లోపు వెలువడిన పుస్తకాల్లో నామినేషన్ వేసిన వారిలో నుండి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. బాల సాహిత్య పురస్కారాలకు డి. చిన్ని కృష్ణయ్య, డి. సుజాత దేవి, డి. మధుసూదన్ రావులు జ్యూరీ మెంబర్లుగా, యువ పురస్కారానికి తెలుగు విభాగంలో ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, రామా చంద్రమౌళి, అనంత పద్మనాభ రావులు జ్యూరీ మెంబర్లుగా ఉన్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ❋


వాసాల నరసయ్య



శ్రీకాకుళం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 10న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ. చిత్రంలో బి.వి.ఎ. రామారావు నాయుడు, చింతాడ రామారావు, ప్రధాన ఆదినారాయణ, ప్రజాసాహితి నాగరాజు. డిఆర్‌కె. నాయుడు తదితరులు



సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 18న పెద్దాపురంలో జరిగిన యాసలపు సూర్యారావు 5వ వర్ధంతి సభలో కవితా గోష్టి. చిత్రంలో జోశ్యుల కృష్ణబాబు, గనారా, అద్దేపల్లి ప్రభు, కొత్తెం వెంకటశ్రీనివాసరావు తదితరులు.


విశాఖ సాహితీస్రవంతి, అరసం ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న జరిగిన శ్రీశ్రీ జయంతి కార్యక్రమం. చిత్రంలో ఉప్పల అప్పలరాజు, ఎ.వి. రమణారావు, నూనెల శ్రీనివాసరావు, నాగరాజు, చలపతి తదితరులు.


విజయవాడలో అనేక పుస్తకాల షాపులో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ సాహిత్య నిధి పుస్తకాల ఆవిష్కరణ. చిత్రంలో అరసవిల్లి కృష్ణ, హౌరప్రసాద్, కొండపల్లి మాధవరావు, రివేరా, కొత్తపల్లి రవిబాబు, సింగంపల్లి అశోక్‌కుమార్


విజయనగరంలో గురజాడ స్వగృహంలో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ. చిత్రంలో ప్రముఖ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్, కమలకుమారి, ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి.


అనంతపురం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతిపై మే 28న జరిగిన సభలో ప్రసంగిస్తున్న పి. రమేష్ నారాయణ. చిత్రంలో పి. కుమారస్వామి తదితరులు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ  నినదించిన కవి దాశరథి కృష్ణమాచార్యులు .  నిజాం నవాబుకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా ఉద్యమాలలో పాల్గొని జైలుకెళ్ళారు. ప్రసిద్ధ గేయం 'ఆ చల్లని సముద్ర గర్భంలో/దాచిన బడబాలనమెంతో/ ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో/భూలోకం పుట్టుక కోసం/రాలిన సురగోళాలెన్నో' రాసింది దాశరథే. అగ్నివీణ, అగ్నిధార తదితర రచనలు సుప్రసిద్ధాలు.



## దాశరథి కృష్ణమాచార్యులు

(22-7-1925 - 05-11-1987)

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/16-18
Date of Posting : 01.07.2017 ▪ Date of Publication: 27.06.2017




If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059